Crime News
క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

మంగళవారం, ఫిబ్రవరి 25, 2025 | సంపుటి - 20 | సంచిక 147 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

# 3 రోజులపాటు మద్యం దుకాణాలు బంద్



హైదరాబాద్ : రాష్ట్రంలోని ఏడు ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగ నున్నాయి. ఇప్పటికే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేసింది. ఆయా ప్రాంతాల్లో అభ్యర్థులు ప్రచారాలు కూడా నిర్వహి స్తున్నారు. ఈనెల 27న తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. అయితే ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు జరిగే తేదీతో పాటు మరో రెండు రోజుల పాటు మద్యం దుకాణాలను మూసివేయాలని సర్కార్ నిర్ణయించింది. ఈనెల 25 నుంచి 27 వరకు వైన్ షాప్స్ క్లోజ్ అవుతాయని

# షెడ్యూల్ వచ్చేసింది

**ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల**

**మార్చి 3న నోటిఫికేషన్, 20న ఎన్నికలు**

**మార్చి 10 నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం**

**మార్చి 20న పోలింగ్, ఓట్ల లెక్కింపు**




హైదరాబాద్ : తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. తెలంగాణలో ఐదుగురి ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. మార్చి 29 నాటికి ఐదుగురి ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. తెలంగాణలో పదవీకాలం ముగిసే వారిలో సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, శేరి సుభాష్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హాసన్ ఉన్నారు.

# మాటలే కాదు.. చేతల్లో చూపిస్తున్నాం

## వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న దేశం

**ప్రపంచ బ్యాంక్ వ్యాఖ్యలను గుర్తు చేసిన ప్రధాని**

**గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో ప్రధాని మోడీ**



భోపాల్ : భారత్ మాటలకే పరిమితం కావడం లేదని, చేతల్లోను చూపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఆర్థికరంగంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా కొనసాగు తోందని ప్రపంచ బ్యాంకు చెప్పిందని గుర్తుచేశారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరుగుతోన్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సోమవారం మాట్లాడిన ఆయన.. సదస్సులో పాల్గొన్న వారికి క్షమాపణలు తెలియజేశారు. తాను ఆలస్యంగా రావడానికి గల కారణాన్ని చెప్పారు. 10,12 తరగతి విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్ష ప్రారంభమయ్యే సమయం.. నేను రాజ్‌భవన్ నుంచి బయల్దేరే సమయం ఒకటే. అప్పుడు నేను వస్తే భద్రతా కారణాల దృష్ట్యా ట్రాఫిక్ జామ్ కావొచ్చు. దాంతో విద్యార్థులు ఇబ్బందిపడే అవకాశం ఉంది. అందుకే వారంతా పరీక్షా కేంద్రాలకు వెళ్లిన తర్వాత రాజ్‌భవన్ నుంచి బయల్దేరాలనుకున్నాను. దాంతో 15-20 నిమిషాలు ఆలస్యమైంది. ఇక్కడ మీకు అసౌకర్యం కలిగించినందుకు క్షమాపణలు కోరుతున్నానని మోదీ మాట్లాడారు.

మిగతా 2లో




# ఇరు రాష్ట్రాలు తేల్చుకోండి

**ఇరురాష్ట్రాల సీఈలు నిర్ణయానికి రావాలి**

**నీటి పంపకాలపై కేఆర్ఎంబీ వెల్లడి**

**కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం**

హైదరాబాద్ : కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక, అత్యవసర సమావేశం జరిగింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నీటి వాటాలపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కేఆర్ఎంబీ ఛైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో



# కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చేందుకు కుట్రలు

**నరేందర్‌రెడ్డి పట్టభద్రులకు ప్రభుత్వానికి వారధిగా ఉంటాడు**

**ఫామ్‌హౌస్‌కే కేసీఆర్ పరిమితం**

**బీఆర్ఎస్ ఎవరికి ఓటు వేయాలో బహిర్గతం చేయాలి**

**పోటీకి నిలపడనివారే ఎలా ప్రశ్నిస్తారు : సీఎం రేవంత్‌రెడ్డి**

నిజామాబాద్ : ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి ప్రభుత్వానికి, పట్టభద్రులకు మధ్య వారధిగా ఉంటారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీని బలహీన పర్చే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరిస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌లో పడుకున్నారని.. బీఆర్ఎస్ నాయకులు ఏ అభ్యర్థికి ఓటు వేయాలని చెబుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను గెలిపించవద్దని ప్రచారం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి నిలబడని బీఆర్ఎస్ రాజకీయ పార్టీఏ కాదన్నారు. పోటీకి నిలబడని వారు కాంగ్రెస్‌ను ఎలా ప్రశ్నిస్తారని నిలదీశారు. తమకు పరిపాలించే అవకాశం

2లో



# మానసిక క్షోభలో రాష్ట్ర ఉద్యోగులు

**రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించలేని దుస్థితి**

**ఫీజు రియంబర్స్‌మెంట్‌లో పూర్తి వివక్ష**

**14నెలల మీ పాలనలో ఏ వర్గం సంతృప్తిగా లేదు**

**ఇదంతా వదిలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారు**

**సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిని కిషన్ రెడ్డి**

హైదరాబాద్ : 14నెలల మీ పాలనలో ఆయా వర్గాలేవీ సంతృప్తిగా లేరనేది నిస్సందేహమని, ఎన్నికల్లో వారికి ఇచ్చిన హామీలను సైతం మీరు ఉద్దేశపూర్వకంగానే నీరుగారుస్తున్నారంటూ ఆయన సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. వాళ్లకు దక్కాల్సిన న్యాయమైన హక్కులను కూడా కాలరాస్తున్నారని, ఆఖరుకు ఉద్యోగులకు, పెన్షనర్లకు రొటీన్‌గా అందాల్సిన చెల్లింపులను, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను కూడా చెల్లించకుండా జాప్యం చేస్తూ వారిని తీవ్రమైన మానసిక ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకరమని ఆయన లేఖలో పేర్కొన్నారు. పెండింగ్ డీఏలు, జీపీఎఫ్ బకాయిలు, మెడికల్ బిల్లులు, గ్రాట్యుటీ పెన్షన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పేరుతో ఉద్యోగులు, పెన్షనర్లకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించడమనేది ప్రభుత్వ పాలనలో రొటీన్‌గా జరిగే వ్యవహారమన్నారు. కానీ వాటిని కూడా మీరు చెల్లించకపోవడంవల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.8,200 కోట్లు బకాయి పడ్డారు.

మిగతా 2లో

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుండా ఉద్యోగులను మానసిక క్షోభకు గురిచేయడం ఎంతవరకు న్యాయమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో 14 నెలల కాంగ్రెస్ పాలన అసంతృప్తిగా ఉందన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువత, పెన్షనర్లు, కళాశాలల యాజమాన్యాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం, నిర్లక్ష్య ధోరణిపట్ల భారతీయ జనతా పార్టీ పక్షాన తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నామని కిషన్ రెడ్డి అన్నారు.

# మూసీ సుందరీకరణ అడ్డుకుంటున్న కిషన్ రెడ్డి



**హైదరాబాద్ మెట్రో విస్తరణకు అడ్డుపుల్ల**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**నిజామబాద్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సిఎం**

**బిఆర్ఎస్, బీజేపీలపై తీవ్ర ఆగ్రహం**

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. ఒకరు కేటీఆర్ అరెస్ట్‌ను అడ్డుకుం టుంటే, మరొకరు హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ సుందరీకరణ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. నిజామబాద్‌లో శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి మాట్లడుతూ బిఆర్ఎస్, బీజేపీపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు.

మిగతా 2లో

# బీఆర్ఎస్ నేతలకు కనీస మానవత్వం లేదు

**మంత్రి కోమటరెడ్డి వెంకట్‌రెడ్డి**



హైదరాబాద్ : ఎస్ఎల్‌బీసీ ప్రమాద స్థలి దోమలపెంటకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..



# ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా

**మూజువాణి ఓటుతో ఏకగ్రీవంగా ఎన్నిక**

న్యూఢిల్లీ : అసెంబ్లీ స్పీకర్‌గా రోహిణి నియోజకవర్గం సీనియర్ బీజేపీ ఎమ్మెల్యే విజేందర్ గుప్తా ఎన్నికయ్యారు. అసెంబ్లీ సమావేశాలు సోమవారం నాడు ప్రారంభం కాగా, స్పీకర్ పదవికి విజేందర్ గుప్తా పేరును ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రతిపాదించారు. దీనికి బీజేపీ ఎమ్మెల్యే మంజిందర్ సింగ్ సిర్సా మద్దతు పలికారు. అనంతరం మూజువాణి ఓటుతో విజేందర్ గుప్తా ఎన్నిక౼య్యారు. సభా సంప్రదాయం ప్రకారం స్పీకర్‌గా విజేందర్ గుప్తా ఎన్నిక కాగానే ఆయనను ముఖ్యమంత్రి రేఖా గుప్తా, విపక్ష నేత సాదరంగా స్పీకర్ సీటు వరకూ తోడ్కొని వెళ్లారు. ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులందరికి కంటే ఎక్కువ మెజారిటీతో విజేందర్ గుప్తా గెలిచారు. తన సమీప ఆప్ అభ్యర్థిపై 37,000 ఆధిక్యంతో

మిగతా 2లో



# ఇందిరమ్మ రాజ్యంలో ప్రాణాలకు విలువ లేదు

**ఒక పక్క ప్రమాదం జరిగితే...**

**ఎన్నికల ప్రచారానికి సీఎం రేవంత్ : కేటీఆర్**

హైదరాబాద్ : ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు, కూలీల ప్రాణాలకు విలువ లేదని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. రోమ్ తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టు.. ఎనిమిది మందిని బలిపీఠం ఎక్కించి, గ్రాడ్యుయేట్స్‌కు గాలం వేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారని కేటీఆర్ విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి ఎనిమిది మంది ఆచూకీ తెలియని ఈ విపత్కర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మునిగితేలడం దిగజారుడు రాజకీయమేనని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రికే జరిగిన ఘోర దుర్ఘటనపై సీరియస్‌నెస్ లేకపోతే, ఇక అధికార యంత్రాంగానికి ఎక్కడ ఉంటది, రెస్క్యూ ఆపరేషన్ ఎలా ముందుకు సాగుతదని ప్రశ్నించారు. ఓట్ల వేటలో జిల్లాలకు జిల్లాలు చుట్టి వచ్చేందుకు ముఖ్యమంత్రికి సమయం

2లో

# 3 రోజులపాటు మద్యం దుకాణాలు బంద్

ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రకటించారు. ఫిబ్రవరి 25న సాయంత్రం 4 గంటల నుంచి 27 సాయంత్రం 4 గంటల వరకు మద్యం దుకాణాలను బంద్ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. వైన్ షాపులతో పాటు కల్లు దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు కూడా మూసివేయనున్నట్లు తెలిపారు. అలాగే హైదరాబాద్ సిటీ శివారులు మద్యం షాపులు పూర్తి బంద్ అవనున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ స్థానానికి, అదే స్థానంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా జరగనున్నాయి. ఈ రెండింటితో పాటు వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ స్థానానికి ఎన్నికలు జరుగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం ఏడు ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మద్యం షాపులను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు గ్రామాల్లో మద్యం షాపులు మూతపడతాయి. యాదాద్రి జిల్లాలో కూడా ఈ నిబంధనలు అమల్లో ఉంటాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరికలు కూడా జారీ చేశారు.

# ఇందిరమ్మ రాజ్యంలో ప్రాణాలకు విలువ లేదు

ఉంది కానీ.. ఒక్కసారి క్షతగాత్రుల ఆర్తనాదాలతో మిన్నంటుతున్న ఎస్ఎల్బీసీ టన్నెల్‌కు వెళ్లే టైమ్ లేదా అని నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల ప్రాణాలకు ఇచ్చే విలువ ఇదేనా అంటూ ధ్వజమెత్తారు. ప్రజాపాలన అంటే నోట్ల వేట.. ఓట్ల వేట మాత్రమేనా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓవైపు సహాయక చర్యలు కొలిక్కి రాకముందే, ఇరుక్కున వారు బతికుండే అవకాశం కనిపించడం లేదని సర్కారు చేతులెత్తేస్తున్న తీరు, మరోవైపు సహాయక చర్యలను పర్యవేక్షించి, బాధితుల కుటుంబాలకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత మరిచి ఎన్నికలే మా తొలి ఎజెండా అనే ముఖ్యమంత్రి, సర్కారుకు కనీస మానవత్వం కూడా లేదా అన్నారు. రోమ్ తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టు, ఎనిమిది మందిని బలిపీఠం ఎక్కించి గ్రాడ్యుయేట్స్ కు గాలం వేసేందుకు సిద్ధమైన సీఎంను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. సరైన సమయంలో కాంగ్రెస్‌కు కర్రుగాల్చి వాత పెడ్తారని ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్ నేతలకు కనీస మానవత్వం లేదు

బీఆర్ఎస్ నేతలకు మానవత్వం లేదని.. ఎస్ఎల్బీసీ ప్రమాదాన్ని రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు నిరంతరం అక్కడ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. తూఫ్రాన్ రైలు ప్రమాదంలో స్కూల్ విద్యార్థులు చనిపోతే కేసీఆర్ కనీసం వెళ్లి పరమర్శించలేదని విమర్శించారు. మీరు చేయని పనులు మేము చేస్తున్నామని.. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అందరం కలిసికట్టుగా ఉండాలన్నారు. ఆపదలో ఉన్నవారికి మనోధైర్యం ఇవ్వాలని, సురక్షితంగా తీసుకురావడానికి సలహాలు ఇవ్వాలన్నారు. ఇది రాజకీయాలు మాట్లాడే సమయం కాదని.. అందరినీ బయటకు తెచ్చిన తర్వాత మళ్లీ పనులు మొదలు పెడతామని.. ఆ తర్వాత బీఆర్ఎస్ వాళ్ల సంగతి చెబుతామన్నారు. గత ప్రభుత్వం (బీఆర్ఎస్) ఎస్ఎల్బీసీని నిర్లక్ష్యం చేసిందని, మేము దాన్ని పూర్తి చేయాలని భావిస్తే ఇలాంటి ప్రమాదం జరగడం బాధాకరమని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అందులో చిక్కుకున్న 8 మంది క్షేమంగా బయటకు రావాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని అన్నారు. సొరంగం గురించి, ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదన్నారు. పదేళ్లు సొరంగాన్ని ఎందుకు పట్టించుకోలేదో చెప్పాలని.. కాళేశ్వరంలో చిన్న చిన్న సొరంగం పనులకు ఎంతో మంది చనిపోయారని, కాళేశ్వరంలో చనిపోతే బీఆర్ఎస్ నేతలు ఏమైనా రెస్క్యూలు చేశారా అని కోమటిరెడ్డి ప్రశ్నించారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు సాధారణ సెలవు

### ఎన్నికల వేళ రిటర్నింగ్ అధికారి కీలక ఆదేశాలు

హైదరాబాద్ : తెలంగాణలో ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో.. ఈ నెల 27న .. మెదక్ -నిజామాబాద్ -కరీంనగర్ -ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. దీనిలో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగుల కోసం రిటర్నింగ్ అధికారి కీలక ఉత్తర్వులు జారీ చేశారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు వర్తిస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో వెల్లడించారు. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నమోదిత ఓటర్లుగా ఉన్నవారు తమ ఓటు వినియోగించుకునేందుకు ఈ ప్రత్యేక సెలవు వర్తిస్తుందని ఆదేశాలలో వెల్లడించారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, పారిశ్రామిక సంస్థ లేదా ఇతర అన్ని ప్రైవేట్ మేనేజ్మెంట్, అథారిటీలలో పని చేస్తూ గ్రాడ్యుయేట్ ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు, కార్మికులు స్వెతం వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజమాన్యాలు అనుమతి ఇవ్వాలని, ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పనిచేస్తున్న వారికి వెసులుబాటు ఇవ్వాలని కూడా రిటర్నింగ్ అధికారి కలెక్టర్ పమేలా సత్పతి కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా.. ప్రైవేటు ఉద్యోగులు, కార్మికులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు షిఫ్టుల సర్దుబాటు చేయాలని ఆదేశించారు. డ్యూటీ గంటల తగ్గింపు, ఆలస్యంగా హాజరుకావడానికి అనుమతి వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు.అయితే.. ముఖ్యంగా.. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులందరూ.. తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి కీలక ఆదేశాలు జారీ చేశారు. దీని కోసం ప్రత్యేక సాధారణ సెలవు, వెసులుబాట్లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు.

# మేడిగడ్డ అంశంపై తీర్పు రిజర్వు

నిజామాబాద్ : మేడిగడ్డ అంశంపై కేసీఆర్ వేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం.. తీర్పును రిజర్వ్ చేసింది. మేడిగడ్డ కుంగిన వ్యవహారంపై భూపాలపల్లి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కేసీఆర్, హరీష్ రావులు హైకోర్టులో సవాల్ చేశారు. లోయర్ కోర్టులో పిటిషన్ వేసిన రాజలింగమూర్తి చనిపోయాడని కోర్టుకు తెలిపారు కేసీఆర్ తరపు అడ్వకేట్. అయితే, కేసు వేసిన పిటిషనర్ చనిపోయినా.. పిటిషన్ మెయిన్‌టేనబుల్ అని పీపీ వాదించారు. పిటిషనర్ చనిపోయినా లీగల్ హైర్‌ను ఇంప్లీడ్ చేసి మళ్లీ లోయర్ కోర్టుకు రిఫర్ చేయాలని ధర్మాసనాన్ని కోరారు పీపీ. అయితే, పీపీ వాదనలను వ్యతిరేకించారు కేసీఆర్ తరపున లాయర్. లీగల్ హైర్‌ను ఇంప్లీడ్ చేయడం అనేది సమన్స్ కేసుకకు మాత్రమే వర్తిస్తుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇది క్రిమినల్ పిటిషన్ కాబట్టి లీగల్ హైర్‌కు ఆస్కారం లేదన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం.. తీర్పును రిజర్వ్ చేసింది.

# మాటలే కాదు..చేతల్లో చూపిస్తున్నాం

భారత ఆర్థిక వ్యవస్థపై ప్రపంచం ఆశాభావంతో ఉందని మోదీ అన్నారు. జనాభాపరంగా మధ్యప్రదేశ్ ఐదో అతిపెద్ద రాష్ట్రం. వ్యవసాయం, ఖనిజాల పరంగా ముందువరుసలో ఉంది. రెండు దశాబ్దాలుగా ఈ రాష్ట్రంలో ఎన్నో మార్పులు సంభవించాయి. ఇక్కడ భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం సుపరిపాలనపై దృష్టిసారించింది. 20 సంవత్సరాలకు ముందు ఇక్కడికి రావాలంటే పెట్టుబడిదారులు ఆలోచించేవారు. కానీ ఇప్పుడు పెట్టుబడుల పరంగా ముందువరుసలో ఉంది. అలాగే సౌరశక్తిలో భారత్ సూపర్ పవర్‌గా మారిందని ఐక్యరాజ్యసమితికి చెందిన ఓ విభాగం కీర్తించింది. ఇతర దేశాలు మాటలతో ఆగిపోతుంటే.. భారత్ చెప్పింది చేసి చూపించిందని ఆ సంస్థే పేర్కొంది. ఈ వ్యాఖ్యలు పెట్టుబడిదారుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. మంగళవారం కూడా ఈ సమ్మిట్ జరగనుంది. దీనికి 60 దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ఆయా దేశాల దౌత్యవేత్తలు పాల్గొన్నారు. భారత వ్యాపారరంగ ప్రముఖులు కుమార్ మంగళంబిర్లా, గౌతమ్ అదానీ, నాదిర్ గోద్రెజ్ తదితరులు హాజరయ్యారు.

# కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చేందుకు కుట్రలు

తక్కువగా వచ్చిందని.. అయినా 55,163 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పుకొచ్చారు. స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని.. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్ వన్ పోస్టు ఇచ్చామన్నారు. వరంగల్‌కు చెందిన దీప్తికి గ్రూప్ 2 ఉద్యోగం ఇచ్చినట్లు చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులను ముప్పుతిప్పలు పెట్టారని.. పదేళ్ల పాటు కోచింగ్ సెంటర్ల చుట్టూ తిప్పారని విమర్శించారు."నేను చెప్పింది నిజమైతేనే మాకు ఓటు వేయండి" అని కోరారు. నిజామాబాద్ రైతులు పంజాబ్ రైతులతో పోటీపడి పంటలు పండిస్తారన్నారు. రైతు రుణమాఫీ చేశామని.. రైతు భరోసా ఇచ్చామని తెలిపారు. కేసీఆర్ సర్కారు చేసిన అప్పుకు ఇంత వరకు 75 వేల కోట్ల వడ్డీ కట్టామన్నారు. తాను సీఎం అయ్యాక ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీనెల ఒకటో తేదీన జీతం ఇస్తున్నామన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ 8 వేల కోట్లు బకాయి పెట్టారని.. రాబోయే రోజుల్లో నెలకు వెయ్యి కోట్ల చొప్పున చెల్లిస్తామని ప్రకటించారు. 'బండి సంజయ్ బడా బీసీ అంటున్నాడు. మీరు పదేళ్లలో కులగణన ఎందుకు చేయలేదు. మీకోసం లెక్కలు తేల్చి నేను కొట్లాడుతున్నా. బలహీన వర్గాల లెక్కలు తప్పైతే ఆధారాలతో చూపండి. సొల్లు మాటలు వద్దు. గుజరాత్‌లో 29 కులాల ముస్లింలు బీసీ రిజర్వేషన్లు అనుభవిస్తున్నారు. మాదిగ ఉప కులాల వర్గీకరణ చేసి చట్టసభల్లో ఆమోదించాం. మోదీ, కృష్ణ మాదిగను కౌగిలించుకున్నాడు కానీ వర్గీకరణ చేయలదన్నారు. జర్నలిస్టుల సమస్యలు పట్టించుకుని పరిష్కరిస్తున్నామని తెలిపారు. టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు అరెస్ట్ కాకుండా అడ్డుకుంటుంది బండి సంజయ్, కిషన్ రెడ్డి. ఈ కార్ రేసులో కేటీఆర్‌ను ఈడీ ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు.మూసీ ప్రక్షాళనకు నిధులు రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. పట్టభద్రులు అండగా నిలబడండి.. కేంద్రంతో కొట్లాడి నిధులు తెస్తా" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దూరదృష్టి ఉన్న నాయకుడు రేవంత్ రెడ్డి అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ అన్నారు. పట్టభద్రుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ ధైర్యంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. 9 మాసాల్లో 56 వేల ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. బీజేపీ కేంద్ర మంత్రులు కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తెచ్చింది సున్నా అంటూ వ్యాఖ్యలు చేశారు. ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. పట్టభద్రులు ఆలోచించి ఓట్లు వేయాలని మహేష్ కుమార్ కోరారు.

# షెడ్యూల్ వచ్చేసింది

ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. మహమూద్ అలీ, శేరి సుభాష్‌రెడ్డి, సత్యవతి రాథోడ్?లు బీఆర్?ఎస్? నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎగ్గె మల్లేశం మాత్రం కొద్ది నెలల క్రితమే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. మీర్జా సహన్ ఎమ్?ఐఎమ్? నుంచి ఎమ్మెల్సీలుగా ఉన్నారు. తాజా రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్యేల సంఖ్య బలాన్ని పరిశీలిస్తే ఈ ఎన్నికల్లో నాలుగు సీట్లను అధికార కాంగ్రెస్, ఒక స్థానాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్ దక్కించుకునే అవకాశం ఉంది. తెలంగాణలోనూ ఐదుగురు ఎమ్మెల్సీలు పదవీ కాలం ముగుస్తోంది. మహమ్మూద్ ఆలీ, సత్యావతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, యగ్గే మల్లేశం, మీర్జా రియాజుల్ హస్సేన్ పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. వీరిలో నలుగురు బీఆర్ఎస్ కు చెందిన వారు.. ఒకరు మజ్లిస్ కు చెందిన వారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు దక్కనున్నాయి. ప్రస్తుతం అసెంబ్లీలో బలా బలాల ఆధారంగా కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది. ఒక సీటును మజ్లిస్ సాయంతో గెలుచుకోవచ్చు. అంటే బీఆర్ఎస్ ఒక్క సీటు లభిస్తుంది. పది మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడం ఆ పార్టీకి మైనస్. మజ్లిస్ కు కాంగ్రెస్ పార్టీ ఓ సీటు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. అద్దంకి దయాకర్ , జీవన్ రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి, నీలం మధు ముదిరాజ్, బస్వరాజ్ సారయ్య పేర్లు ప్రచారంలో ఉన్నాయి. బీఆర్ఎస్ తరపున ఎవరికి చాన్సిస్తారన్న దానిపై ఇంకా ఆ పార్టీలో ఎలాంటి చర్చ జరగడం లేదు. కేసీఆర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇక ఏపీలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలు కూటమికే దక్కనున్నాయి. యనమల, జంగా కృష్ణమూర్తి , డి.రామారావు, పి.అశోక్‌బాబు, తిరుమలనాయుడు పదవీకాలం మ్మగుస్తోంది. వీరిలో ఒక్క జంగా కృష్ణమూర్తి తప్ప అందరూ టీడీపీకి చెందిన వారే. అయితే జంగా కృష్ణమూర్తి కూడా ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. ఐదుగురు తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్సీల పదవి కాలం ముగుస్తోంది. ఇప్పుడు ఐదు ఎమ్మెల్సీ సీట్లు కూటమికే దక్కనున్నాయి. ఐదు సీట్లలో ఒకటి జనసేన పార్టీకి ఇంతకు ముందే ఖరారు చేశారు. జనసేన ప్రధాన కార్యదర్శి, పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబుకు ఈ ఎమ్మెల్సీ సీటును ప్రకటించారు. తర్వాత ఆయనను మంత్రి వర్గంలోకి కూడా తీసుకోనున్నారు. బీజేపీకి ఏమైనా ఎమ్మెల్సీ సీట్లను కేటాయిస్తారా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. ఇటీవల రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి రాజ్యసభ సీటును బీజేపీకి కేటాయించే అవకాశం ఉంటే.. మిగిలిన నాలుగు ఎమ్మెల్సీ సీట్లను తెలుగుదేశం పార్టీ నాయకులకు కేటాయించే అవకాశం ఉంది.

# మూసీ సుందరీకరణ అడ్డుకుంటున్న కిషన్ రెడ్డి

హైదరాబాద్ మెట్రో విస్తరణ విషయంలో కేంద్రం సహకరించకుండా తెలంగాణకు చెందిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు రేవంత్. మెట్రో విస్తరణకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేగంగా కార్యచరణ మొదలుపెట్టింది. నిధులు కొరత ఉన్నప్పటికీ సొంత నిధులతోనైనా ముందుకు సాగేందుకు విశ్వప్రయత్నాలు చేసింది. అయితే భూసేకరణతోపాటు మెట్రో విస్తరణకు అవసరమైన వేలకోట్ల రూపాయలు నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారాయి. అందులోనూ ఉచిత బస్సు, రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మెట్రోను విస్తరించడం భారంగా మారింది. ఈ నేపథ్యంలో కేంద్రంపై ఆధారపడక తప్పలేదు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి . కిషన్ రెడ్డిపై చేసినవి ఆరోపణలు కాదని, తనకు బీజేపీ మంత్రులతో పరిచాయాలున్నాయని, వాళ్లే చెప్పారని రేవంత్ అనడం మాట్లడటం రాజకీయ దుమారం రేపుతోంది.నిధులు విడుదల చేసి, మెట్రో విస్తరణకు సహకరిస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పేరు వస్తుందే కానీ, బీజేపీకి రాదు అని కిషన్ రెడ్డి చెప్పారని రేవంత్ రెడ్డి అన్నారు. మెట్రో ముందుకు వెళ్లకుండా ఆపుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ అభివృద్ధి చెందడం కిషన్ రెడ్డికి ఇష్టం లేదంటూనే తీవ్ర స్థాయిలో విమర్శించారు. మూసీ ప్రక్షాళన, సుందరీకరణ ప్రాజెక్టు విషయంలో కేంద్రం నుంచి ఏమాత్రం సహకారం రాకపోవడానికి ప్రధాన కారణం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డేనని ఆరోపించారు రేవంత్. యూపిలో గంగా, గుజరజాత్‌లో సబర్మతి, ఢిల్లో యమున ఇలా అనేక నదులు ప్రక్షాళన చేసిన కేంద్రానికి అదే హైదరాబాద్‌లో మూసి ప్రక్షాళన ఎందుకు కనిపించడలేదన్నారు. మూసీ సుందరీకరణకు కేంద్రం నుంచి నిధులు రాకుండా, పర్యావరణ అనుమతులు ఇవ్వకుండా కావాలనే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పాలమూరు ఎత్తిపోతల పథకంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు కేంద్రం సహకారం లేకుండా నిలిచిపోతున్నాయంటే దానికి ప్రధాన కారణం కిషన్ రెడ్డి మాత్రమేనని రేవంత్ ఆరోపించారు. సిఎం హొదాలో ఉండి ఓ కేంద్రమంత్రిపై అందులోనూ ఇదే రాష్ట్రానికి చెందిన సినీయర్ బిజెపి నేతపై చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. హైదరాబాద్‌లో మూసీ పరివాహక ప్రాంత ఓటర్ల ఓట్లతో గెలిచిన కిషన్ రెడ్డి అదే మూసీ అభివృద్ధిని ఎందుకు ఓర్వలేకపోతున్నారని నిప్పులు చెరిగారు రేవంత్. కేవలం ఆరోపణలు చేయడమే కాదు, అదే పార్టీకి చెందిన మంత్రులు చెప్పారని అనడం మరింత అగ్గి రాజేసింది.

# 43 శైవక్షేత్రాలకు 3,000 ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ : మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు వెళ్లేందుకు 43 శైవక్షేత్రాలకు 3,000 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈ ప్రత్యేక బస్సులు ఫిబ్రవరి 24 నుంచి ఫిబ్రవరి 28 వరకూ అందుబాటులో ఉంటాయని భక్తులకు తీపి కబురు చెప్పింది. శ్రీశైలానికి 800, వేములవాడకు 714, ఏడుపాయలకు 444, కీసరగుట్టకు 270, వేలకు 171, కాళేశ్వరానికి 80, కొమురవెల్లికి 51 బస్సులతోపాటు అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప ఆలయాలకు సైతం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వెల్లడించింది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లాలనుకునే భక్తులకు ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేబీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్ ప్రాంతాల్లో బస్సులు అందుబాటులో ఉంటాయని టీజీఎస్?ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక బస్సుల టికెట్ ధరలను 50 శాతం వరకూ పెంచినట్లు ఆయన వెల్లడించారు. అయితే సాధారణ సర్వీసుల టికెట్ ఛార్జీలలో ఎలాంటి మార్పులు చేయలేదని సజ్జనార్ పేర్కొన్నారు. మరోవైపు ఏడుపాయలకు వెళ్లే ప్రత్యేక బస్సులకు సవరించిన ఛార్జీలు ఫిబ్రవరి 26- 28 మధ్య వర్తిస్తాయని ఆయన తెలిపారు. గత శివరాత్రి కంటే ఈసారి ఆర్టీసీ యాజమాన్యం 809 అదనపు ప్రత్యేక బస్సులను నడుపుతోందని చెప్పుకొచ్చారు. అయితే మహాశివరాత్రి ప్రత్యేక బస్సులలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం అమలులో ఉంటుందని సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం, వేములవాడకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. వెబ్‌సైట్‌లో బస్ టికెట్లు బుకింగ్ చేసుకోవచ్చని చెప్పారు. మహా శివరాత్రి ప్రత్యేక బస్సుల గురించి మరిన్ని వివరాల కోసం టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలని సజ్జనార్ సూచించారు.

# రైతుల కష్టాలు చూస్తుంటే బాధేస్తుంది

హైదరాబాద్ : రాష్ట్రంలో రైతుల కష్టాలు చూస్తుంటే బాధ కలుగుతుందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మొన్న మహబూబాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ కోసం పోలీసులు టోకెన్లు జారీ చేస్తే.. నేడు జగిత్యాలలో రైతులు పాస్ బుక్కులు, ఆధార్ కార్డులు క్యూలో పెట్టిన పరిస్థితి నెలకొందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని రైతుల కన్నీళ్ల కడగండ్లను కాంగ్రెస్ సర్కార్ పునరావృతం చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో రైతే రాజుగా ఉన్న తెలంగాణలో రైతన్నను నట్టేట ముంచి, నడి రోడ్డు మీదకు తెచ్చిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందని హరీశ్‌రావు విమర్శించారు. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. యూరియా కోసం రైతులు మండుటెండల్లో తంటాలు పడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు డిక్లరేషన్ అని దగా చేసి, రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్ పేరుతో మోసం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను కంట నీరు పెట్టిస్తున్నరని అన్నారు. ఇప్పటికైనా కళు తెరిచి రైతాంగానికి అవసరమైన యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

# ఇరు రాష్ట్రాలు తేల్చుకోండి

హైదరాబాద్ జలసౌధలో సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శితో బోర్డు ఛైర్మెన్ సమావేశానికి హాజరయ్యారు.ప్పటికే ఏపీ ఎక్కువ నీటిని వినియోగించుకున్నందన్న తెలంగాణ శ్రీశైలం నుంచి ఏపీ నీటి వినియోగాన్ని పూర్తిగా ఆపాలని డిమాండ్ చేసింది. నీటి అవసరాలపై ఇరురాష్ట్రాల సీఈలు నిర్ణయానికి రావాలన్న కేఆర్ఎంబీ సాగర్ కింద పంటల దృష్ట్యా నిర్ణయం తీసుకోవాలని కోరింది. ప్రస్తుత ఏడాది కృష్ణా జలాల్లో తెలంగాణకు 131, ఆంధ్రప్రదేశ్ కు 27 టీఎంసీలు మిగిలి ఉన్నాయని ఇటీవల బోర్డు తేల్చింది. ఈ నెల11 వ తేదీ వరకు నాగార్జున సాగర్?లో 510 అడుగుల పైన 63, శ్రీశైలంలో 834 అడుగుల పైన 30 టీఎంసీల నీరు మిగిలి ఉంది. రెండు జలాశయాల్లో నీటి నిల్వలు, జూన్ - జూలై వరకు తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని వివిధ ఔట్ లెట్ల నుంచి నీరు తీసుకునే ప్రణాళిక వివరాలు ఇవ్వాలని రెండు రాష్ట్రాలను ఇప్పటికే బోర్డు కోరింది. అటు ఆంధ్రపదేశ్ ఎక్కువ నీటిని ఉపయోగించుకుంటోందని, తెలంగాణ ప్రభుత్వం బోర్డు కేంద్ర ప్రభుత్వానికి కొన్ని రోజులు క్రితం ఫిర్యాదు చేసింది.

# ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా

ఆయన గెలుపొందారు. కాగా, సోమవారంనాడు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ అరవింద్ సింగ్ లవ్లీ చేత లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించారు. తొలుత రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేయగా, క్యాబినెట్ మంత్రులు, ఇతర బీజేపీ ఎమ్మెల్యేలు, ఆప్ ఎమ్మెల్యేలు వరుసగా ప్రమాణస్వీకారం చేశారు. ఒకవైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగానే బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆప్ ప్రయత్నాలు ప్రారంభించింది. మహిళలకు రూ.2.500 ఆర్థిక సాయం ఇస్తామని ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం రేఖాగుప్తా కార్యాలయం వద్ద మాజీ ముఖ్యమంత్రి అతిషి, ఆప్ ఎమ్మెల్యేలకు నిరసనలకు దిగారు. మార్చి 8వ తేదీన తొలి ఇన్‌స్టాల్‌మెంట్ మహిళా లబ్దిదారులకు చేరాలని డిమాండ్ చేశారు.
కుంభమేళాపై వక్రబుద్ధి

# తప్పుడు కథనాలపై అధికారుల చర్యలు

### 140 సోషల్ మీడియా అకౌంట్స్ సీజ్

ప్రయాగ్‌రాజ్ : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా మరో రెండు రోజుల్లో ముగియనుంది. 45 రోజుల పాటూ సాగే ఈ కుంభమేళాలో ఇప్పటికే 60 కోట్ల మందికిపైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అయితే, మహాకుంభ్‌పై తప్పుదారి పట్టించే కంటెంట్ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. కొందరు దీనిపైనా దురుద్దేశ్య పూర్వక కథనాలు ప్రసారం చేపట్టారు. దీంతో వీటిపై అధికారులు చర్యలు చేపట్టారు. మహాకుంభ్‌పై తప్పుదారి పట్టించే కంటెంట్‌ను వ్యాప్తి చేసిన 140 సోషల్ మీడియా అకౌంట్స్‌పై కేసు నమోదు చేసినట్లు మహాకుంభ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వైభవ్ కృష్ణ వెల్లడించారు. ఆయా సోషల్ మీడియా ఖాతాలపై 13 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. ఇక ఈ మహాకుంభమేళా ముగింపు రోజు ఫిబ్రవరి 26న జరగనున్న మహాశివరాత్రి పండుగకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆరోజు పెద్ద సంఖ్యలో జనం ప్రయాగ్‌రాజ్‌కు వస్తారని అంచనా వేసినట్లు చెప్పారు. ఈ మేరకు మహాకుంభ్ ప్రాంతంలో ఎక్కడా ట్రాఫిక్ జామ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎంత మంది యాత్రికులు వచ్చినా పోలీసు యంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. కాగా, పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13న ఈ మహాకుంభమేళా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26 శివరాత్రితో ముగియనుంది. దాదాపు 45 రోజుల పాటు సాగే ఈ కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు కోట్లాదిగా తరలివస్తున్నారు. అక్కడ గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఈ కుంభమేళా ముగియనుంది.

# కుంభమేళా తిరుగు ప్రమాణంలో ప్రమాదం

### ప్రమాదంలో కారు డ్రైవర్ కూడా మృతి

వారణాసి : మహాకుంభమేళాకు వెళ్లివస్తూ తిరుగు ప్రయాణంలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. వీరంతా సంగారెడ్డి జిల్లా వాసులుగా గుర్తించారు. కుంభమేళా ముగింపు దశకు చేరుకోవడంతో ఎంతో మంది భక్తులు తరలివెళ్లి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేస్తున్నారు. అందరిలాగే సంగారెడ్డి జిల్లాకు చెందిన కొందరు భక్తులు మహాకుంభమేళాకు వెళ్లారు. అక్కడ పుణ్యస్నానాలు ఆచరించారు. మహాకుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించడంపై వారంతా ఎంతో భక్తిపారవశ్యంతో మునిగిపోయారు. తిరిగి సొంత జిల్లాకు వెళ్లేందుకు పయనమయ్యారు. కానీ అంతలోనే అనుకోని ఘటన పెను విషాదాన్ని నింపింది. వీరు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారణాసి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు సంగారెడ్డి జిల్లా వాసులు మృత్యువాతపడ్డారు. కుంభమేళాకు వెళ్లి వస్తుండగా భక్తులు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. రోడ్డుపై వస్తుండగా వారికి ఎదురుగా ఉన్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయే సమయంలో అటుగా వస్తున్న టిప్పర్‌ను కారు బలంగా ఢొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో జహీరాబాద్ ఇరిగేషన్ డీఈ వెంకటరామిరెడ్డి (46), భార్య విలాసిని (40) మృతి చెందారు. అలాగే కారు డ్రైవర్ మల్లారెడ్డికి కూడా మృత్యువాతపడ్డారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

**• అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి • ప్రతి జర్నలిస్టుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్ సౌకర్యం కల్పించాలి • టిడబ్ల్యుజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కు వినతిపత్రం అందించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ఇంచార్జి వల్లాల జగన్ లు మాట్లాడుతూ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. జర్నలిస్టులందరికి వెంటనే ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టులకు కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టి, ఉద్యోగుల మాదిరిగా ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా కృషి చేయాలని అన్నారు. కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందని, ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేసిందని, వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త కార్డులివ్వాలని అన్నారు.ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని అన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, ప్రత్యేక రక్షణ చట్టాన్ని తేవాలని అన్నారు. అర్హత ఉన్న చిన్న, మధ్య తరహా పత్రికలు ఎంపానెల్మెంట్లో చేర్చాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులందరికీ ఉచిత బస్ సదుపాయం కల్పించాలని అన్నారు.రైల్వే పాసులను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుంక మహేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఫణి సుదర్శన్, నాయకులు ఇరుకుల్ల వీరేశం,సాబీర్ పాషా, సబ్బు సతీష్, చొప్పరి సుమన్, రవి, సాగర్, సల్పాల ప్రశాంత్, శ్రీనివాస్, శోభన్, ప్రభాకర్ స్వామిలతోపాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# వైభవంగా మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవం



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 24( ది క్రైమ్ న్యూస్):** మల్లన్న స్వామి వారి కళ్యాణానికి కుటుంబ సమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓదెల శ్రీ. మల్లికార్జున స్వామి వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం రోజున కుటుంబ సమేతంగా హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కుటుంబ సమేతంగా తిలకించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ.. మల్లిఖార్జున స్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో అభివృద్ధి చేయుటకు శాయశక్తులా కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మల్లన్న స్వామి దయతో పెద్దపల్లి ప్రాంత ప్రజలందరు సుఖశాంతులతో సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే విజయరమణ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓదెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్, చీకట్ల మొండయ్య, రెడ్డి రజనికాంత్, ఆకుల మహేందర్, నాగపూరి రావి, బోడగుంట శంకర్, చొప్పరి రాజయ్య, అంకం రమేశ్,అజ్జు, రాకేష్,కుమార స్వామి, దేవేందర్, వీరయ్య, గోపతి సాది, చింతం కుమార స్వామి, పచ్చిమాట్ల శ్రీనివాస్, నర్సింగం మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు....

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలి

**- మాదిగ మిత్ర మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటగిరి పాపయ్య**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సుప్రీం కోర్టు తీర్పు మేరకు మాదిగలకు రిజర్వేషన్లు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతుగా కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని గెలిపించాలని మాదిగ మిత్ర మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటగిరి పాపయ్య పిలుపునిచ్చారు.సోమవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాదిగల వర్గీకరణకు 9 శాతం చేసినందుకు కాంగ్రెస్ పార్టీ మాదిగలకు మద్దతుగా ఉన్నామని తెలిపారు. మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ రావాలని మందకృష్ణ మాదిగ విజ్ఞప్తి పరిగణంలోకి తీసుకొని చట్టపరంగా న్యాయం చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని అన్నారు. కాబట్టి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో పట్టభద్రులు గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది ఇరుగురాల సంతోష్, అరికిల్ల లక్ష్మణ్, తదితులు పాల్గొన్నారు.

# సిఎం సభకు తరలిన హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు..

**- ప్రణవ్ ఆధ్వర్యంలో సిఎం సభకు తరలిన పట్టభద్రులు**

**- పట్టభద్రుల సమస్యలను పరిష్కరిస్తాము**



**జమ్మికుంట ఫిబ్రవరి 24 (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఏస్ఆర్ఆర్ కాలేజీ గ్రౌండ్ లో జరిగిన పట్టభద్రుల సంకల్ప సభకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. సభమధ్యలో సీఎం రేవంత్ రెడ్డి ప్రణవ్ ను ఆత్మీయ పలకరింపు చేశారు.అనంతరం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న అల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డినీ గెలిపిస్తే పట్టభద్రుల సంక్షేమంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి పట్టభద్రులకు వారధిగా నరేందర్ రెడ్డి ఉంటాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ పట్టభద్రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# క్రింది స్థాయి ఉద్యోగులతో మమేకమై పనిచేయాలి

**- సింగరేణి ఏరియా జీఎం బండి వెంకటయ్య**



**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** క్రింది స్థాయి ఉద్యోగులతో మమేకమై పని చేయాలని సింగరేణి రామగుండం రెండవ ఏరియా జనరల్ మేనేజర్ బి. వెంకటయ్య అన్నారు. సోమవారం ఉదయం ఆయన స్థానిక నిమ్ శిక్షణ కేంద్రంలో సింగరేణి సంస్థలో అండర్ మేనేజర్ డిప్యూటీ మేనేజర్లుగా ఎంపికైన 38 మంది అభ్యర్థులకు శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరికి వారం రోజుల పాటు సంస్థలోని వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అండర్ మేనేజర్లు, డిప్యూటీ మేనేజర్లు తమ క్రింది స్థాయి ఉద్యోగులతో కలిసి మెలిసి వారితో మమేకమై, వారి సాదక బాదలను అడిగి తెలుసుకుంటూ విధులు నిర్వహించాలన్నారు. అలాగే ఈ శిక్షణా తరగతుల ద్వారా ప్రతిభ, సామర్థ్యం, పని సంస్కృతలను పెంచుకుంటూ ముందుకు సాగి సంస్థ పురోగతికి కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణా తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓ టు జీఎం ఎం.రాముడు, నిమ్ కేంద్రం డిజిఎం ఎస్డీఎం.హుస్సైనీ, జియాలజిస్ట్ నాగరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ మోసాల పై ప్రజలకు అవగాహన

**జగిత్యాల, మల్యాల (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా మల్యాల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోజు రోజుకు సైబర్ క్రైమ్ నేరాలు ఎక్కువ అవుతున్న కారణంగా సోమవారం మల్యాల గ్రామపంచాయితీ మైన్ కూడలిలో సైబర్ క్రైమ్ మోసాల గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మల్యాల పోలీస్ శాఖ, అధికారులు గ్రామస్తులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు...




# సర్వేయర్ల రికార్డుల నిర్వహణ పటిష్టంగా చేయాలి

**- ఎనిమిది మంది సర్వేయర్లకు ల్యాప్ టాప్‌లను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** భూముల సర్వే సరిహద్దు రికార్డుల నిర్వహణ పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో జిల్లాలోని సర్వేయర్ల కు నూతనంగా 8 ల్యాప్ టాప్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ సర్వేయర్లు పని తీరు మెరుగు పర్చుకోవాలని, వారి నాణ్యమైన పనితీరుకు దోహదపడే విధంగా నూతనంగా అందించిన 8ల్యాప్ టాప్ లను వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్ శ్రీనివాసులు, సర్వేయర్లు అనిల్, సునీల్, నరేష్, శ్రీనివాస్ కృష్ణప్రియ ,రాధిక, రాజశేఖర్, చారి, రఘుపతి, సాయి చరణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చొరవ చూపాలి

**- వాహన డ్రైవర్ల సమగ్ర సంక్షేమానికి కృషి చేస్తా**

**- ఏడిడబ్ల్యూఏఐ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** వాహన డ్రైవర్లు ఎదురుకుంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని భారత వాహన డ్రైవర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండవేన స్వామి కోరారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నగరంలో జరిగిన జాతీయ వాహన డ్రైవర్ల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గుండవేన స్వామి మాట్లాడుతూ, 25రాష్ట్రాలకు తమ సంఘం విస్తరించిందని, మరిన్ని రాష్ట్రాలకు చేరుకునేలా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణాలో సైతం వాహన డ్రైవర్ల సమస్యలు, అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. సభ్యులంతా సంఘటితంగా ముందుకు సాగి హక్కుల సాధనకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.అనంతరం జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురేంద్రప్రసాద్, ప్రకాశ్ కుమారసింగ్ ఆద్వర్యంలో గుండవేన స్వామిని ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో తెలంగాణా రాష్ట్రానికి చెందిన పలువురు వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

# గైనకాలజిస్ట్ పోస్టులకు భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహణ

**- జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఫిబ్రవరి 25న గైనకాలజిస్ట్ పోస్టులకు భర్తీకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహణ జరుగుతుందని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో గల తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న 2 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (గైనకాలజిస్ట్) , కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఫిబ్రవరి 25న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని అన్నారు.ఆసక్తి గల వైద్యులు తమ యొక్క దరఖాస్తు బయోడేటా తో పాటు అన్ని విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్ల తో పాటు జిరాక్స్ ప్రతులు ఒక సెట్ తో హాజరు కావాలని, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు (గైనకాలజిస్ట్) కు నెలకు లక్ష రూపాయల వేతనం ఉంటుందని , ఇతర వివరాలకు 8499061999 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రకటనలో పేర్కొన్నారు.

# శ్రీధర్ బాబు సోదరుని జన్మదిన వేడుకలు





**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోదరుడు శ్రీనుబాబు జన్మదినం సందర్భంగా, సోమవారం కాలనిలో కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ సభ్యులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్థానిక వాటర్ ట్యాంక్ కూడలిలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్న పార్టీ జిల్లా నాయకుడు ఎం.రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు గుండేటి రాజేష్ జన్మదిన కేక్ కట్ చేసి శ్రీనుబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్లు, చాక్లెట్లు, బిస్కెట్లు పంచిపెట్టి, నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకల్లో పార్టీ నాయకులు జె.దామోదర్ రావు, దేవనపల్లి చక్రపాణి, యాదగిరి తిరుపతి, కేశవులు,అనుమురాములు, పి.ప్రశాంత్, మహేష్, సారయ్య, అవినాస్, నవీన్, రాకేష్, అజయ్, అక్షయ్, రాజు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## యుద్ధాలతో పాఠాలు నేర్వని అగ్రదేశాలు!

ఉక్రెయిన్ యుద్దానికి మూడేళ్లు పూర్తయ్యాయి. ఉక్రెయిన్ యుధం కారణంగా ఈ మూడేళ్లలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. అనేక దేశాలు ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభావితం అయ్యాయి. రష్యా అధినేత పుతిన్ అహంకారం, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మూర్ఖత్వం కారణంగా ఇరు దేశాల ప్రజలు కూడా తీవ్రంగా నష్టపోయారు. అయినా యుద్ధం అయిపోయిదంనడానికి లేకుండా పోయింది. అడపాదడపా దాడులు సాగుతూనే ఉన్నాయి. అలాగే ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధం కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతానికి నివురుగప్పిన నిప్పులా ఉంది.  ప్రపంచంలో రాజ్యాధినేతల కారణంగా చిన్నచిన్న దేశాలు చిగురుటాకులా వణుకుతున్నాయి. ఒక్క ఉక్రెయిన్ యుద్ధం కారణంగానే ప్రపంచం ఎంతగా నష్ట పోయిందీ అందరికీ తెలుసు. ప్రధానంగా ధరలపై విపరీత ప్రభావం చూపింది. ఆర్తిక వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. ఈ సమయంలో అన్ని దేశాలు ఉమ్మడి నిర్ణయం తీసుకుని భవిష్యత్ యుద్దాల నివారణకు పూనుకోవాలి. మధ్యయుగాల్లో దాడులతో ఆయా దేశాలను కబళించిన రాజ్యకాంక్ష ఉన్న నేతల తరహాలోనే నేటి అగ్రరాజ్యాలు వ్యవహరిస్తున్నాయనడానికి ఎలాంటి సంకోచం అవసరం లేదు. ఇలా సైనిక పాటవం ఉన్న దేశాలు ఇదిగో యుద్ధం అదిగో యుద్ధం అంటూ పరిస్థితులను వేడెక్కించడం కారణంగా ప్రజల బతుకులు ఛిద్రం అవుతున్నాయి. ఇలాంటి పరిస్థితి కొనసాగితే ఇప్పుడు ప్రతి దేశం సైనికంగా బలపడాలి. అలాగే చుట్టుపక్కల ఉన్న దేశాలు సైనిక కూటమిగా ఏర్పడాలి. ఇతరదేశాల దాడులను తట్టుకునేందుకు సైనికంగా బలమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరాన్ని ఉక్రెయిన్ యుద్ధం పాఠాలు నేర్పు తోంది. లేకుంటే ఉక్రెయిన్‌లా లొంగిపోక తప్పదు. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్రెయిన్ అధినేత జెలెన్÷–స్కీనే తప్పుపట్టారు. ఆయన టర్మ్ అయిపోయిన నేతగా ప్రకటించారు. అలాగే గాజాను ఆక్రమించు కుంటామని అన్నారు. ఉక్రెయిన్‌తో యుద్దాన్ని ఆపడానికి రష్యాను కట్టడి చేయడానికి ప్రపంచదేశాల్లో ఏ ఒక్కటీ ప్రయత్నించలేదు. అగ్రరాజ్యాలు తలచుకుంటే ఏ దేశం మీదయినా దాడులు చేయవచ్చుని తాజాగా ఉక్రెయిన్ యుద్దంతో మరోమారు తేలిపోయింది. సైనికపరంగా..ఆర్థికంగా బలంగా ఉంటే చాలని రష్యా, అమెరికాలు తేల్చేశాయి. ఇక అణు సామర్థ్యం ఉంటే అంతే సంగతులు. రేపు చైనా కూడా ఇదే నీతిని అవలంబిస్తుందని వేరుగా చెప్పనక్కర లేదు. పక్కనే ఉన్న తైవాన్ తమ భూభాగమే అని వాదిస్తోంది. అనేకమార్లు దాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేసింది. భారత్‌తో గిల్లి కజ్జాలు పెంచు కుంటోంది. భారత్‌లో ఉన్న అరుణాచల్ తమదే అంటోంది. టిబెట్‌ను అప్పనంగా ఆక్రమించుకుంది చాలక, పాక్‌ను ఎగదోస్తోంది. రెండో ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచం అత్యంత ప్రమాదకరపరిస్థితిలో ఉందని తాజా ఘటనలు రుజువు చేశాయి. గత ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే అగ్రరాజ్యాలుగా ఎదిగిన అమెరికా, రష్యాలు దాడులకు తెగగబడుతూనే వచ్చాయి. అమెరికన్లు 1975లో వియత్నాం నుంచి నిష్క్రమించారు. 28 సంవత్సరాల అనంతరం 2003లో ఇరాక్‌ను ఆక్రమించారు. సోవియట్ యూనియన్ సైన్యం 1989లో అఫ్ఘానిస్తాన్ నుంచి వెనక్కి వెళ్లిపోయింది. తరవాత తాలిబన్లను అణచివేసే క్రమంలో అమెరికా అఫ్ఘాన్‌లో పాగా వేసి చేయి కాల్చు కుంది. 33సంవత్సరాల అనంతరం రష్యా సైన్యం ఉక్రెయిన్‌ను దురాక్రమించింది. అమెరికా రష్యాల అగ్రరాజ్య అభిజాత్యాలకు సమస్త ప్రపంచమూ, ముఖ్యంగా వియత్నాం, అఫ్ఘానిస్తాన్, ఇరాక్, ఉక్రెయిన్‌లు భయానక మూల్యాన్ని చెల్లించుకుంటూనే ఉన్నాయి. ఏ చిన్న కారణం దొరికినా అగ్రరాజ్యాలు తమ ప్రతాపం చూపిస్తున్నాయి. రష్యా, అమెరికాల సరసన ఇప్పుడు చైనా కూడా చేరబో తున్నది. తన ప్రతాపం చూపేందుకు అది అడపాదడపా యత్నిస్తూనే ఉంది. భారత్ వంటి పెద్ద దేశాన్ని కూడా అది భయపెడుతూనే ఉంది. ఇలా పొరుగు దేశం ఉక్రెయిన్‌ను రష్యా దురాక్రమించడమే ఇందుకు తాజా ఉదాహరణగా చెప్పుకోవాలి. అగ్రరాజ్యాలు గతంలో పాల్పడిన సైనిక దుస్సాహసాల గురించి ప్రపంచం ఇప్పుడు ఆలోచించాలి. వియత్నాం, ఇరాక్‌లో అమెరికా, అఫ్ఘానిస్తాన్‌లో సోవియట్ యూనియన్ ఇటువంటి దుస్సాహసాలకే పాల్పడ్డాయి. ఆ మూడు సైనిక జోక్యాలు అంతిమంగా విఫలమయ్యాయి. దురాక్రమించుకున్న దేశంలో ప్రజల జీవితాలను ఛిద్రం చేశాయి. ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ప్రతికూల పర్యవసానాలకు ఈ దురాక్రమణలు దారితీశాయి. 1965లో అధ్యక్షుడు లిండన్ జాన్సన్ వియత్నాంలో అమెరికా జోక్యంతో మొదల య్యింది. అయితే వియత్నాం అమెరికాను నిలువరించడంలో గట్టిగానే పోరాడింది. క్యూబా విషయంలోనూ అమెరికాకు గట్టి ఎదురుదెబ్బే తగిలింది. 1979 డిసెంబర్‌లో అఫ్ఘాని స్తాన్‌ను ఆనాటి సోవియట్ యూనియన్ ఆక్రమించుకుంది. అఫ్ఘాన్‌లో సోవియట్ యూనియన్ ఒక దశాబ్దం పాటు తిష్ఠవేసింది. అయితే రష్యాను వ్యతిరేకించే క్రమంలో అమెరికా తాలిబన్లను సృష్టించింది. విషాద మేమిటంటే సోవియట్ వ్యతిరేక పోరు మత ఛాందసవాదతత్వాన్ని సంతరించుకుంది. అంతర్యుద్ధం కారణంగా అఫ్ఘాన్ శిథిలం అయ్యింది. వియత్నాం నుంచి అమెరికా నిష్క్రమించినట్టుగానే సోవియట్ అఫ్ఘాన్ నుంచి నిష్క్రమించక తప్పలేదు. అఫ్ఘాన్ అనంతరం ఇరాక్‌ను దురాక్రమించేందుకు అమెరికా దాడులు చేసింది. ఇరాక్ వద్ద అణ్వాయుధాలు ఉన్నాయనే కట్టుకథను అమెరికన్ పాలకులు ప్రచారం చేశారు. నిజానికి ఇరాక్‌ను దురాక్రమించుకోవడం అగ్రరాజ్య దురహంకార చర్య తప్ప మరోటి కాదు. అలా అక్కడి సద్దాం ప్రభుత్వాన్ని కూలదోయడమే గాకుండా అతడిని ఉరితీసే వరకు నాటి అధ్యక్షుడు బుష్ నిద్రపోలేదు. ఇలా జరిగిన ఘటనలన్నీ ఇప్పటికీ ప్రపంచాన్ని కలవరపెడుతూనే ఉన్నాయి. వియత్నాం, ఇరాక్‌లు అమెరికాకు భౌగోళికంగా వేల కిలోమీటరల్ దూరంలో ఉన్నాయి. అఫ్ఘానిస్తాన్ సోవియట్ యూనియన్ సరిహద్దులకు సమీపంలో ఉన్న దేశం. ఉక్రెయిన్, రష్యన్ ఫెడరేషన్‌కు పొరుగు దేశం. తాను ప్రపంచ ఏకైక అగ్ర రాజ్యాన్ని కనుక ఎక్కడైనా సరే ఎవరూ తన మాటను జవ దాటకూడదనే అహంకారమే ఇరాక్ ఆక్రమణకు అమెరికాను పురిగొల్పింది. వియత్నాం, అఫ్ఘాన్, ఇరాక్, ఉక్రెయిన్లలో అగ్రరాజ్యాల దాడులు అన్నీ అహంకారపూరితంగా సాగినవే అని చెప్పాలి. అలాగే 1979లో అఫ్ఘాన్‌ను సోవియట్ యూనియన్, ఇప్పుడు ఉక్రెయిన్‌ను రష్యా దురాక్రమించడం పూర్తిగా న్యాయవిరుద్ధం. అధికారంలో ఉన్న అమెరికా, రష్యా నేతల అహంకారమే అందుకు పురిగొల్పాయని భావించాలి. తమకంటే చిన్న వైన, సైనికం గా అంతగా శక్తిమంతం కాని దేశాలను ఆక్రమించుకోవడం తమ హక్కుగా అగ్రరాజ్యాలు భావించడం వల్లనే ఇలాంటి విపత్కర పరిస్థితులను ఇప్పుడు ప్రపంచ దేశాలు చూడాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల  నేపథ్యంలో ప్రపంచ దేశాలు భవిష్యత్ గురించి ఆలోచించాలి. ఐక్యరాజ్య సమితి ఉత్సవ విగ్రహంలా కాకుండా నిర్ణయాత్మక పాత్ర పోషించాలి. ఐక్యరాజ్యసమితిని బలోపేతం చేయడంతో పాటు, అన్ని దేశాలకు సమాన ప్రాతినిధ్యం దక్కేలా చేయాలి.

# చేసిన అభివృద్ధిని విస్మరించి విమర్శలా..?



### కెసిఆర్‌పై బురదజల్లడమే కాంగ్రెస్ పనా

### తెలంగాణ విముక్తి తరహాలో కాంగ్రెస్ విముక్తి

### కెసిఆర్ ఎత్తిన పిడికిలితోనే ఇది సాధ్యం


### బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వెల్లడి

నిజామాబాద్ : తెలంగాణకు విముక్తి దక్కినట్లే కాంగ్రెస్ పాలన నుంచి  ముక్తి కలగాల్సి ఉందని బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవిత అభిప్రాయపడ్డారు. కేవలం ఏడాది కాలంలోనే తెలంగాణ ఆగమయ్యిందని అన్నారు. అభివృద్ధి వెనక్కి పోయిం దన్నారు. ఆరు గ్యారెంటీలతో మభ్య పెట్టిన నేతలకు ప్రజలు బుద్ది చెప్పడం ఖాయమని అన్నారు. మళ్లీ తెలంగాణను గాడిలో పెట్టడం కెసిఆర్‌తో మాత్రమే సాధ్యమని అన్నారు. ఇప్పుడు కెసిఆర్ యుద్ధం మొదలు పెట్టారని, ఆయన ఏ పని మొదుల పెట్టినా విజయం సాధించే వరకు వదలరని ఆమె ఆర్ఎన్ఎతో మాట్లాడుతూ అన్నారు. తెలంగాణ పురోగించినట్లే దేశం కూడా ముందుకు సాగాల్సి ఉందన్నారు. మోడీ పదేళ్ల పాలనలో దేశానికి ఒరిగిందేమీ లేదని ఆమె అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేసి గుర్తింపు తీసుకుని వచ్చారని అన్నారు. తెలంగాణ బ్రాండ్ క్రియేట్ చేశారని అన్నారు. కానీ నేటి రేవంత ప్రభుత్వం కేసీఆర్‌పైనా బురదజల్లే కార్యక్రమం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతల విమర్శలను రానున్న రోజుల్లో పార్టీ కార్యకర్తలే తిప్పికొట్టాలని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ సింహం లాంటిదని ప్రజల గుండెల్లో ఎప్పుడు రారాజుగా నిలుస్తుందన్నారు.  ఆనాటి అభివృద్ధి సంక్షేమ పథకాలను బిఆర్ఎస్ కార్యకర్తలే తీసుకుని వెళ్లాలని ఎమ్మెల్సీ కవిత సూచించారు. తెలంగాణ రైతాంగం కోసం కాళేశ్వరం లాంటి భారీ సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి, కోటి ఎకరాలకు సాగునీరు అందించిందని అన్నారు. ఈ ప్రాజెక్టును సక్రమంగా వినియోగించుకోలేని నేతలు పాలకులుగా ఉన్నారని అన్నారు.  రైతు బీమా, రైతుబంధు, 24 గంటల ఉచిత కరెంట్ సరఫరా చేస్తూ రైతన్నలకు అన్నం పెట్టిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. అయితే ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం రైతాంగానికి సున్నం పెడుతుందని ఎమ్మెల్సీ కవిత తీవ్రంగా మండిపడ్డారు. ఏటా కోటి ఉద్యోగాలు అంటూ మభ్యపెట్టి ఇప్పుడు మొహం చాటేస్తున్నారని మోఈపై విమర్శలు గుప్పించారు. ఈ విషయాలపై బీజేపీ నేతలను గ్రామాల్లో నిలదీయాల్సిన బాధ్యత తమ కార్యకర్తలపై ఉందన్నారు. కెసిఆర్ ప్రభుత్వం కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్ట్‌ను ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్మిచిందని, దీన్ని అడ్డుకునేందుకు ప్రతిపక్ష నేతలు ఎన్నో ప్రయత్నాలు చేశారన్నారు. మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ పూర్తికావడంతో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుం దన్నారు. ఇదే మల్లన్న సాగర్ నుంచి నిజాంసాగర్‌కు కాళేశ్వరం జలాలను మళ్లించి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను సస్యశ్యామలం చేయడం కోసం కెసిఆర్ ప్రణాళికలు రచించారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల నిజామాబాద్ కూడా లబ్ది పొందుతుందని భావించారని అన్నారు. ప్రాజెక్టను పూర్తిచేసి తెలంగాణ రైతులకు గోదావరి జలాలతో పంటలు పండేవిధంగా చూశారని అన్నారు. కెసిఆర్  ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు దేశంలో ఎక్కడా జరగడం లేదని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనేక పనులు చేసినప్పటికీ తెలంగాణలోని కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు విషం చిమ్మే కార్యక్రమం చేస్తున్నారని అన్నారు. తెలంగాణను అవమానించిన, నిధులు ఇవ్వకపోవడాన్ని రాష్ట్రంలోని బీజేపీ నేతలు అధిష్ఠానాన్ని ఎందుకు నిలదీయడం లేదని కవిత ప్రశ్నించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల జిల్లా వ్యవసాయరంగ ముఖచిత్రం మారిందని అన్నారు. రూ.300 కోట్లతో నిజాంసాగర్ ప్రాజెక్ట్ కాలువలను ఆధునికీకరించామని అన్నారు. కాళేశ్వరం ప్యాకేజీ 22 ద్వారా రూ.1500 కోట్లతో నాలుగు నియోజకవర్గాలకు 1 లక్ష 82 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు పనులు చేపట్టామని అన్నారు. మంజీరాపై రూ.476 కోట్లతో నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేశామన్నారు.    కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా ప్రజల పక్షాన పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీసే ధైర్యం ఏ ఒక్కరికీ లేకపోయిందన్నారు. తెలంగాణ ప్రజల పక్షాన కాకుండా దేశ ప్రజల సమస్యలపైన టీఆర్ఎస్ కేంద్రంనైన, ప్రధాని నరేంద్రమోదీనైనా నిలదీసేందుకు వెనకాడబోమని కవిత అన్నారు.

# రెండేళ్లు పూర్తి చేసుకున్న రాష్ట్ర గవర్నర్

### వివాద రహితుడుగా జస్టిస్ అబ్దుల్ నజీర్

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన గవర్నర్‌గా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ రెండేళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్నారు. 2023 ఫిబ్రవరి 24న ఆయన ఎపి గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఆయన చేత ఆనాటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఆనాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో పాటు ప్రతిపక్షనేత చంద్రబాబు, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఏపీకి మూడో గవర్నర్‌గా సయ్యద్ అబ్దుల్ నజీర్ బాధ్యతలు చేపట్టారు. కర్ణాటకకు చెందిన అబ్దుల్ నజీర్.. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేయకుండానే.. దేశ అత్యున్నత న్యాయస్థానానికి ప్రమోట్ అయిన మూడో న్యాయమూర్తిగా నజీర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2023 జనవరిలో పదవీ విరమణ చేసిన ఆయన ఫిబ్రవరి మాసాంతానికి ఒక రాష్ట్ర గవర్నర్ గా ప్రమాణ స్వీకారం చేయటం విశేషం.  ఆనాటి ఎపి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ స్థానంలో జస్టిస్ అబ్దుల్ నజీర్ నియమితులయ్యారు. అప్పటి వరకు రాష్ట్ర గవర్నర్‌గా కొనసాగిన బిశ్వ భూషణ్ హరిచందన్ ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా నియమితులు కావడంతో నజీర్ ప్రమాణం చేశారు. గత రెండేళ్లుగా నజీ÷– వివాద రహితుడిగా పేరు సంపాదించుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఏనాడూ తలదూర్చలేదు. అనేక రాష్ట్రాల్లో గవర్నర్లపై విమర్శలు వస్తున్న క్రమంలో ఇక్కడ మాత్రం నజీర్ ప్రశాంతంగా ఉంటూ...తన విధుల్లో నిమగ్నమయ్యారు. 1958 జనవరి 5న కర్ణాటకలోని బెలువాయిలో జన్మించిన అబ్దుల్ నజీర్.. మంగళూరులో న్యాయవిద్యను అభ్యసించారు. 1983లో కర్ణాటక ఉన్నత న్యాయస్థానంలో అడ్వకేట్ గా ప్రాక్టీస్ మొదలు పెట్టారు. 2003 మే నెలలో కర్ణాటక హైకోర్టు అడిషనల్ న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆ తర్వాత అదే హైకోర్టులో పర్మినెంట్ న్యాయమూర్తిగా అవకాశం చేజిక్కించుకున్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తూనే 2017 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు పదోన్నతి లభించింది. అలా సుప్రీంలో పదవీవిరమణ పొందాక నేరుగా ఎపి గవర్నర్‌గా నియమితులయ్యారు. రెండేళ్లు పూర్తి చేసుకున్న గవర్నర్ నజీ÷–కు సిఎం చంద్రబాబు సహా అంతా అభినందనలు తెలిపారు.




# వడివడిగా ఇక అమరావతి అడుగులు

### రాజధాని నిర్మాణాలకు నిర్ణీత కాలవ్యవధి

అమరావతి : అమరాతి విషయంలో సిఎం జగన్ తప్పటడుగులు వేశారని కోర్టులు, కేంద్రం చెప్పినా జగన్ ప్రభుత్వం మాత్రం తప్పుదిద్దుకునే ప్రయత్నం చేయకపోవడంతో రాజధాని అన్నదఇ లేకుండా ఆంధ్రప్రదేశ్ ఐదేళ్ల పాటు అంధకారంలో మగ్గింది. ఇది ఓ మూర్ఖ చక్రవర్తి కారణంగానే ఇలా జిగిందని చెప్పుకోవాలి. విశాఖ రాజధాని అని చెబుతూ వచ్చి ప్రజలు నమ్మించే ప్రయత్నంలో విలాసవంతమైన భవనాలు నిర్మించుకున్నారు. అధికారంలోకిరాగానే ఐదేళ్ల క్రితమే ఆ పని చేసివున్నా ఈ పాటికి ఎపికి ఓ రాజధాని అనేది ఉండేది. విశాఖను కూడా రాజధాని చేసుకుంటే అడ్డుకునే వారు ఉండేవారు కాదు. కానీ మూడు రాజధానుల పేరుతో ఆడిన నాటకాలు ఎపి పురోభివృద్దిని పూర్తిగా దెబ్బతీసాయి. రాజధాని అన్నది లేకుండా చేశాయి. అందుకే దానిని సరిదిద్దు కోవాలని అధికార టిడిపి సంకల్పించింది. కేంద్రం కూడా నిధులు సమకూరుస్తోంది. చంద్రబాబు రాకతో మళ్లీ అమరావతి పనుల్లో వేంగ పుంజుకుంది. పనులు ప్రారంభించడానికి ముమూర్తం కూడా కుదిరింది. త్వరగా పూర్తి చేయాలనే వివిధ పార్టీల నేతలు అభిప్రాయపడుతున్నారు. గత ఐదేళ్ల పాలపా కాలంలో జగన్ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మూడు రాజధానులతో ప్రజలను గందరగోళంలోకి నెట్టేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా రాజధాని అమరావతి నిర్మాణానికి దోహదపడి ఉంటే బాగుండేది. అమరావతికి సంబంధించి చంద్రబాబు నాయుడు పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. ఈ విషయాన్ని తేలికగా తీసుకోవద్దన్నారు. రాజధాని లేని రాజ్యం లాగా ఆంధ్రపద్రేవ్ కొనసాగడం ఎంతమాత్రం సరికాదన్నారు. గత ప్రభుత్వంపై కక్షతో ఇలాంటి కీలక విషయంలో తీసుకున్న నిర్ణయాలు ప్రజల భవిష్యత్‌ను అంధకారంలో పడేశాయని బాబు అన్నారు. అమరావతి కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచారు. రాజధానిగా తాము అమరావతికి కట్టుబడి ఉంటామని అన్ని పార్టీల నేతలు అన్నారు. అమరావతిని పక్కన పెట్టడంతో ఎపికి పెట్టుబడులు వెనక్కి పోయాయని టిడిపి నేతలు అన్నారు. రైతుల ఆందోళనతో జై అమరావతి నినాదం హోరెత్తినా జగన్ ఊనాడు ప్యాలెస్ నుంచి బయటకు రాలేదు. అమరావతే తమ అంతిమ లక్ష్యం అంటూ అక్కడి రైతులు, మహిళలు, కూలీలు ఉద్యమ పిడికిలి బిగించి, లక్ష్యాన్ని చాటారు. ఎన్ని అవమానాలు ఎదురైనా.. అడ్డంకులు కల్పించినా.. కేసులు పెట్టినా అడుగులు వెనకకు పడవంటూ తెగేసి చెప్పారు. రైతులు, మహిళలు దీక్ష చేపట్టి జగన్‌కు  కనువిప్పు కలిగించారు. ఏకైక రాజధానిగా అమరావతినే కొనసాగించాలన్న డిమాండ్‌తో ఉద్యమిస్తున్న రైతులు, మహిళలు ఓ రకంగా విజయం సాధించారని చెప్పాలి.

# ఆనందమే అసలు సిసిలు ఐశ్వర్యం !

తిరుమల : సంతోషంగా ఉండటమనేది ఎంతో అవసరం. ఎంత సంపాదించానే దానికన్నా మనం ఎంత సంతోషంగా ఉన్నామన్నదే ముఖ్యం. మనం ఎంత సంపాదించామనే దానిపై ఇది ఆధారపడి ఉండదు. సంతోషమన్నది మన మానసిక ప్రవర్తనను బట్టి ఉంటుంది. మనస్సులో ఆనందంగా ఉండాలన్న సంకల్పం ఉంటే అందుకు అడుగు పడుతుంది. ప్రతి విషయానికి ఆందోళన చెందితే...డబ్బు, స్వార్థం కోసం తంటాలు పడితే ఆనందం ఆవిరైపోయింది. ఎన్ని ఆధునిక పరికరాలు మన వద్ద ఉన్నాయనే దానిపైనా ఉండదు. అవసరాన్ని బట్టి భారమైన విషయాల్ని తేలిగ్గా భావించాలి. జీవితంలో చేసిన తప్పులన్నీ క్షమించేయాలి. స్నేహితులతో, కుటుంబ సభ్యులతో తగవులు మానాలి. మనం మానవ మాత్రులమని గుర్తించాలి. బాధ కలిగించే సంఘటనలు జీవితంలో ఎన్నో జరుగుతాయి. పగలు, ప్రతీకారాలు సంతోషాన్నివ్వవు. పగ అంటే తలపై ఎంతో భారంతో ఒక కొండ పైకి ఎక్కుతున్నట్టే! బరువంతా దింపుకొంటే కొండ ఎక్కడం తేలిక. అవసరాన్ని బట్టి మన డబ్బు, శారీరక శ్రమ, మానసిక శ్రమ, మన సమయాన్ని ఇతరులకివ్వాలి. ఇతరుల విజయం, సంతోషం కోసం పాటుపడాలి. అనాథలకు సేవ చేయడంలో సంతోషం దాగి ఉంటుంది. 'సొంత లాభం కొంత మానుకు పొరుగు వానికి తోడు పడవోయ్... అన్న గురజాడ మాటలను చేతల్లో చూపెడితే సంతోషం జాడ తెలుస్తుంది. ఇతరులు సంతోషం కోసం చెట్టు ఫలాలిస్తుంది. ఇతరుల సంతోషం కోసం ఆవు పాలిస్తుంది. ఇతరుల సంతోషం కోసం నది నీరిస్తూ ప్రవహిస్తుంది. అందుకే, ఇతరులు సంతోషం కోసం కొంతైనా మనిషన్న వాడు కృషిచేయాలి. అప్పుడే మానవ జన్మకు సార్థకత కలుగుతుంది.



ఆధ్యాత్మికం

# ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించాలి

- ప్రతి ఓటర్‌కు ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేయాలి
- ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహణ
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 36, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు 14 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- ప్రతి 2 గంటలకు పోలింగ్ రిపోర్టు అందేలా సెక్టార్ అధికారులు బాధ్యత తీసుకోవాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** శాసనమండలి ఎన్నికల పోలింగ్ మన పెద్దపల్లి జిల్లాలో పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. ఈ నెల 27న జిల్లాలో నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సోమవారం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ నిర్వహణ పై శిక్షణ కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ప్రతి ఒక్కరికి అనుభవం ఉందని, ఎక్కడా తేలికగా తీసుకోకుండా ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. జిల్లాలో పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 36 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, నిబంధనలు పాటిస్తూ పోలింగ్ సజావుగా జరపాలని అన్నారు. పోలింగ్ విధుల పట్ల ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని, శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరికి ఓటర్ స్లిప్ పంపిణీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శాసనమండలి ఎన్నికల పోలింగ్ జరుగుతుందని అన్నారు. ఫిబ్రవరి 26న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వచ్చి పోలింగ్ డ్యూటీ అలాట్మెంట్ ఆర్డర్ తీసుకొని సంబంధిత పోలింగ్ కేంద్రం సిబ్బందితో కలిసి పోలింగ్ సామాగ్రి తీసుకోవాలని అన్నారు. అవసరమైన మేర సరైన బ్యాలెట్ పత్రాలు, ఓటరు జాబితా, ఇతర ముఖ్యమైన పోలింగ్ సామాగ్రి చెక్ లిస్ట్ తయారు చేసుకొని అన్ని అందుబాటులో ఉన్నాయో లేదో ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని అన్నారు. పోలింగ్ కేంద్రం పరిసరాలను చెక్ చేసుకోవాలని ,100 మీటర్ల రేడియస్ లో ఎన్నికలను ప్రభావితం చేసేలా ఎటువంటి ప్రచారం జరగడానికి వీలు లేదని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద డమ్మీ బ్యాలెట్ అతికించాలని, పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరా లేదా వెబ్ కాస్టింగ్ ద్వారా సర్వే లెన్స్ చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు లైన్లో వచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని, దివ్యాంగులు వృద్ధులు గర్భిణీ స్త్రీలు ప్రాధాన్యతతో ఓట్లు వేసే విధంగా చూడాలని, 100 మీటర్ల పరిధిలో ఓటర్ సహాయ కేంద్రానికి హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్‌ను గుర్తించి, జాబితాలో అతని పేరు చెక్ చేసుకోవాలని, ఎడమచేతి చూపుడు వేలుకి ఇంక్ పెట్టాలని అన్నారు. పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించు కునేందుకు పాస్పోర్ట్ డ్రైవింగ్ లైసెన్స్ పాస్ బుక్ , పాన్ కార్డు ఆధార్ కార్డు, పెన్షన్ డాక్యుమెంట్, జాతీయ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డ్,



యూడి ఐడి, హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు గుర్తింపు కోసం ఓటర్లు తమ వెంట తీసుకుని రావాల్సి ఉంటుందని అన్నారు. పోలింగ్ నాడు ఉదయం ఖాళీగా ఉన్న బ్యాలెట్ బాక్స్‌ను ఏజెంట్లకు చూపించాలని, గ్రీన్ పేపర్ లో ఏజెంట్ల సంతకాలు తీసుకుని సీజ్ చేయాలని, బ్యాలెట్ బాక్స్ పై పోలింగ్ కేంద్రం వివరాలు ఉండే విధంగా పేపర్ అతికించాలని, ఓటర్ సీక్రసి కాపాడేందుకు వీలుగా ఓటింగ్ కంపార్ట్మెంట్లను ఏర్పాటు చేయాలని అన్నారు. పోలింగ్ నాడు ప్రతి రెండు గంటలకు ఒకసారి అంటే 10 గంటలకు, 12 గంటలకు, 2 గంటలకు, పోలింగ్ ముగిసిన తరువాత 4 గంటలకు పోలింగ్ వివరాలను ప్రకటించాలని, సెక్టర్ అధికారులు ఈ బాధ్యతను తీసుకోవాలని అన్నారు. సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటర్ స్లిప్పులు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ఓటు వేసే అవకాశం కల్పించాలని, 3.55 గంటలకు 4 గంటలకు పోలింగ్ ముగుస్తుందని ప్రకటించాలని అన్నారు. చివరి ఓటర్ ఓటు వినియోగించుకున్న తర్వాత నిబంధనలు ప్రకారం బ్యాలెట్ బాక్సులను మూసివేసి సీల్ చేయాలని, ప్రతి ఒక్క సిబ్బంది తన మాన్యువల్ ను ఒకటికి రెండు సార్లు పరిశీలించు కోవాలని, విధులను పక్కగా నిర్వహిస్తూ ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా చూడాలని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో అదనపు కలెక్టర్ డి.వేణు, ఏ ఆర్ ఓ లు గంగయ్య, సురేష్, తాహసిల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## మేడిపల్లి భూముల ఎంజాయ్మెంట్ సర్వేనీ అడ్డుకున్న గ్రామ రైతులు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్) ఫిబ్రవరి 24:** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ మేడిపల్లి శివారులోని భూములను ఎంజాయ్మెంట్ సర్వే కోసం వచ్చిన రెవెన్యూ అధికారులను రత్నాపూర్ గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం మేడిపల్లి శివారులోని భూములను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడానికి నోటీసులు విడుదల చేసిన విషయం విధితమే. దీని విషయంపై పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు సోమవారం రోజు ఫీల్డ్ మీదికి వచ్చిన రెవెన్యూ అధికారులను గ్రామ రైతులందరూ కలిసి అడ్డుకున్నారు. ఈ సర్వే చేసేందుకు రైతులందరూ నిరాకరించారు. ఈ భూములను ఇచ్చే ప్రసక్తే లేదని అధికారులతో తన గోడు వెళ్లబుచ్చుకున్నారు. దీంతో అక్కడికి వచ్చిన అధికారులు తమ పై అధికారులతో ఈ విషయంపై చర్చించి అధికారుల సూచన మేరకు అక్కడి నుండి వెళ్లిపోవడం జరిగింది. అనంతరం రైతులందరూ కలిసి పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్దకు వెళ్లి అసిస్టెంట్ కలెక్టర్ కి వినతి పత్రం ఇచ్చి ఆర్డిఓ ని కలిసి రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు కొండు లక్ష్మణ్, మండల శంకర్, భద్రపు కృష్ణమూర్తి, భద్రపు శ్రీనివాస్, బర్ల వెంకన్న, కొవ్వూరి సురేష్, గేల్లు కృష్ణ, మండల శ్రీనివాస్, జక్కుల శివకుమార్, జక్కుల సది, తోట్ల రాయమల్లు, దాసరి నరేష్, ఎరుకలి బక్కయ్య, కొప్పుల కృష్ణకర్, మేడగొండ మహేష్, మధుకర్, బెజ్జల రాజయ్య, కండె గట్టయ్య, శ్రీనివాస్ అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఇస్కాన్ సహకారంతో కన్నాల గ్రామం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మినీ లైబ్రరీ ఏర్పాటు

### - సింగిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన అన్నదమ్ములు చిగిరి శివకుమార్ మరియు సాయికుమార్



**రామగిరి (ది క్రైమ్ న్యూస్), ఫిబ్రవరి 24:** సనాతన ధర్మం , సంస్కృతి, సంప్రదాయాల శాస్త్రీయ మరియు ఆధ్యాత్మిక ప్రాతిపదికను వివరించే లక్ష్యంతో ఇస్కాన్ సహకారంతో కన్నాలా గ్రామం , మంథని మండలం, పెద్దపల్లి జిల్లా అయినా వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సింగారెడ్డి పల్లె గ్రామం నివాసులైన చిగిరి శివకుమార్, సాయికుమార్ సన్నాఫ్ నరసయ్య మినీ లైబ్రరీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మినీ లైబ్రరీలో సనాతన సంస్థ సనాతన ధర్మం , ఆధ్యాత్మికత, ఆధ్యాత్మిక సాధన జాతీయ సంక్షేమంపై రాసిన పుస్తకాలు కూడా ఉన్నాయి. భక్తులు గ్రంథాలను అర్థం చేసుకోవడానికి సహాయపడటానికి ప్రత్యేక పుస్తకాల ద్వారా సమాచారం పంచుకోబడుతుంది. ఈ మినీ లైబ్రరీ లోపల పుస్తకాలు ఇంగ్లీష్ భగవద్గీత, ఇంగ్లీష్ కృష్ణ బుక్,తెలుగు భగవద్గీత,తెలుగు కృష్ణ బుక్,హిందీ భగవద్గీత,హిందీ కృష్ణ బుక్,ఇంగ్లీష్ కృష్ణ రిజర్వాయర్ ఆఫ్ ప్లెజర్, ఇంగ్లీష్ బియాండ్ బర్త్ అండ్ డెత్, ఇంగ్లీష్ ఈజీ జర్నీ టు అదర్ ప్లానెట్స్,ఇంగ్లీష్ మ్యాచ్ లెస్ గిఫ్ట్, ఇంగ్లీష్ బ్రహ్మ సంహిత,ఇంగ్లీష్ ఆన్ ద వే టు కృష్ణ, ఇంగ్లీష్ టాప్ మోస్ట్ యోగ సిస్టం,ఇంగ్లీష్ పర్ఫెక్షన్ ఆఫ్ యోగ, ఇంగ్లీష్ టీచింగ్ స్టాఫ్ ప్రహ్లాద మహారాజా,ఇంగ్లీష్ లైఫ్ కమ్స్ ఫ్రాం లైఫ్, ఇంగ్లీష్ శ్రీ ఉపనిషత్, ఇంగ్లీష్ రాజా విద్య, ఇంగ్లీష్ ధర్మ,ఇంగ్లీష్ మెసేజ్ ఆఫ్ గాడ్ హెడ్, తెలుగు కృష్ణ రిజర్వాయర్ ఆఫ్ ప్లెజర్, తెలుగు బియాండ్ బర్త్ అండ్ డెత్, తెలుగు మ్యాచ్ లెస్ గిఫ్ట్,తెలుగు సైన్స్ ఆఫ్ సెల్ఫ్ రియలైజేషన్, తెలుగు ధర్మ,తెలుగు మెసేజ్ ఆఫ్ గాడ్ హెడ్, తెలుగు రాజవిద్య, తెలుగు ఆన్ ద వే టు కృష్ణ, తెలుగు పర్ఫెక్షన్ ఆఫ్ యోగ,తెలుగు శ్రీ ఉపనిషత్, తెలుగు టాప్ మోస్ట్ యోగ సిస్టం వంటి పుస్తకాలు ఉన్నాయి. ఈ పుస్తకాలతో పాటు కూర్చొని యాగాలు మరియు చదువుకోవడానికి మ్యాట్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఇవి భక్తులకు ఎంతగానో ఉపయోగపడతాయి.యుగయుగాలుగా ఎడతెగక ప్రవహిస్తున్న ప్రవాహమే హైందవ సంస్కృతి. ఇందులోనుంచి వచ్చినవే సంప్రదాయాలు, ఆచారాలు. వీటికి మన పండుగలు ముఖ్య కేంద్రాలు. సనాతన ధర్మ వ్యాప్తికి అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయి. వీటిని కన్నాల గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఉపయోగించుకోవాలని కోరుతున్నాము. ఇట్టి కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తే జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవాలయంలో మినీ లైబ్రరీలను ఏర్పాటు చేయడానికి మా వంతు కృషి చేస్తాం. ఈ కార్యక్రమంలో పూజారి ముఖేష్ శర్మతోపాటు గ్రామ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మెజీషియన్స్ డే వేడుకలలో రాజాకు సన్మానం



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** స్థానిక ఇంద్రజాలికులు, బహుముఖ ప్రజ్ఞాశాలి మేజిక్ రాజాను వరంగల్ మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఆత్మీయంగా సన్మానించారు. ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికులు పిసి సర్కార్ (సీనియర్) జయంతిని పురస్కరించుకుని వరంగల్ జిల్లా కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో వరంగల్ మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇంద్రజాలికుల దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. నాలుగు దశాబ్దాలుగా ఇంద్రజాల రంగానికి విశిష్ట సేవలందిస్తున్న గోదావరిఖనికి చెందిన సీనియర్ మెజీషియన్ మేజిక్ రాజాను ఈ వేడుకలలో అతిథులు, సభ్యుల చేతుల మీదుగా పూలమాలలు శాలువాలతో ఆత్మీయంగా సన్మానించారు. జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఏ.దశరథం, జే. శ్రీనివాస్ రెడ్డి, మార్త రవి, కే.ఆనంద్, ఆర్.నారాయణ, అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాం కళ్యాణ్, పీ.జయకర్, సభ్యులు జీ.రాజశేఖర్, బీ.వినయ్ లాజరస్, డీ.భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## పాలకుర్తి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీను బాబు జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి స్వీట్లు, పరీక్ష పాడ్స్, పెన్నులు పంపిణీ చేసిన మండల కాంగ్రెస్ నాయకులు
- ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవుడు శ్రీనుబాబు



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సోమవారం రోజు కన్నాల ప్రభుత్వ పాఠశాలలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సోదరులు దుద్దిళ్ళ శ్రీను బాబు జన్మదినం సందర్భంగా డీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ కేశోరామ్ కాంట్రాక్టు యూనియన్ అధ్యక్షులు సూర సమ్మయ్య అధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం డీసీసీ ప్రధాన కార్యదర్శి కేశోరామ్ కాంట్రాక్టు యూనియన్ అధ్యక్షులు సూర సమ్మయ్య మాట్లాడుతూ ప్రజలకి అన్నివేళలా అందుబాటులో ఉండే వ్యక్తి శ్రీను బాబు అని చదువుకునే పిల్లలకి ఆసరాగా ఉండే వ్యక్తి శ్రీను బాబు అని, ఎ సమస్య కోసం ఫోన్ చేసిన స్పందించే వ్యక్తి శ్రీను బాబు అని అన్నారు. ఈ సందర్భంగా బసంత్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో , కన్నాల ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష పాడ్స్ పంపిణీ చేసారు. పదవ తరగతి చుదువుతన్న విద్యార్థులను ఉద్దేశించి పదవ తరగతి ఫలితాలలో 600 కు 600 మార్కులు వచ్చే విదంగా కృషి చేయాలని సూర సమ్మయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో అరుకల సతీష్, మాజీ ఉపసర్పంచ్ కుమార్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు బుతాగడ్డల రమేష్, బాధవత్ శంకర్ నాయక్, మడిపల్లి సంజీవ్, సూర సంతోష్, సంపంగి శ్రీనివాస్, సంపంగి లక్ష్మణ్, మాజీ వార్డ్ సభ్యులు బుతాగడ్డల రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి అభ్యర్థి అంజిరెడ్డి గెలుపుకు ఇంటింటి ప్రచారం...



**జమ్మికుంట ఫిబ్రవరి 24 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామంలో బిజెపి బలపరిచిన గ్రాడ్యుయేట్స్ అభ్యర్థి అంజిరెడ్డి. గెలుపు కోసం ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జమ్మికుంట మాజీ జెడ్పిటిసి డాక్టర్. శ్రీరామ్ శ్యామ్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్స్ కలసి మొదటి ప్రాధాన్యత ఓటును అంజిరెడ్డికి వేయవలసిందిగా వారు కోరడం జరిగింది. ప్రశ్నించే గొంతు విధాల పరిస్థితిలో ఉన్నప్పుడే నిరుద్యోగుల సమస్య పరిష్కారం అవుతుందని వారు ఆశ భావం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులకు ఓటు వేస్తే ప్రశ్నించే శక్తి ఉండదని వారు ఎద్దేవ చేశారు. నిరుద్యోగి ఉద్యోగి సమస్యలు పరిష్కారం కావాలంటే కేవలం బిజెపి పార్టీతోనే సాధ్యమవుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యావంతుల సమస్య పరిష్కరించే వారు మాత్రమే అంజిరెడ్డి అని మాత్రమే వారు కోరారు . విద్యావంతులు వారి యొక్క విలువైన ఓటును వృధా చేసుకోవద్దని గ్రాడ్యుయేట్స్ కు సూచించడం జరిగింది. జమ్మికుంట విద్యావంతులకు ప్రశ్నించే తత్వం ఎక్కువగా ఉంటదని వారి సందర్భంగా కోరారు. బిజెపి బలపరిచిన అభ్యర్థి గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాచపల్లి వెంకటేష్, పొట్యాల మల్లేష్, రాజ్ కుమార్,విక్రమ్ సమ్మయ్య, ఇతర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి సందర్భంగా కోల్ బెల్ట్ నుండి వేములవాడకు పారిశుధ్య కార్మికులు



**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని వేములవాడ దేవస్థానానికి భారీ సంఖ్యలో భక్తులు విచ్చేయనున్న దృష్ట్యా పారిశుద్ధ్య నిర్వహణలో పాలు పంచుకోవడానికి జిల్లా కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారి కోయ శ్రీ హర్ష ఆదేశాల మేరకు రామగుండం నగర పాలక సంస్థ పారిశుద్ధ్య విభాగం సిబ్బంది సోమవారం తరలివెళ్లారు. పారిశుద్ధ్య పర్యవేక్షకుడు జి. శ్రీనివాస్ రెడ్డి, 25 మంది సిబ్బందితో పాటు ఒక ట్రాక్టర్ కూడా బయలు దేరి వెళ్ళింది. ఈ నెల 28 వ తేదీ వరకు వేముల వాడ దేవస్థానం కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలో పారిశుద్ధ్య విధులు నిర్వహించనున్నారు.

# గోదావరిలో భక్తుల పుణ్య స్నానాలకు కెమికల్, మురికి నీళ్ళే గతా?

- శివరాత్రి పండుగ ఏర్పాట్లు పట్టించుకోని ప్రభుత్వం, నగర పాలక సంస్థ అధికారులు
- నది ఒడ్డున ఉన్న శివుని భారీ విగ్రహానికి రంగులు వేయాలని డిమాండ్
- కనీసం సింగరేణి సంస్థ అయిన పట్టించుకోవాలి: మద్దెల దినేష్





**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** శివరాత్రి పండుగ సందర్భంగా గోదావరి నది లో పుణ్య స్నానాలు చేసేందుకు వచ్చే భక్తులకు కెమికల్, మురికి నీరే గతా అని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ఒక ప్రకటన లో రాష్ట్ర ప్రభుత్వాన్ని, అధికారుల ను ప్రశ్నించారు. ఈ నెల 26 న జరిగే శివరాత్రి పండుగ సందర్భంగా రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలు పుణ్య స్నానాలు చేసేందుకు వస్తారని, వారు స్నానాలు చేసేందుకు నదిలో నీరు లేదని, పూర్తిగా ఎండిపోయి ఉందని, భక్తుల సౌకర్యార్థం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రభుత్వాన్ని, అధికారులను ప్రశ్నించారు. కనీసం షవర్స్ కూడా ఇంత వరకు ఏర్పాటు చేయలేదని ఆయన ఆరోపించారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా నది ఒడ్డున ఉన్న శివుని భారీ విగ్రహానికి రంగులు వేసి సుందరంగా తీర్చి దిద్దడంలో అధికారుల నిర్లక్ష్యం ఉందని ఆయన ఆరోపించారు, వెంటనే అట్టి విగ్రహానికి రంగులు వేసి గోదావరి తీరాన ఉన్న చెత్త చెదారాన్ని తొలగించి భక్తులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను డిమాండ్ చేశారు. వాస్తవానికి ప్రజలకు ఉపాయోపడే పనులు ఏనాడు కూడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పనిచేయరు, అధికారులకు ప్రజల పట్ల శ్రద్ద ఉండదు కేవలం కమిషన్, పర్సెంటిజిలు అల్వాటు పడి అవినీతి మత్తులో తూలడం లోనే సమయం సరిపోవడం లేదు వారికి, కావున కనీసం సింగరేణి యాజమాన్యం అయినా ఆలోచన చేసి గోదావరికి వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని అయిన కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజల పక్షాన దినేష్ కోరడం జరిగిందన్నారు.

# మధుమేహ వ్యాధి పరీక్షా కేంద్రం ప్రారంభోత్సవం






**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** స్థానిక సింగరేణి సెక్టార్.3 డిస్పెన్సరీ లో సోమవారం రామగుండం రెండవ డివిజన్ జనరల్ మేనేజర్ బండి వెంకటయ్య మధుమేహ వ్యాది నిర్ధారణ పరీక్షా కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఉదయం డిస్పెన్సరీ సూపరిండెంట్ డాక్టర్ మహిపాల్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జీఎం మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షా కేంద్రాన్ని, పరిక్షా యంత్రాన్ని లాంచనప్రాయంగా ప్రారంభించారు. ఏరియా వకిల్ పల్లి గనికి సంబంధించి జరిగిన ప్రజా అభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోని, రేమేడియేషన్ ప్లాన్ క్రింద సంస్థ యాజమాన్యం ఈ మధుమేహ వ్యాది నిర్ధారణ పరీక్షా యంత్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిండెంట్ మహిపాల్ మాట్లాడుతూ.. ఈ యంత్రం ద్వారా మధుమేహ వ్యాది గ్రస్తులకు వ్యాది నిర్ధారణ సమయాభావం లేకుండా కచ్చితమైన ఫలితాలను అందించడం జరుగు తుందన్నారు. ఏరియా జీఎం వెంకటయ్య మాట్లాడుతూ.. ఈ యంత్రం ద్వారా ఉద్యోగులు ప్రతి మూడు నెలలకు ఒకసారి మధుమేహ వ్యాది పరీక్షకు హాజరు కావడం వలన, వ్యాది యొక్క హెచ్చు తగ్గులు మానిటరింగ్ చేసుకోవడం జరుగు తుందన్నారు. అలాగే ఈ వ్యాధి నిర్ధారణ యంత్రాన్ని సింగరేణి నిర్వహించే మెడికల్ క్యాంపు లలో కూడా ఉపయోగించడం జరుగుతుందని, ఈ సదుపాయాన్ని పరిసర గ్రామాల ప్రజలు కూడా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఏరియా కార్యదర్శి జి.రవీందర్, ఏరియా ఎస్ఓ టూ జీఎం ఎం.రాముడు, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి నర్సింహులు, వకీల్ పల్లి గని అఫిషియేటింగ్ ఏజెంట్ సంతోష్ కుమార్, డిజిఎం ఐఇ మురళీకృష్ణ, వకీల్ పల్లి గ్రూప్ ఇంజినీర్ చంద్ర శేఖర్, ఏరియా సెక్యూరిటి అధికారి షరీఫ్ మహమ్మద్, పర్యావరణ అధికారులు సురేష్ బాబు, వేణు, సీనియర్ ఎస్టేట్స్ అధికారి సునీత, ఆసుపత్రి డాక్టర్లు చంద్ర శేఖర్, వెంకటేశ్వర్లు, ప్యారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించండి

## - ఎంఎల్సీ ఎన్నికల జిల్లా కన్వీనర్ అలజపూర్ శ్రీనివాస్



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 24:** ఉమ్మడి కరీంనగర్–ఆదిలాబాద్–మెదక్ నిజామాబాద్ బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ బిజెపి అభ్యర్థి చిన్న మైల్ అంజిరెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య లను భారీ మెజారిటీ తో గ్లెపించాలని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఎంఎల్సీ ఎన్నికల కన్వీనర్ అలజపూర్ శ్రీనివాస్, బీజేపీ మాజీ అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డిలు కోరారు. సోమవారం మంథని బీజేపీ కార్యాలయం లో ఎంఎల్సీ ఎన్నికల సన్నద్ధం కోసం మంథని అసెంబ్లీ నియోజకవర్గం లోని మండలాల వారీగా సమావేశం నిర్వహించి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటుచేసిన అనేక సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియ పరచాల్సిన బాధ్యత బిజెపి కార్యకర్తలపై ఉందని వారు పేర్కొన్నారు. బిజెపి అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు సైనికులు లాగా పనిచేయాలని సూచనలు ఇస్తూ ఓటర్లందరు బిజెపి బలపరచిన అబ్యర్థులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి నీలకంఠం పాండు, అసెంబ్లీ కన్వీనర్ మచ్చగిరి రాము, మంథని టౌన్ అధ్యక్షులు మండల అధ్యక్షులు వీరబోయిన రాజేందర్, సబ్బని సంతోష్ నాంపల్లి రమేష్, బోగోజు శ్రీనివాస్, నారమళ్ళ కృష్ణ, సామల అశోక్ సమావేశంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నరు.

# అన్నవరం అంగన్వాడీ కేంద్రానికి ఎన్ఆర్ఐ ఫౌండేషన్ సాయం..

## - ఉపాధ్యాయుల సొంత ఖర్చులతో ప్లేట్లు, గ్లాసులు వితరణ..







**ఖమ్మం ఉమ్మడి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం అన్నవరం అంగన్వాడీ కేంద్రానికి డిస్టిక్ ఎన్ఆర్ఐ ఫౌండేషన్, సత్య సాయి ఆర్గనైజేషన్ వారు ఆర్థిక చేయూతను అందించారు. ఎన్ఆర్ఐ ఫౌండేషన్ వారు డిజిటల్ టీవీని, సత్యసాయి ఆర్గనైజేషన్ ద్వారా గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్లు, అంతేకాక పాఠశాల ఉపాధ్యాయులు ఆర్ అచ్యుత్, ఆర్. బాల యేసు తమ సొంత ఖర్చులతో ప్లేట్లు గ్లాసులు వితరణ. అందించారు.. అవసరతలను గుర్తించి సాయం అందించిన సేవా సంస్థలకు అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు రామన అచ్యుతరావు తో పాటు పలువురికి ఆ గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# విమర్శల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి..

## - ఫోన్ లిఫ్ట్ చేయరూ... - ఫీజుల్లో రాయితీ ఇవ్వరనే విమర్శలు..

## - బీసీ వాదాన్ని తెరపైకి తెచ్చిన సంఘం నేతలు...!

**జగిత్యాల, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్, నిజామాబాధ్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు పోలింగ్ దగ్గర పడుతున్న కొద్ది ఉత్కంఠ రేపుతున్నాయి.కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ అభ్యర్థులతో పాటు 56 మంది అభ్యర్థులు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచి ఎవరికీ వారుగా ప్రచారం ముమ్మరం చేశారు.కాంగ్రెస్ అభ్యర్థి గత కొంత కాలంగా విద్యా సంస్థలు నడుపుతూ ప్రస్తుతం రాజకీయాల్లో చేరి పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీలో నిలిచి మూడు రౌండ్లు ఉమ్మడి 4 జిల్లాలు తిరిగివచ్చి ప్రచారంలో ముందున్నారు.అయితే కాలేజీలు, స్కూళ్లలో చదివిన సమయంలో విద్యార్థులకు ఏదైనా అవసరం ఉండి విద్యా సంస్థల అధినేతను కలవాలన్న, ఫోన్ చేసిన లిఫ్ట్ చేయరనే, అలాగే కాలేజీ,స్కూల్ ఫీజుల్లో రాయితీ ఇవ్వరనే ఆరోపణలు భాహాటంగానే వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని పేరెంట్స్,పూర్వ స్టూడెంట్స్ చెప్పడం కంటే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, సమావేశాల్లో కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం పట్టభద్రులను అశ్చర్యనికి గురిచేశాయాన్న టాక్ వినిపిస్తోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీ, ఇతర ప్రతినిధులు కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం విస్తృత ప్రచారం నిర్వహించినప్పటికీ అభ్యర్థి మైనస్ పాయింట్ల వల్ల పట్టభద్రుల్లో స్పందన కరువైందన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.అయితే రాష్ట్ర వ్యాప్తంగా బీసీ నినాదం ఉపందుకుంటున్న దరిమిలా బీసీ నేత,బీఎస్పీ అభ్యర్థి గెలుపుకు ఆ సంఘం నేతలు సమావేశాలు ఏర్పాటు చేయడమే గాకుండా పట్టభద్రులను కలస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు స్వయంగా ముఖ్యమంత్రి రంగంలోకి దిగి మూడు చోట్ల ప్రచారం చేయడం చూస్తుంటే అభ్యర్థికి ఎదురిత తప్పదన్న అభిప్రాయాలూ సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పోలింగుకు ఇంకా మూడు రోజులు మిగిలి ఉండగా పరిస్థితులు ఏమైనా కాంగ్రెస్ అభ్యర్తికి అనుకూలమైతే తప్పా గెలుపుపై ఆశలు సన్నగిల్లినట్లేనన్న అభిప్రాయాలూ వ్యక్తం చేస్తున్నారు...

# స్వశక్తితో మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకే 'స్త్రీ నిధి'



**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** పద్దెనిమిది నుండి అరవై సంవత్సరాల లోపు ఉన్న పేద మహిళలందరూ స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేరేలా ప్రోత్సహించాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ అన్నారు. ఎఫ్ సి ఐ క్రాస్ రోడ్స్ లోని మహిళా స్వశక్తి భవన్ లో సోమవారం నిర్వహించిన రామగుండం పట్టణ మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యుల సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొత్త స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని అన్నారు. స్వశక్తి మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు స్త్రీ నిధి. ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సబ్సిడీ రుణాలు పొందేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఇందిరా మహిళా స్వశక్తి పథకం ద్వారా ఎక్కువ మంది స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం బ్యాంకు లింకేజీ లక్ష్యం పెంచిన నేపథ్యంలో అర్హాత ఉన్న స్వశక్తి మహిళలు రుణం పొంది సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. స్వశక్తి సంఘాల్లో, వార్డు సమాఖ్యల్లో నిర్ణీత కాల వ్యవధిలో నాయకత్వ మార్పిడి జరగాలని అన్నారు. బ్యాంకర్ల సహకారంతో వీధి వ్యాపారులకు పి ఎం స్వనిధి రుణాల పంపిణీ వెంటనే జరిగేలా చూడాలని అన్నారు. రామగుండం నగరం మెరుగైన ర్యాంక్ సాధించడానికి స్వచ్ఛ సర్వేక్షణ్ లో పౌర స్పందన పై ప్రజలకు అవగాహన కల్పించి ఎక్కువ మంది నమోదు చేసేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో మెప్మా డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ సతీష్, స్త్రీ నిధి మేనేజర్ రాజారావు, మెప్మా టి ఎం సి మౌనిక, రామగుండం పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లతా మోహన్, కమ్యూనిటి ఆర్గానైజర్లు ఊర్మిళ, వార్డు సమాఖ్య ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలి
- టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కె బాపురావు
- కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన
- జిల్లా కలెక్టర్ పమేల సత్పత్తికి వినతి




**కరీంనగర్ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 24 (ది క్రైమ్ న్యూస్):** జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ పమేల సత్పత్తికి జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాపురావు మాట్లాడుతూ.. జర్నలిస్టుల పరిస్థితులు దారుణంగా మారాయని, అనేక ఓడిదుడుకుల మధ్య వృత్తిబాధ్యతలు నిర్వహిస్తున్నారని, చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కనీస సమస్యలను పరిష్కరించకుండా ఏండ్ల తరబడి జాప్యం చేస్తున్నాయన్నారు. జర్నలిస్ట్ ల ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్కారు రీవ్యూ పిటిషన్ వేసి వాదనలు చేయాలని, జర్నలిస్టులకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలెక్ని, లేకపోతే కొత్త విధానం ద్వారా ఇండ్లస్థలాలు ఇవ్వాలన్నారు. కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టి ఉద్యోగుల మాదిరిగా అమలుచేయాలన్నారు. జర్నలిస్తుల కంట్రిబ్యూషన్ ను ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందని, ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేసిందని, వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలుచేయాలన్నారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక రక్షణ చట్టాన్ని తేవాలన్నారు. మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు రాత్రి పూట రవాణా సదుపాయం కల్పించాలన్నారు. అర్హత ఉన్న చిన్న, మధ్య తరహా పత్రికలు ఎంపానెల్మెంట్లో చేర్చాలన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలు వివాదంగా మారాయని వెంటనే ఆ సమస్యను పరిష్కరించి నిర్మాణ అనుమతి పత్రాలను లబ్ధిదారులకు అందజేయాలని, హుజురాబాద్ లో కేటాయించిన స్థలాలు కోర్టు వివాదంలో ఉన్నాయని అట్టి సమస్యను



పరిష్కరించి పూర్తిస్థాయి అనుమతులతో జర్నలిస్టులకు అందించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సమస్యల పట్ల కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బిక్షపతి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరేందుల ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కర్ణాకర్ రావు, నాయకులు చట్ల శంకర్, కొమ్ము గణేష్, అతికం రాజశేఖర్, శంకర్ రెడ్డి, గుండి కిరణ్, సుదర్శన్ రెడ్డి, సురేష్, రవీందర్, సతీష్, తిరుపతి, జయేందర్, శ్రీనివాస్, శేఖర్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# కె వి కే లో రైతులకు శిక్షణ తరగతులు ...






**జమ్మికుంట ఫిబ్రవరి 24 (ది క్రైమ్ న్యూస్):** గ్రామ నవనిర్మాణ సమతి ఆధ్వర్యంలో ఈరోజు జమ్మికుంట లోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం నందు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మరోహ్ నిధి కార్యక్రమం సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నటువంటి రైతులకి కృషి విజ్ఞాన కేంద్రంలో నైపుణ్యత శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యాలక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో తయారుచేసే కషాయాల గూర్చి రైతులకి శిక్షణ తరగతులు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలని మరియు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నటువంటి రైతులకు సర్టిఫికెట్స్ కూడా ఇవ్వాలని మరియు ఎస్ హెచ్ జి అంగన్వాడి సెంటర్లు ఐకెపి ద్వారా రైతులకి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరడం జరిగింది. ఈ శిక్షణలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం జనరల్ సెక్రెటరీ పరిపాటి విజయగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రసాయన ఎరువులు ఎక్కువ వాడటం వలన భూసారం తగ్గుతుంది రసాయనాలు కొట్టినటువంటి ఆహారాన్ని మనం తీసుకోవడం వలన ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి మరియు మహిళా రైతులు అందరూ ముందుకు రావాలని మన దేశానికి ఆదర్శంగా ఉండాలని చెప్పడం జరిగింది ప్రకృతి వ్యవసాయంలో పండించినటువంటి పంటలు వల్ల మనమందరము ఆరోగ్యకరంగా ముందు తరాలకి చరిత్రగా ఉంటావని తెలియజేశారు రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలకు మంచి దిగుబడి మరియు గిట్టుబాటు ధర కూడా ఉంటుందని తెలియజేశారు. అదే విధంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త హెడ్ డా.ఎన్. వేంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని తమ ఇంటి మందం తినడానికి ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా పండించాలని చెప్పడం జరిగింది. అదే విధంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ నవనిర్మాణ సమితి జనరల్ సెక్రెటరీ పరిపాటి విజయ్ గోపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం. భాగ్య లక్ష్మి, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ వెంకటేశ్వర రావు, జమ్మికుంట వ్యవసాయ అధికారి షేఖ్ ఖాదర్ హుస్సేన్, కె.వికే శాస్త్రవేత్తలు విజయ్, మహేష్ , డి శ్రీనివాస్ రెడ్డి , జి వేణుగోపాల్, ప్రశాంతి మరియు ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ ప్రాజెక్టు కన్సల్టెంట్ బి రమాకాంత్ క్లస్టర్ కోఆర్డినేటర్స్ కర్రె మురళీధర్ గుర్రం అశోక్ మరియు ఫీల్డ్ స్టాప్, 150 మంది రైతులు, ఆర్ ఏ డబ్ల్యు ఈ పి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వమే న్యాయం చేయాలి

## - ఖమ్మం కలెక్టరేట్ ప్రజావాణిలో బాధితులు వినతి..



**ఖమ్మం ఉమ్మడి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ బాధితులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే న్యాయం చేయాలని, అగ్రిగోల్డ్ సంస్థల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని బాధితులకు డబ్బులు చెల్లించి న్యాయం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మెకల శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ 1996లో ప్రారంభించబడిందని, అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్లు చేస్తే ఎక్కువ లాభాలు వుంటాయని నమ్మించి, డిపాజిట్లు పేరుతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో దాదాపు 5 వేల కోట్ల రూపాయలు వసూలు చేసి కంపెనీలను ప్రారంభించారని, ఆ డబ్బులతో స్థలాలు, రిసార్ట్స్ నిర్మించారని తెలిపారు. 2015లో డిపాజిట్ దారులకు డబ్బులు తిరిగి ఇవ్వాల్సి వచ్చినప్పుడు అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్యం చేతులు ఎత్తివేసిందని విమర్శించారు. బాధితులు ఆందోళన చేయడంతో మేనేజిమెంట్‌ను అరెస్టు చేసి గత ప్రభుత్వాలు చేతులు దులుపుకున్నదని, తమ కష్టార్జితం నష్టపోయామని, మోసపోయామని కొంత మంది డిపాజిట్ దారులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్ చేసిన నగదు ఐదు వందల కోట్ల రూపాయల వరకు ఉంటాయని, తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ ఆస్తుల విలువ వెయ్యి కోట్లకు పైగా ఉంటాయని వారన్నారు. అగ్రిగోల్డ్ కంపెనీ మూతపడి పది సంవత్సరాలు అవుతున్నా బాధితులకు న్యాయం జరగలేదని, ఇటీవల కాలంలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి మెమోరాండం ఇవ్వడంతో అగ్రిగోల్డ్ సమస్యపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, అగ్రిగోల్డ్ ఆస్తులన్నింటిని వేలం వేసి బాధితులకు డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఆదిశగా నేటి వరకు ఎలాంటి చర్యలు చెపట్టలేదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు డబ్బులు చెల్లించి న్యాయం చేయాలని కోరారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అగ్రిగోల్డ్ బాధతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గోగుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత, మునగంటి వీర బ్రహ్మాచారి, తేనే వెంకయ్య, మోటపోతుల శ్రీరాములు, లక్ష్మి, రమేష్, హేమ, అనసూర్య, పరిమళ, విజయ, క్రిష్ణ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# మన్నెంపల్లిలో కాంగ్రెస్ నాయకుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లిలో 200 పట్టభద్రుల ఓటర్లు ఉండగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు మోరపెల్లి రమణ రెడ్డి, తుమ్మనపెళ్ళి శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ నాయకులు సోమవారం ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నిరుద్యోగ సమస్యలు పరిష్కరించి విద్యా ఉద్యోగాలను మెరుగుపరిచేందుకు నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని పట్టభద్రులను కాంగ్రెస్ నాయకులు కోరారు. కార్యక్రమంలో మన్నెంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూముల శ్రీనివాస్ నాయి, ప్రధాన కార్యదర్శి సుధాగోని శ్రీనివాస్, నాంపల్లి ఆంజనేయులు, పొట్ట శ్రీనివాస్ యాదవ్, తాళ్లపెల్లి కిరణ్ గౌడ్, దుర్గం శ్రీనివాస్, గుంటి శ్రీనివాస్, సానగొండ సంపత్, బోయిని ఎల్లయ్య, ఎండీ జఫర్, రావుల కృష్ణ గౌడ్, గుంటి మధుకర్ ,గుంటి అయోధ్య వేములా అనిల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముత్తారంలో ఘనంగా శ్రీనుబాబు జన్మదిన వేడుకలు..



**ముత్తారం.ఫిబ్రవరి.24.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీపాద ట్రస్టు చైర్మన్ శ్రీనుబాబు జన్మదిన వేడుకలను సోమవారం మండల కాంగ్రెస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కోసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం మండల నాయకులు మాట్లాడుతూ శ్రీనుబాబు నిత్యం ప్రజల్లో ఉంటూ,సామాజిక సేవా కార్యక్రమాలతో పేదలకు భరోసాగా నిలుస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ,డీసీసీ ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం,తదితరులు పాల్గొన్నారు.

# కరపత్రాలు పంచుతూ ఎమ్మెల్యే కవ్వంపల్లి ఎన్నికల ప్రచారం



**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని పట్టభద్రుల ఇళ్ళకు వెళ్ళి ఎమ్మెల్సీ ఎన్నికల మెనీఫేస్టో కరపత్రాలు పంచుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నరేందర్ రెడ్డిని గెలిపించుకుంటే ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పట్టభద్రుల సమస్యలను సత్వరం పరిష్కరిస్తారన్నారు. ప్రతిపక్షాల మాయమాటలకు మోసపోవద్దని, కాంగ్రెస్ పాలనలో పట్టభద్రులకు మేలు జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, కోండ్ర సురేష్, మడుపు ప్రేమ్ కుమార్, కత్తి మల్లయ్యగౌడ్, నందగిరి మల్లేశం, కోండ్ర అర్జున్, తాళ్ల కిరణ్, తాళ్ల నరేష్, రొడ్డ అంజయ్య, పిట్టల వెంకన్న, కోండ్ర రాంబాబు తదితరులు ఎమ్మెల్యే వెంట ప్రచారంలో పాల్గొన్నారు.

# లక్కారంలో ఉచిత వైద్య శిబిరం..



**ముత్తారం.ఫిబ్రవరి.24.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలం లక్కారం గ్రామంలో సోమవారం లయన్స్ క్లబ్ సెంటనరీకాలని,రేకుర్తి కరీంనగర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి అబ్బు కేశవరెడ్డి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ శరణ్య,టెక్నీషన్ ప్రభాకర్ 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 30 మందిని కంటి ఆపరేషన్ కు ఎంపిక చేసి వారికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించి కరీంనగర్ కు తరలించారు. ఈ వైద్య శిబిరానికి సహకరించిన రేకుర్తి కంటి దవాఖానా చైర్మన్ కొండ వేణుమూర్తికి,వైస్ చైర్మన్ సురేష్‌కు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎం శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్తారం మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి,గంట వెంకట రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు సాయంత్రం నాలుగు గంటల నుండి 48 గంటలు సైలెన్స్ పీరియడ్ అమల్లో ఉంటుంది

## • జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ



**భూపాలపల్లి, ఫిబ్రవరి - 24:(ది క్రైమ్ న్యూస్):** ఈ నెల 27న జరిగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో 48 గంటల సైలెన్స్ పీరియడ్ అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. పోలింగ్ సందర్భంగా 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి 27వ తేది సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని గుంపులుగా ఉండటం, ప్రచారం చేయడం నిషిద్ధమని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ప్రచారం, బల్క్ ఎస్ఎంఎస్ లు పంపడం కూడా నిషేధమని తెలిపారు. తప్పకుండా ప్రతి ఒక్కరు ఎన్నికల మార్గదర్శకాలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. సైలెన్స్ పీరియడ్ లో భాగంగా 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ సభలు, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించడం ప్రచారం చేయడం, అభ్యంతకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్ పంపడంపై ఎన్నికల సంఘం పటిష్టమైన నిఘా అమలు చేయనున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే సందేశాలను నిశితంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. సైలెన్స్ పీరియడ్ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ లో ప్రచార కార్యక్రమాలు నిర్వహణకు వచ్చిన ఇతర జిల్లాల వ్యక్తులు జిల్లాలో ఉండొద్దని ఆయన స్పష్టం చేశారు. ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి, ఎంసీసీ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండి నిశిత పరిశీలన చేయాలని తెలిపారు. కళ్యాణ మండపాలు, హొటళ్లు, లాడ్జిలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని ఆయన సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఒపీనియన్ పోల్, ఎగ్జిట్ పోల్స్ కూడా నిషేధమని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికలు నిర్వహించే ఆయా జిల్లాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తు.చ తప్పక పాటించాలని, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ స్పష్టం చేశారు.

# పది పరీక్షలు మార్చి 21వ తేదీ నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు




**భూపాలపల్లి, ఫిబ్రవరి - 24:(ది క్రైమ్ న్యూస్):** 10 పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఛాంబర్ లో 10 తరగతి వార్షిక పరీక్షలు నిర్వహణపై విద్యా, విద్యుత్, వైద్య, ఆర్టీసీ, తదితర శాఖల అధికారు లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 21 నుండి ఏప్రిల్ 04 వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతాయని వివరించారు. పరీక్షలను సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు పరీక్ష సమయాలకు అనుగుణంగా రవాణా సదుపాయం కల్పనకు బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్ కో ఎస్.ఈకి సూచించారు. ఎలాంటి లోటుపాట్లను తావులేకుండా పరీక్షలను సజావుగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీటి సౌకర్యం కల్పించాలని, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనెలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారి కి సూచించారు. కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించి, కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ఈ సమావేశంలో డీఈఓ రాజేందర్, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, కలెక్ట రేట్ ఏవో ఖాజా మొహినుద్దీన్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్య లకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి...

**- పట్టభద్రుల, టీచర్స్‌ల సమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ కు తగిన గుణపాఠం చెప్పాలి**

**- ఎన్నికల ప్రచారంలో బిజెపి నేతలు బొంతల కళ్యాణ్ చంద్ర**



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 24(ది క్రైమ్ న్యూస్):** ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని తిమ్మాపూర్ మండలంలోని అలుగునూర్, మహాత్మా నగర్, తిమ్మాపూర్ ప్రాంతాల్లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈనుకొండ నాగేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఎడ్ల జోగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి , సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుల బొంతల కళ్యాణ్ చంద్ర లు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పట్టభద్రులు, టీచర్స్ లను కలిసి బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి కి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య లకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టభద్రుల, ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి, వారి సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. అందుకే నిరుద్యోగ పట్టభద్రులు , టీచర్స్ గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ తగిన గుణపాఠం చెప్పారని , అభయంతోనే నేడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితి ని కొనితెచ్చుకుందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గత బిఆర్ఎస్ బాటలోనే నడుస్తుందన్నారు. నిరుద్యోగ పట్టభద్రులకు ప్రతినెల రూ.4000 ఇస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిందని , నేడు 14 నెలల కాలమైనా ఏ ఒక్కరికి నిరుద్యోగ భృతి ఇవ్వలేక పోయిందన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఒక్కో నిరుద్యోగి 54 వేల రూపాయలు బాకీ పడిందన్నారు. ఇక ఉద్యోగులు కనీసం రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందలేని పరిస్థితిలో ఉన్నారని, టీచర్స్ అనేక సమస్యలు ఇబ్బందులతో బాధపడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరి స్తుందన్నారు. పట్టభద్రుల , టీచర్స్ ల సమస్యల పరిష్కారం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిరుద్యోగ భృతి హామీ తో నిరుద్యోగ పట్టబద్రుల ఓట్లు దండుకొని మోసం చేసిన కాంగ్రెస్ కు జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు కనీస బెనిఫిట్స్ కూడా అందించలేని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి టీచర్స్ కూడా తగిన బుద్ధి చెప్తారన్నారు. పట్టభద్రుల , టీచర్స్ ల సమస్యల కోసం కొట్లాడింది, ముఖ్యంగా 317 జీవో కు వ్యతిరేకంగా ఉద్యమించింది కేవలం బిజెపి యే నని ఈ సందర్భంగా చెప్పారు. బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులను జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి ఆశీర్వదిస్తే పట్టభద్రుల, టీచర్స్ గొంతుకను శాసనమండలిలో వినిపించి, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు చింతం శ్రీనివాస్ , బీజేవైఎం జిల్లా అధ్యక్షులు గడ్డం అరుణ్ , నాయకులు కొత్తూరి శ్రీనివాస్, జంగాపల్లి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించిన సీఎం....





**తిమ్మాపూర్ ఫిబ్రవరి24, (ది క్రైమ్ న్యూస్):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో జరిగిన నిర్వహించిన పట్టభద్రుల సంకల్ప సభ అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎల్ఎండీ కాలనీలోని మానకొండూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీఎంకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్వాగతం పలికారు. సీఎం వెంట ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మకుమార్, పెద్దపల్లి, చొప్పదండి,జగిత్యాల, రామగుండం శాసనసభ్యులు సీహెచ్ విజయరమణారావు, మేడిపల్లి సత్యం, డాక్టర్ సంజయ్ కుమార్, రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, మాజీ ఎమ్మెల్సీ తానిపర్తి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జీలు పురమల్ల శ్రీనివాస్, వొడితెల ప్రణవ్ రావు తదితరులు ఉన్నారు.

# నరేందర్ రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగులకు అండగా ఉంటాడు

**- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**



**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూరులోని ఎన్వీ గార్డెన్స్ లో సోమవారం నిర్వహించిన పట్టభద్రుల సమావేశానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.... ఈనెల 27న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే నిరుద్యోగులకు అండగా ఉంటూ భరోసా కల్పిస్తారన్నారు. ఉపాధ్యాయుడిగా చేస్తూ ఆల్ఫోర్స్ విద్యాసంస్థలకు అధిపతిగా ఎదిగి ఎంతో మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించి అనేక మంది విద్యార్థులను ఉన్నతస్థాయిలో తీర్చిదిద్దిన ఘనత నరేందర్ రెడ్డికి దక్కుతుందని కొనియాడారు. 5వేల మంది నిరుద్యోగులకు తన విద్యాసంస్థల్లో ఉద్యోగాలిచ్చి వారి జీవితాలను చక్కదిద్దారని, కష్టం విలువ, నిరుద్యోగుల బాధలను అర్థం చేసుకోగల నరేందర్ రెడ్డిని గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అండతో పట్టభద్రుల సమస్యలన్నింటిని తీర్చగలుగుతారని ఎమ్మెల్యే కవ్వంపల్లి పట్టభద్రులకు సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుకు ప్రమాద భీమా కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేత

**- టి యు డబ్ల్యు జె (ఐ జె యు)జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు క్యాతం సతీశ్, సామంతుల శ్యామ్**



**భూపాలపల్లి, ఫిబ్రవరి - 24:(ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో పని చేస్తున్న ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరికి ప్రమాద భీమా పాలసీ చేపించవలసిందిగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కు వినతి పత్రం అందించినట్లు టి యు డబ్ల్యూ జే (ఐ జే యు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్యాతం సతీష్, సామంతుల శ్యామ్ తెలిపారు. వార్తల సేకరణ కోసం నిరంతరం తిరుగుతూ ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టు లందరికి ప్రమాద భీమా పాలసీ చేపించించడం కోసం జిల్లా కలెక్టర్ బడ్జెట్ నుండి నిధులు కేటాయించి, మీ చేతుల మీదుగా జిల్లాలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికి ప్రమాద భీమా పత్రాలను అందించ వలసిందిగా కలెక్టర్ కు వినతిపత్రం అందించినట్లు టి యు డబ్ల్యూ జె (ఐజెయు) జిల్లా కమిటీ పక్షాన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజేయు రాష్ట్ర హెల్త్ కమిటీ మెంబర్ సామల శ్రీనివాస్, రాష్ట్ర ఈసీ మెంబర్ విజయ్, ఐజేయు జిల్లా ఉపాధ్యక్షుడు తడక సుధాకర్, టెంజు జిల్లా అధ్యక్షుడు కొంకల సాంబయ్య, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ సమ్మయ్య గౌడ్, జర్నలిస్టులు సాంబయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

**- కొత్త అక్రిడేషన్‌లు జారీ చేయాలి..**

**- జిల్లా కలెక్టర్‌కు తెలంగాణ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకుల వినతి..**

**జగిత్యాల, (ది క్రైమ్ న్యూస్ ప్రతినిధి ):** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, కనీస సమస్యలను పరిష్కరించ కుండా ఏండ్ల తరబడి జాప్యం చేస్తున్నాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ టీడబ్ల్యూజేఎఫ్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు నల్లాల జైపాల్ ఆరోపించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రాష్ట్ర వ్యాప్త ఆందోళన లో బాగంగా జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు విజ్ఞప్తి చేశారు. అనంతరం జైపాల్ మాట్లాడుతూ ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్కారు రీవ్యూ పిటిషన్ వేసి వాదనలు చేయాలని, జర్నలిస్టులకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే కొత్త విధానం ద్వారా ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని, ఉద్యోగుల మాదిరిగా అమలు చేయాలన్నారు. జర్నలిస్తుల కంట్రిబ్యూషన్ ను ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయకుండా రెండుసార్లు వాయిదా వేసిందని, వెంటనే అర్హులైన జర్నలిస్టు లందరికీ కొత్త కార్డులివ్వాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలుచేయాలని ప్రభుత్వన్ని జైపాల్ కోరారు.రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక రక్షణ చట్టాన్ని తేవాలన్నారు.మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు రాత్రి పూట రవాణా సదుపాయం కల్పించాలని,అర్హత ఉన్న చిన్న, మధ్య తరహా పత్రికలు ఎంపానెల్మెంట్లో చేర్చాలన్నారు.జర్నలిస్టుల దయనీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వెంటనే పై సమస్యలను పరిష్కరించేలా మీరు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ద్యావర సంజీవ రాజు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మాకు రాజలింగం, కోశాధికారి మేన్నేని శ్రీనివాసరావు, ఆముద లింగారెడ్డి,వేముల కృష్ణ కుమార్, రేణిగుంట శ్రీనివాస్, ఉత్తం మహేశ్, ముల్క రాజేశం, మాణిక్యం గంగాధర్,ఓల్లాల రాజశేఖర్,బొల్లం అజయ్ కుమార్, చింతలపల్లి సతీశ్, అబ్బా డి సోమేశ్వర్, జాగర్ల మనోజ్ కుమార్, కుర్మ రమేశ్,అట్లా నగేశ్, పల్లె లక్ష్మి నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

# వీల్ చైర్‌లో వచ్చి ప్రచారం నిర్వహించిన పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు....



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి24, (ది క్రైమ్ న్యూస్):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బిక్నూర్ మండలంలో ప్రచార నిర్వహించిన స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు రెండు రోజుల కిందట కోరుట్ల జరిగిన ప్రమాదం నుండి కోలుకుంటూ డాక్టర్ల సూచనలు పాటిస్తూ ఈరోజు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బిక్కనూర్ మండల కేంద్రంలో వీల్ చైర్ లో వచ్చి ప్రచారం నిర్వహించిన పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు ఆ దేవుని ఆశీస్సులు ప్రజలకు సేవ చేయాలనే తన సంకల్పమే తనను బ్రతికించిందని అన్నారు సేవ చేసే రుణం ఉన్నది కాబట్టే ఈరోజు మళ్లీ నన్ను మీ ముందుకు వచ్చేలా ఆ భగవంతుడు చేశాడని అన్నారు. ఈ ఎలక్షన్స్ కామన్ మ్యానుకు కార్పొరేట్ మ్యానుకు మధ్య జరుగు తుందని, బిజినెస్ మ్యానుకు సర్వీస్ మ్యానుకు మధ్య జరుగుతున్న ఎలక్షన్స్ గా తను చూస్తున్నానని వందల వేల కోట్లు ఉన్న వ్యక్తులు ఈరోజు వస్తున్నారని యువత ఆలోచించి ఓటు వేయాలని అన్నారు.ముఖ్యంగా తన వాకిట్లో ఉండేవాడినని ప్రజల పక్షావదినని గత 22 సంవత్సరాలుగా ట్రస్మా సంఘాన్ని స్థాపించి సేవా కార్యక్రమంలో ఉన్నానని అన్నారు. ప్రైవేట్ టీచర్ల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది వరకు ప్రైవేట్ పాఠశాలల టీచర్లు పట్టబద్రులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్

# పాక్‌కు సెమీస్ అవకాశాలు సంక్లిష్టం




గ్రూప్ ఎ పాయింట్ల పట్టికలో అట్టడుగున పాకిస్తాన్ నిజంగానే పాకిస్తాన్ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 నుంచి నిష్క్రమించాల్సిందేనా లేదా అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. న్యూజిలాండ్, ఇండియాపై వరుస పరాజయాలతో పాక్ పరిస్థితి ఘోరంగా మారింది. అయితే కొన్ని సమీకరణాలు వర్కవుట్ అయితే పాకి సెమీస్ అవకాశాలు ఇంకా మిగిలి ఉంటాయంటున్నారు క్రీడా పండితులు. న్యూజిలాండ్, ఇండియాపై వరుస పరాజయాలతో ఛాంపియన్స్ ట్రోఫీ 2025 గ్రూప్ ఎ పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న పాకిస్తాన్ టోర్నీ నుంచి అవుట్ అనే వార్తలు వస్తున్నాయి. అటు మహీంద్ర సింగ్ ధోనీ సైతం అదే మాట చెబుతున్నాడు. న్యూజిలాండ్ ఒక మ్యాచ్ గెలిచి 2 పాయింట్లతో ఉంటే బంగ్లాదేశ్ ఒక మ్యాచ్ ఓడి సున్నా పాయింట్లతో ఉంది. అయితే న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌లకు ఇంకా రెండేసి మ్యాచ్‌లు ఉన్నాయి. పాకిస్తాన్, ఇండియాలకు ఒకే మ్యాచ్ మిగిలి ఉంది. అందుకే అత్యధిక విశ్లేషకులకు పాక్ సెమీస్ అవకాశాలు లేవని, టోర్నీ నుంచి అవుట్ అని అంటున్నారు. అయితే పాకిస్తాన్‌కు ఇంకా సెమీస్ అవకాశాలు మిగిలి ఉన్నాయని, అది పూర్తిగా ఇతర జట్ల జయాపజయాలు, రన్ రేట్ బట్టి ఉంటుందని చెబుతున్నారు. వాస్తవం కూడా అదే. పాకిస్తాన్‌కు ఇంకా సెమీస్ అవకాశాలు పూర్తిగా మూసుకుపోలేదు. కొన్ని సమీకరణాలు సాధ్యమైతే పాక్ సెమీస్ చేరుకోవచ్చు. 1. ఫిబ్రవరి 24 ఇవాళ న్యూజిలాండ్‌పై బంగ్లాదేశ్ విజయం సాధించాలి . 2. ఫిబ్రవరి 27 బంగ్లాదేశ్‌పై పాకిస్తాన్ భారీ తేడాతో గెలవాల్సి ఉంటుంది. 3. మార్చ్ 2 ఆదివారం న్యూజిలాండ్‌పై ఇండియా భారీ తేడా విజయం సాధించాలి. ఇలా జరిగితే ఇండియా 6 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంటుంది. మిగిలిన మూడు జట్లు రెండేసి పాయింట్లతో మిగులుతాయి. అప్పుడు ఏ జట్టుకు రన్‌రేట్ ఎక్కువగా ఆ జట్టు రెండో స్థానంలో నిలిచి ఇండియాతో పాటు సెమీస్ చేరుతుంది. అయితే న్యూజిలాండ్‌పై బంగ్లాదేశ్, ఇండియాలు గెలవడం, బంగ్లాదేశ్‌పై పాకిస్తాన్ భారీ తేడాతో విజయం తప్పనిసరి. అప్పుడే పాకిస్తాన్‌కు సెమీస్ అవకాశాలు తెర్చుకుని ఉంటాయి. అయితే పైన చెప్పిన సమీకరణాల్లో బంగ్లాదేశ్‌పై పాకిస్తాన్, కివీస్‌పై ఇండియా గెలిచే అవకాశాలు ఉన్నా న్యూజిలాండ్‌పై బంగ్లాదేశ్ విజయం దాదాపుగా అసాధ్యం. ఇది జరగాలంటే మేజిక్ జరగాల్సిందే. న్యూజిలాండ్ గెలిస్తే మాత్రం ఏ సమీకరణాలు పనిచేయవు. పాకిస్తాన్ టోర్నీ నుంచి నిష్క్రమించే తొలి దేశం అవుతుంది.

## ఇంటర్నెట్‌లో అనుష్క రియాక్షన్ వైరల్

ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్?పై భారత్ ఘన విజయం నమోదు చేసింది. ఆదివారం దుబాయ్ వేదికగా జరిగిన మ్యాచ్?లో టీమ్‌ఇండియా 6 వికెట్ల తేడాతో నెగ్గింది. టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సూపర్ సెంచరీతో అదరగొట్టాడు. కొంతకాలంగా తనపై వస్తున్న విమర్శలకు విరాట్ అద్భుత శతకంతో సమాధానమిచ్చాడు. విరాట్ మళ్లీ ఫామ్? అందుకోవడంతో అభిమానులు జోష్?లో ఉన్నారు. ఈ క్రమంలోనే తన సతీమణి, నటి అనుష్క శర్మ కూడా కింగ్ సెంచరీపై ఆనందం వ్యక్తం చేసింది. ఇన్‌స్టాగ్రామ్? స్టోరీస్‌లో ఫొటో షేర్ చేసింది. ఇండో- పాక్ మ్యాచ్‌ను ఇంటి నుంచే వీక్షించిన అనుష్క, టీవీలో విరాట్ సెంచరీ సంబరాలను ఫొటో తీసి షేర్ చేసింది. దానికి 'లవ్', 'హైఫై' ఎమోజీలను జత చేసి తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. ఇక సెంచరీ చేసిన తర్వాత కోహ్లీ తన మెడలోని గొలుసుకున్న వెడ్డింగ్ రింగ్‌ను ముద్దాడాడు. అనుష్కకు సందేశమిచ్చేలా కెమెరాకు విజయసంకేతం చూపించాడు. ప్రస్తుతం అనుష్క పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ మ్యాచ్?లో విరాట్ అద్భుత ఇన్నింగ్స్?ను పాకిస్థాన్ కెప్టెన్ రిజ్వాన్ ప్రశంసించాడు. తమ నుంచి కోహ్లీ మ్యాచ్ లాగేసుకున్నాడని అన్నాడు. 'విరాట్ హార్డ్ వర్క్ చూసి నేను ఆశ్చర్యపోయాను. ఈ మ్యాచ్ కోసం అతను చాలా కష్టపడి ఉంటాడు. చాలా ఈజీగా బంతిని బాదేశాడు. విరాట్‌ను ఔట్ చేయడానికి చాలా ప్రయత్నించాం. మేం అతడికి పరుగులు ఇవ్వొద్దనుకున్నాం' 'కానీ, సునాయసంగా పరుగులు చేస్తూ మా నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నాడు. కోహ్లీ ఫిట్‌నెస్ లెవల్, అతను కష్టపడిన తీరును కచ్చితంగా మెచ్చుకుంటాను. ఎందుకంటే అతను క్రికెటర్. మేమూ క్రికెటర్లమే. కోహ్లీ ఫామ్‌లో లేడని అందరూ అన్నారు. కానీ, పెద్ద మ్యాచ్‌లో భారీ ఇన్నింగ్స్ ఆడాడు' అని మ్యాచ్ అనంతరం రిజ్వాన్ పేర్కొన్నాడు. కాగా, ఈ మ్యాచ్?లో విరాట్ 100 (116 బంతుల్లో) అదరగొట్టాడు. విరాట్?కు వన్డేల్ల ఇది 52వ సెంచరీ కాగా, ఓవరాల్?గా 82వ అంతర్జాతీయ శతకం. ఈ లిస్ట్?లో విరాట్ కంటే ముందు సచిన్ తెందూల్కర్ (100 సెంచరీలు) ఒక్కడే ముందున్నాడు. ఈ మ్యాచ్?లోనే విరాట్ మరో ఘనత సాధించాడు.



## పాకిస్తాన్ మేనేజ్మెంట్‌పై దుమ్మెత్తి పోసిన షోయబ్ అక్తర్

"మేనేజ్మెంట్ కి వ్యూహం లేదు.. కెప్టెన్ కి బుర్ర లేదు " పాకిస్తాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ షోయబ్ అక్తర్ ఛాంపియన్ ట్రోఫీ లో ఓటమి తర్వాత పాకిస్తాన్ టీం పై విరుచుకుపడిన తీరు. స్వయంగా ఈసారి టోర్నమెంట్ నిర్వహిస్తూ పాకిస్తాన్, దుబాయ్ పిచ్ లపై అవగాహన లేకపోతే ఎలా అంటూ పాకిస్తాన్ మేనేజ్మెంట్ పై దుమ్మెత్తి పోశాడు. పిచ్ లు దృష్టిలో పెట్టుకుని టీం ని ఎంపిక చేయాలి గానీ తమకు నచ్చిన వాళ్ళను సెలెక్ట్ చేసి పంపిస్తే ఫలితం ఇలాగే ఉంటుందని అక్తర్ సహా మాజీ లందరూ పిసిబిని ఏకుతున్నారు. ఒకవైపు ఇండియన్ టీం పూర్తి ఆధిపత్యం చాలాయిస్తుంటే పాక్ టీం మాత్రం ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయిందని పాక్ మాజీ కెప్టెన్ వసీం అక్రమ్ వాపోయారు. మరో బెటర్ రమీజ్ రాజా అయితే మెంటల్ గా టెక్నికల్ గా ఇండియన్ టీం స్ట్రాంగ్ గా ఉంటే పాకిస్తాన్ పూర్తిగా దానికి విరుద్ధంగా ఉందని అన్నారు. దుబాయ్ పిచ్ పై ఇండియన్ టీం ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగితే పాక్ కెప్టెన్ రిజ్వాన్ మాత్రం ఒక్క స్పిన్నర్ తోటే టీంని రెడీ చేయడం పూర్తిగా తప్పని విశ్లేషించారు. పాకిస్తాన్ పై ఇండియా గెలిస్తే ఇండియన్ ఫాన్స్ సైతం పెద్దగా సెలబ్రేట్ చేసుకోవడం లేదని ఎందుకంటే ఇండియా గెలుస్తుందని వాళ్లకు ముందే తెలుసని పాకిస్తాన్ టీం ప్రదర్శన కొన్నేళ్లుగా ఇండియా పై ఎంత అద్వాన్నంగా ఉందో చెప్పడానికి ఇదే ఉదాహరణ అని ఆయన అన్నారు. ఇండియన్ ఫ్యాన్స్ పాక్ తో కంటే బంగ్లాదేశ్ తో ఆడినప్పుడు ఇంట్రెస్టింగ్ గా మ్యాచ్ చూస్తున్నారని రమీజ్ అన్నారు. ఇంత పెద్ద టోర్నమెంట్లో కనీసం 50 ఓవర్ల పాటు బ్యాటింగ్ పూర్తి చేయలేకపోవడాన్ని మించిన అవమానం ఇంకొకటి లేదని రమీజ్ పాకిస్తాన్ టీం పై ఫైర్ అయ్యారు. మరో పాకిస్తాన్ లెజెండ్ ఇంజమామ్ -ఉల్ -హక్ అయితే ఛాంపియన్ ట్రోఫీలో ఆడుతున్న దేశాల్లో కేవలం ఒకే ఒక్క స్పిన్నర్ తో బరి లోకి కి దిగింది పాకిస్తాన్ మాత్రమే అని ఇది అస్సలు ముందు చూపు లేని ఆలోచనని విమర్శించాడు. అసలు పాకిస్తాన్ టీం కి రెగ్యులర్ ఓపెనర్ లేదని మూడో నెంబర్ లో స్థిరంగా ఆడుతున్న బాబర్ ఆజాం ను సడన్ గా ఓపెనింగ్ కు తీసుకు రావడం బుద్ధి తక్కువ పని అని తిట్టి పోశాడు. టీం ప్రదర్శన కన్నా ముందు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు, సెలక్షన్ కమిటీ కి బుర్ర లేదని ఆల్టర్నేటివ్ ఓపెనర్ లేకుండానే అంత పెద్ద టోర్నీ కి టీని ఎలా సెలెక్ట్ చేశారంటూ మండిపడ్డాడు. మరో మాజీ ఆటగాడు మహమ్మద్ ఆఫీజ్ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ప్లానింగ్ గట్టిగానే చేస్తుంది కానీ ఆట లోకి వచ్చేసరికి ఆడదని అన్నాడు. పాకిస్తాన్ దగ్గర అసలు విన్నింగ్ మంత్రానే లేదని దుబాయ్ పిచ్ లపై 240 వరకూ పరుగులు చేస్తే గెలవడానికి అది సరిపోతుందని కానీ స్పిన్నర్లు టీం లో ఉండాలని అది లేకపోవడం వల్లే పాక్ ఇంత ఘోరంగా ఓడిపోయిందని అభిప్రాయపడ్డాడు. షోయబ్ మార్క్ సైతం పాక్ టీం పై మండి పడ్డాడు. ఇది ఒక వేకప్ కల్ అని టి20 ఫార్మాట్ ఇమేజ్ నుండి పాక్ టీం బయటపడాలని 4 ఓవర్ల బ్యాటింగ్.. 4 ఓవర్ల బౌలింగ్ చేస్తే చాలనే మైండ్ సెట్ నుండి ఆటగాళ్లు బయటికి రావాలని సూచించారు. మరోవైపు సెంచరీ తో ఫామ్ లోకి వచ్చి చేజ్ మాస్టర్ గా ఇంకోసారి నిరూపించుకున్న విరాట్ కోహ్లీ పై పాక్ మాజీలు ప్రశంసలు కురిపించారు.







## కోహ్లీ చేతికి నయా రిస్ట్ బ్యాండ్..


ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం పాకిస్థాన్ తో జరిగిన మ్యాచ్ లో ఆరు వికెట్లతో గెలిచిన సంగతి తెలిసిందే. విరాట్ కోహ్లీ సూపర్ సెంచరీ (100 నాటౌట్) తో సత్తా చాటడంతో టీమిండియా సునాయాసంగా గెలుపొందింది. అయితే సెంచరీ చేశాక కోహ్లీ హెల్మెట్ తీసి చేయి పైకెత్తినప్పుడు ఒక నల్లని బ్యాండ్ అందరి దృష్టిని ఆకర్షించింది. చాలామంది దాన్నో ఫిట్ నెస్ ట్రాకర్ అని అనుకుంటున్నారు. కాదు. అంతకుమించి, అని తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వీవీఐపీలు, సెలెబ్రిటీలు ఈ రిస్ట్ బ్యాండు ను ధరిస్తారు. వూప్ అనే పేరు గల ఈ బ్యాడ్ ఫిట్ నెస్ ప్రపంచంలో ప్రకంపనలు రేకెత్తిస్తోంది. ఫుట్ బాల్ సెలెబ్రిటీ క్రిస్టియానో రొనాల్డో, మేటి గోల్ఫర్ టైగర్ వుడ్స్, బ్రిటిష్ యువరాజు ప్రిన్స్ విలియం తదితరులు ఈ బ్యాండును ధరిస్తున్నారు. దీంతో ఈ బ్యాండ్ పై చాలా క్రేజ్ పెరిగి పోయింది. తాజాగా కోహ్లీ చేతికి ఇది కన్పించడంతో చాలామంది ఫోకస్ దీనిపై పడింది. ఈ రిస్టు బ్యాండులో చాలా ప్రత్యేకతలు ఉన్నాయని ఫిట్నెస్ నిపుణులు పేర్కొంటున్నారు. దీన్ని ధరించడం ద్వారా రియల్ టైమ్ స్ట్రెస్ లెవల్స్, రికవరీ రేటు, ఓవరాల్ ఫిజికల్ దృఢత్వం లాంటివి చెక్ చేసుకోవచ్చు. దీని ద్వారా తమ ట్రైనింగ్, ఫర్ఫార్మెన్స్ లాంటివి మెరుగు పర్చుకోవచ్చు. దీన్ని2015లో విల్ అహ్మద్ అనే వ్యకి స్థాపించారు. దశాబ్ధ కాలంగా ఫిట్ నెస్ ప్రపంచంలో సత్తా చాటుతోంది. తాజాగా వూప్ 4.0 పేరుతో బ్యాండ్ రిలీజ్ అయింది. దీనికి అనుసంధానంగా రియల్ టైమ్ కోచ్ ను కూడా ఏఐ సాయంతో కంపెనీ అందిస్తోంది. దీంతో లెవల్స్ ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, తగిన సలహాలు సూచనలు పొందవచ్చు. ఇండియాలో కూడా దీని సేవలు ప్రారంభమయ్యాయి. ఏడాదికి 19, 598 రూలతో మెంబర్ షిప్ తీసుకుంటే బ్యాండ్ తోపాటు లైఫ్ టైమ్ వాలిడిటి, యాప్ కు యాక్సెస్ ను అందిస్తుంది. రెండేళ్లకు 33,308 రూ.ల అమౌంట్ ను చార్జ్ చేస్తోంది. గ్లోబల్ స్పోర్ట్స్ సెలెబ్రిటి అయిన ఫుట్ బాల్ లెజెండ్ క్రిస్టియానో రొనాల్డో ఈ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. సంస్థకు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించడంతోపాటు పెట్టుబడులు కూడా పెట్టాడు రొనాల్డో. అప్పటి నుంచి ఈ యాప్ ఇంకా వేగంగా మార్కెట్లోకి చొచ్చుకు పోయింది. పాట్రిక్ మమోమస్, మెక్ ఇల్రాయ్, లబ్రోన్ జేమ్స్, మైకెల్ ఫెల్ప్స్ తదితరులు ఈ సంస్థ వినియోగదారుల జాబితాలో ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కూడా సేవలను ఈ కంపెనీ అందిస్తోంది. సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, కువైట్, బహ్రైన్, హాంకాంగ్, ఇజ్రాయెల్, సౌత్ కొరియా, తైవాన్ తదితర దేశాలకు విస్తరించింది. ఇక కోహ్లీ చేతికి ఈ బ్యాండు ను చూశాక చాలామంది ఇంటర్నెట్లో దీనిపై సెర్చ్ చేస్తున్నారు.

## పాండ్యా వాచ్ ఖరీదు రూ.7 కోట్లు

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భాగంగా ఫిబ్రవరి 23న దుబాయ్‌లో భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య మ్యాచ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో భారత స్టార్ ఆటగాడు హార్దిక్ పాండ్యా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 8 ఓవర్లలో 31 పరుగులు మాత్రమే ఇచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్ సందర్భంగా, హార్దిక్ ఒక ప్రత్యేకమైన, ఖరీదైన వాచ్ ధరించి కనిపించాడు. దానికి సంబంధించిన చిత్రాలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. ఈ గడియారం ఖరీదు కోట్లలో ఉంటుందని చెబుతున్నారు. ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా పాకిస్తాన్‌తో ధరించిన వాచ్ రిచర్డ్ మిల్లె రాసిన రాఫెల్ నాదల్ స్కెలిటన్ డయల్ ఎడిషన్. మీడియా నివేదికల ప్రకారం, ఈ గడియారం ధర భారతీయ రూపాయలలో దాదాపు రూ.7 కోట్లు. హార్దిక్ పాండ్యా ఇంత ఖరీదైన వాచ్ ధరించడం ఇదే మొదటిసారి కాదు. మ్యాచ్ సమయంలో హార్దిక్ ఈ వాచ్ ధరించి కనిపించగానే, అభిమానులు దాని ధర తెలుసుకోవాలని ఆసక్తిగా చూశారు. హార్దిక్ పాండ్యా తన విలాసవంతమైన జీవనశైలికి, ఖరీదైన గడియారాల పట్ల మక్కువ చూపిస్తాడని తెలిసిందే. ఇది కాకుండా, హార్దిక్ పాండ్యా దగ్గర చాలా లగ్జరీ వాచీలు కూడా ఉన్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో, పాకిస్తాన్ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. పాక్ జట్టు ప్రారంభం చాలా సాధారణంగా ఉంది. రిజ్వాన్, సౌద్ షకీల్ భాగస్వామ్యం పాకిస్తాన్‌ను 200 దాటించింది. భారత బౌలర్లు అద్భుతంగా రాణించి మొత్తం పాకిస్తాన్ జట్టును 241 పరుగులకే ఆలౌట్ చేశారు.



# టీమ్‌ఇండియా డ్రెస్సింగ్ రూమ్‌లో ధావన్




టీమ్‌ఇండియా మాజీ ప్లేయర్ శిఖర్ ధావన్ తాజాగా జట్టు డ్రెస్సింగ్ రూమ్?లో సందడి చేశాడు. దుబాయ్ వేదికగా పాకిస్థాన్?తో మ్యాచ్ అనంతరం, బెస్ట్ ఫీల్డర్ విన్నర్‌ను ప్రకటించడానికి కోచ్ దిలీప్ శిఖర్ ధావన్‌ను టీమ్‌ఇండియా డ్రెస్సింగ్ రూమ్‌లోకి ఆహ్వానించారు. భారత ఆటగాళ్లు చప్పట్లు కొడుతూ ధావన్‌ను స్వాగతం పలికారు. హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా అతడిని హాగ్ చేసుకున్నారు. అనంతరం శిఖర్ ఆటగాళ్లతో ముచ్చటించాడు. ముందుగా ఘన విజయం సాధించిన టీమ్‌ఇండియాకు శుభాకాంక్షలు తెలిపాడు. ముఖ్యంగా బంతితో అదరగొట్టిన బౌలింగ్ యూనిట్?ను, బ్యాటింగ్‌లో అదరగొట్టిన విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్‌ను ధావన్ అభినందించాడు. జట్టులోని సీనియర్లు, సపోర్టింగ్ టీమ్?ను కూడా మెచ్చుకున్నాడు. ఇక తనను డ్రెస్సింగ్ రూమ్?లోకి ఆహ్వానించినందుకు థాంక్స్ చెప్పాడు. చివరకు అక్షర్ పటేల్‌ను బెస్ట్ ఫీల్డర్‌గా ప్రకటించి మెడల్‌ను బహుకరించాడు. ఇందుకు సంబంధించిన వీడియోను బీసీసీఐ సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఆదివారం పాకిస్థాన్?తో జరిగిన మ్యాచ్‌లో అక్షర్ పటేల్ ఒక వికెట్?తోపాటు ఓ క్యాచ్ పట్టి రెండు రనౌట్‌లు చేశాడు. ఇమామ్ ఉల్ హక్ (10) షార్ట్ కవర్స్ వైపు బంతిని ఆడి కొంచెం నెమ్మదిగా కదిలాడు. అక్షర్ చురుగ్గా కదిలి వికెట్ల పైకి డైరెక్ట్ త్రో విసరడం వల్ల ఇమామ్ పెవిలియన్ చేరాడు. తర్వాత రిజ్వాన్ (46)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. కాసేపటికే హార్దిక్ బౌలింగ్ బౌలింగ్?లో సౌద్ షకీల్ (62) ఇచ్చిన క్యాచ్‌ను అందుకున్నాడు. హారిస్ రవూఫ్ (8) రనౌట్‌లోనూ అక్షర్ కీలకంగా వ్యవహరించాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే, టీమ్‌ఇండియా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. విరాట్ కోహ్లీ (100లి) సెంచరీతో అదరగొట్టగా, శ్రేయస్ అయ్యర్ (56) హాఫ్ సెంచరీ, శుభ్?మన్ గిల్ (46) రాణించారు. తాజా విజయంతో టీమ్‌ఇండియా సెమీఫైనల్ బెర్తు దాదాపు ఖరారైనట్లే! అటు వరుసగా రెండో ఓటమితో పాకిస్థాన్? టోర్నీ నుంచి దాదాపు నిష్క్రమించింది.

# విశ్వజి



# పరగడుపున ఈ నీళ్ళను తాగితే... షుగర్‌తో పాటు వంద రోగాలకు స్వస్తి!





ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. ఆరోగ్యంగా ఉండాలి అనుకునేవారు ప్రతిరోజు మనకు ఆరోగ్యాన్ని ఇచ్చే దినుసులను గురించి తెలుసుకొని వాటిని ఉపయోగించాలి. అలా మనకు ఆరోగ్యాన్ని ఇచ్చే వాటిలో మెంతులు ఒకటి. మెంతులను రాత్రి నీళ్లలో నానబెట్టి తెల్లవారుజామున తాగితే అనేక అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. మెంతులు మీ డయాబెటిస్ ను కంట్రోల్ చేస్తుంది. బరువు పెరగకుండా నిరోధిస్తుంది. మీ ఆకలిని అదుపులో ఉంచుతుంది. మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తుంది. మెంతి గింజల నీటితో ఆరోగ్యం ప్రతిరోజు ఒకటి నుంచి రెండు టీ స్పూన్ల మెంతి గింజలను రాత్రిపూట నానబెట్టి పరగడుపున తాగితే మీ జీవక్రియ వేగవంతం కావడమే కాకుండా రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రించేలా చేస్తుంది. ప్రతిరోజు ఉదయం పరగడుపున మెంతి గింజల నీళ్లను తాగితే జీర్ణ క్రియ మెరుగుపడుతుంది. ఫైబర్ జీర్ణవ్యవస్థలోని ఆహార కదలికలను ప్రోత్సహించడంతో పాటు మలబద్ధకాన్ని నివారిస్తాయి. బరువును తగ్గించే మెంతి గింజల నీళ్ళు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడమే కాకుండా డయాబెటిస్ ను కంట్రోల్ లో ఉంచుతుంది. మెంతి గింజల నీరు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది .మెంతి గింజలలో ఉండే ఫైబర్ చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడానికి, గుండె జబ్బులను నివారించడానికి ఉపయోగపడుతుంది. మెంతి గింజల నీళ్లు మన బరువును తగ్గించడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. ఇది మనకు కడుపు నిండిన భావనను కలిగించి అధిక ఆహారం తీసుకోకుండా చేస్తుంది. మెంతి గింజల నీళ్లతో రోగ నిరోధక శక్తి మెంతి గింజల నీళ్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మెంతి గింజలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మన చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు మొటిమలు లేదా మచ్చలను తగ్గించడంలో సహాయ పడతాయి. మెంతి గింజల నీళ్లు రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు, శరీరం ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యాన్ని పెంచుతాయి. ఇది నొప్పులను, వాపులను తగ్గిస్తుంది. ఆర్థరైటిస్ వంటి లక్షణాలను తగ్గించడానికి కూడా మెంతి గింజల నీళ్లు ఉపయోగపడతాయి. మెంతి గింజల నీళ్ళతో జుట్టుకు ఆరోగ్యం మెంతి గింజలు నీళ్లు గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. మహిళలలో రుతు సమస్యలను తగ్గిస్తాయి. జుట్టు పెరుగుదలకు మెంతి గింజల నీళ్లు ఉపయోగపడతాయి. మెంతి గింజలు ప్రోటీన్, నికోటినిక్ ఆమ్లానికి మంచి మూలం. ఇవి జుట్టు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మెంతి గింజల నీళ్లు తాగడం వల్ల ఇది జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తుంది. జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.







## ఎండకాలం.. కేశాలకు గడ్డుకాలం!

వేసవి వేడి వాతావరణం.. కేశాలకు తీవ్రమైన హాని కలిగిస్తుంది. వేడివల్ల తలపై తేమ తగ్గుతుంది. ఫలితంగా, రక్త ప్రసరణ నెమ్మదించి.. జుట్టు పొడిబారుతుంది. వీటితోపాటు మనకు తెలియకుండానే చేసే మరికొన్ని పనుల వల్ల.. ఎండకాలంలో జుట్టు రాలిపోతుంటుంది. ఈ క్రమంలో వేసవిలో జుట్టుకు హానిచేసే పనులేంటో వివరిస్తున్నారు సౌందర్య నిపుణులు. ఎండకాలంలో కొందరు ప్రతిరోజూ తలస్నానం చేస్తుంటారు. దీనివల్ల ఉక్కపోత నుంచి ఉపశమనం లభించినా.. జుట్టు ఆరోగ్యం మాత్రం దెబ్బతింటుంది. రోజూ తలస్నానం చేస్తే.. వెంట్రుకలు నిర్జీవంగా మారుతాయి. క్రమంగా రాలిపోతాయి. తలస్నానం తర్వాత జుట్టు త్వరగా ఆరాలని బ్లో డ్రయర్స్ వాడుతుంటారు. ఇవి జుట్టుకు ఏమాత్రం మంచిదికాదు. ఇక కర్లర్స్, స్ట్రయిటనర్స్ వంటివి వాడటం కూడా జుట్టు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. వీటిలోంచి వెలువడే వేడి.. వెంట్రుకలకు హాని కలిగిస్తుంది. కాబట్టి, జుట్టును మెత్తని టవల్‌తో తుడుచుకుంటూ.. ఉదయపు ఎండలో ఆరబెట్టుకోవడమే మంచిది. ఎక్కువ వేడి జుట్టును బలహీనంగా మారుస్తుందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పరిశోధలోనూ తేలింది. కాలం ఏదైనా.. వెంట్రుకలకు ఎంత తరచుగా నూనె పెడితే అంత మంచిది. ఎందుకంటే, జుట్టులో తేమశాతం ఎక్కువ సమయంపాటు నిలిపి ఉంచడంలో నూనె సమర్థంగా పనిచేస్తుంది. అందుకే, తలస్నానానికి అరగంట ముందు గోరువెచ్చని నూనెతో జుట్టుకు బాగా మసాజ్ చేయాలి. దాంతో.. జుట్టు కుదుళ్లు బలంగా మారుతాయి. వెంట్రుకలను ఎప్పుడూ ముడివేసి ఉంచడం వల్ల చిక్కులు పడి తెగిపోతాయి. అలాగే, ఈకాలంలో మామూలు దువ్వెన వాడినా.. జుట్టు రాలిపోతుంది. పళ్ల దూరంగా, వెడల్పుగా ఉన్న దువ్వెనలు వాడటం మంచిది.



## అతి నిద్రతో అనర్థాలు...అనేక రోగాలు...జాగ్రత్త!

చాలామంది నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారు. ఇంకొంతమంది అతినిద్ర సమస్యతో బాధపడుతున్నారు. నిద్ర తక్కువైనా ఎక్కువైనా రెండు సమస్యలేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. నిద్ర సరిపోకపోతేనే కాదు నిద్ర ఎక్కువైనా కూడా అనారోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. అతినిద్ర ప్రమాదకరమని చెబుతున్నారు. అతి నిద్ర... డేంజర్ అతిగా నిద్ర పోవడం కూడా నిద్రకు సంబంధించిన రుగ్మతలలో ఒకటి. దీనిని హైపెర్సోమ్నియా అని అంటారు. నిద్రపోక పోవటాన్ని ఇన్సోమ్నియా అంటారు. ఇక ఈ రెండూ డేంజర్ అంటున్నారు. కావలసిన దానికంటే ఎక్కువ నిద్రపోతే మన శరీరంలోని జీవక్రియలో తేడాలు వస్తాయి. దీంతో ఒత్తిడి ఆందోళన పెరుగుతాయి. కనుక ఎక్కువ సేపు నిద్రపోవడం అంత మంచిది కాదు. అతిగా నిద్ర పోతే అనారోగ్య సమస్యలు ఎక్కువ సేపు నిద్రపోవడం వల్ల రోజంతా అలసిపోయినట్టు భావన కలుగుతుంది. శరీరం యాక్టివ్ గా అనిపించదు. శరీరం మెటబాలిజం దెబ్బతింటుంది. ఇది బరువు పెరగడానికి ప్రధాన కారణం అవుతుంది. ఇక నిద్ర ఎక్కువ అయితే మెదడు పనితీరు కూడా మందగిస్తుంది. జ్ఞాపకశక్తి సమస్యలు కూడా వస్తాయి. కనుక కావాల్సిన దాని కంటే ఎక్కువ నిద్రపోవడం ఏమాత్రం మంచిది కాదు. అతి నిద్రతో ఆయుష్షు తగ్గుతుంది తరచూ ఎక్కువ సేపు నిద్రపోతే ఆయుష్షు కూడా తగ్గుతుందని అనేక అధ్యయనాలలో తేలింది. ఇక ఎటువంటి శారీరక శ్రమ లేకుండా అధిక సమయం నిద్రించడం కారణంగా నడుము నొప్పి వేధిస్తుంది. అధిక నిద్రతో గుండెకు కూడా ముప్పు వాటిల్లుతుంది. హృదయ సంబంధిత సమస్యలు ఎక్కువగా వస్తాయి. ఎక్కువ సమయం నిద్రపోవడం వల్ల థైరాయిడ్ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.. ఎక్కువ సమయం నిద్రపోవడం వల్ల మధుమేహం వచ్చే అవకాశం కూడా ఉంది. తక్కువ నిద్రపోవడం ఎంత డేంజర్ నో అతిగా నిద్రపోవడం కూడా అంతే డేంజర్ అని చెబుతున్నారు వైద్య నిపుణులు. దీర్ఘకాలిక వైద్య పరిస్థితులు, మానసిక ఆరోగ్య సమస్యలు, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ధూమపానం, మద్యపానం, శారీరక వ్యాయామం లేకపోవడం కొన్ని రకాల మందులను వాడడం, నిద్రలేమి, గుండె జబ్బులు, మధుమేహం వంటి కారణాలు కూడా అతినిద్రకు ప్రధాన కారణాలు.

# మార్కెట్

## భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

### 857 పాయింట్లు పతనమైన సెన్సెక్స్




దేశీయ స్టాక్ మార్కెట్ల పతనం కొనసాగుతున్నది. వరుసగా ఐదోరోజు సోమవారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రతికూల పవనాలు, ట్రంప్ హెచ్చరికతో మార్కెట్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఫిబ్రవరిలో యూఎస్ వినియోగదారుల సెంటిమెంట్ 15 నెలల కనిష్ఠానికి పడిపోయింది. డొనాల్డ్ ట్రంప్ సుంకాల ప్రణాళికలపై ఆందోళనల మధ్య ద్రవ్యోల్బణ భయాలు పెరిగాయి. ఈ ప్రభావం భారత్‌పై సైతం పడుతున్నది. గత సెషన్‌తో పోలిస్తే సోమవారం సెన్సెక్స్ 74,893.45 పాయింట్ల నష్టాల్లో మొదలయ్యాయి. మళ్లీ ఏ దశలోనూ కోలుకోలేదు. ఒక దశలో 74,387.44 పాయింట్ల కనిష్ఠానికి పతనమైన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 74,907.04 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 856.66 పాయింట్ల నష్టంతో.. 74,454.41 వద్ద ముగిశాయి. నిఫ్టీ 243.40 పాయింట్లు పతనమై.. 22,552.50 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1126 షేర్లు లాభపడ్డాయి. 2,526 షేర్లు పతనమయ్యాయి. విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టాటా స్టీల్ భారీగా నష్టపోయాయి. ఎంఅండ్ఎం, ఐషర్ మోటార్స్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, హీరో మోటోకార్ప్, కోటక్ మహీంద్రా బ్యాంక్ లాభపడ్డాయి. ఆటో, ఫార్మా, ఎఫ్ఎంసీజీ మినహా, అన్ని ఇతర రంగాల సూచీలు ఐటీ, మెటల్, టెలికాం సూచీలు 2 శాతం క్షీణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతం వరకు తగ్గాయి.

# ఆర్థిక వ్యవస్థకు కొత్త సవాళ్లు

**పెరుగుతున్న అన్‌సెక్యూర్డ్ రుణాలు, ఊహాజనిత ట్రేడింగ్‌పై ఆర్బీఐ డీజీ ఆందోళన**

ముంబై, ఫిబ్రవరి 21 : వ్యక్తిగత, క్రెడిట్ కార్డ్, విద్యార్థి తదితర తాకట్టులేని రుణాలు పెరుగుతుండటం, క్యాపిటల్ మార్కెట్లలో ఉత్సాహంగా నడుస్తున్న ఊహాజనిత డెరివేటివ్స్ ట్రేడింగ్‌లు ఆర్థిక వ్యవస్థకు కొత్త సవాళ్లను తెచ్చిపెడుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వర్ రావు ఒకింత ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ ఎకానమీతో అవకాశాలూ.. ఇబ్బందులూ రెండూ ఉన్నాయన్నారు. శుక్రవారం ఇక్కడ సూక్ష్మ ఆర్థిక, బ్యాంకింగ్, ఫైనాన్స్ అంశాలపై ఇండియన్




ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) కోజీకోడ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వల్పకాలిక లాభాలపై ఉత్సుకత.. వ్యక్తుల్లో దీర్ఘకాలిక ఆర్థిక భద్రతను కనుమరుగయ్యేలా చేస్తున్నదన్నారు. అందుకే ఆర్థిక సంస్థలు రుణాల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉండకూడదని, కస్టమర్లకూ ఆర్థికపరమైన విషయాల్లో ఉన్న రిస్కులను తెలియజేసి.. వారిలో అవగాహనను పెంచాలని సూచించారు. మోసాల నుంచి వినియోగదారులను రక్షించడంలో ఆర్థిక అక్షరాస్యతే కీలకమన్నారు.

## బేరిష్ ట్రెండ్‌లోనే ట్రేడింగ్!

దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లోనే నడుస్తున్నాయి. నిజానికి జనవరి నుంచి సూచీలు తీవ్ర ఆటుపోట్లకే లోనవుతున్నాయి. స్థిరత్వం లోపించిందనే చెప్పాలి. అమ్మకాలు, కొనుగోళ్ల మధ్య ఇన్వెస్టర్లు ఊగిసలాటకు గురవుతున్నారు మరి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 628.15 పాయింట్లు లేదా 0.82 శాతం పతనమై 75,311. 06 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 133.35 పాయింట్లు లేదా 0.58 శాతం క్షీణించి 22,795.90 దగ్గర నిలిచింది. ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రకటించిన కేంద్ర బడ్జెట్, ఆ తర్వాత వచ్చిన ద్రవ్యసమీక్షలో అంచనాలు అందుకోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీరేట్ల కోతలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేస్తున్న సుంకాలు.. మదుపరులను పెట్టుబడులకు దూరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వారం కూడా ట్రేడింగ్‌లో ఒడుదొడుకులకు ఆస్కారముందని మెజారిటీ నిపుణుల అంచనా. ఇక డాలర్‌తో పోల్చితే ఆల్‌టైమ్ కనిష్ఠాల వద్ద కదలాడుతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తూనే ఉన్నది. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమేనని చెప్పవచ్చు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,100 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,000–23,200 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు. గమనిక.. స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడుదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.



# సంక్షేమం, అభివృద్ధి జోడెడ్లుగా పయనం

**ఐటి నుంచి ఎఐ రివల్యూషన్ దిశగా అడుగులు**

**రూ. 6.5 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం**

**గత ఐదేళ్ల పాలనలో అన్నీ అధ్వాన్న పరిస్థితులు**

**రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ప్రయత్నాలు ముమ్మరం చేశాం**

**బడ్జెట్ సమావేశాల్లో ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం**

**మధ్యలోనే సభనుంచి నిష్కమ్రించిన జగన్,వైకాపా సభ్యులు**




అమరావతి : సంక్షేమం, అభివృద్ధి సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని ఎపి గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉభయసభలను ఉద్దేశించి అన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర కల సాకారం దిశగా అడుగులు వేస్తున్నట్టు చెప్పారు. 'పెన్షన్లు రూ. 4 వేలకు పెంచాం. ఏడాదికి రూ. 3 సిలిండర్లు ఫ్రీగా ఇస్తున్నాం. పోలవరంను పట్టాలెక్కించాం. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగింది. ఐటీ నుంచి ఏఐ రివల్యూషన్ దిశగా అడుగులు వేస్తున్నాం. ప్రజలు కోరిక మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. గత ఐదేళ్లలో రాష్ట్రం అనేక ఇబ్బందులకు గురైంది. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఎంతో నష్టపోయింది. మా ప్రభుత్వం వచ్చాక తలసరి ఆదాయం పెరిగింది. రూ. 6.5 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్నాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం' అని గవర్నర్ తెలిపారు. సోమవారం ఉదయం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఉభయ సభలనుఉద్దేశించి గవర్నర్ జస్టిస్ నజీర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అన్న క్యాంటీన్లతో పేదల ఆకలి తీరిస్తున్నామని.. విద్య, వైద్య రంగాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించమని గవర్నర్ అన్నారు. 2029 నాటికి ప్రతి పేద కుటుంబానికి ఇల్లు సమకూరేలా చూస్తామన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ప్రోత్సాహిస్తున్నాం. పీఎం సూర్య ఘర్ యోజన కింద.. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరోవైపు ఏపీ అసెంబ్లీ సమావేశాలు హాట్‌హాట్‌గానే ప్రారంభ మయ్యాయి. గవర్నర్ ప్రసంగంపై నిరసనలకు దిగారు వైసీపీ సభ్యులు. తమకు అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ వైసీపీ డిమాండ్ చేసింది. వైసీపీ అధినేత జగన్ సహా అందరూ గవర్నర్ ప్రసంగానికి నిరసన తెలిపారు. కొద్దిసేపు నినాదాలు చేసిన అనంతరం సభ్యులంతా వాకౌట్ చేశారు. ఎన్నికల్లో ప్రజలు మా ప్రభుత్వానికి తిరుగులేని మెజారిటీ ఇచ్చారు. ప్రజల కోరిక మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. గత ఐదేళ్లలో రాష్ట్రం అనేక ఇబ్బందులకు గురైంది. గత ప్రభుత్వ పాలనతో రాష్ట్రం ఎంతో నష్టపోయింది. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్నాం. అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. మెగా డీఎస్సీ దస్త్రంపై సంతకం చేశాం. అన్న క్యాంటీన్‌లు తెచ్చి పేదవాళ్ల ఆకలి తీరుస్తున్నాం.కూటమి వచ్చాక రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం. మా ప్రభుత్వం వచ్చాక తలసరి ఆదాయం పెరిగింది. అవకాశాలిస్తే ప్రతి ఒక్కరూ మెరుగైన సేవలు అందిస్తారని నమ్ముతున్నాం. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికి వెళ్లి పింఛన్లు అందిస్తున్నాం. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నాం. విద్య, వైద్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాం. 2047 నాటికి స్వర్ణాంధ్ర కలను సాకారం చేస్తాం. బీసీ వర్గాలు సమాజానికి వెన్నెముక. వారికోసం ప్రత్యేక కార్యక్రమాలు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టాం. అర్హులైన అందరికీ సొంతిల్లు ఉండాలనేదే మా ఆకాంక్ష అని తెలిపారు. గవర్నర్ ప్రసంగిస్తూ కందుకూరి వ్యాఖ్యలను ప్రస్తావించారు. ప్రతి వ్యక్తిలో ప్రతిభ ఉంటుంది. అవకాశమిస్తే బయటకు వస్తుంది. సమాజ అభివృద్ధికి సంక్షేమం, అభివృద్ధి కలిసి కట్టుగా వెళ్లాలి. మా ప్రభుత్వం గత ఎనిమిది నెలల్లోనే గణనీయమైన పురోగతి సాధించింది. 22 కొత్త విధానాల ద్వారా సుస్థిర వృద్ధికి బాటలు వేశాం. పోలవరం, అమరావతి మళ్లీ పట్టాలెక్కించాం. విశాఖ ఉక్కు పరిరక్షణ, రైల్వే జోన్ ఏర్పాటు హామీలు నెరవేర్చాం. గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, టాటా పవర్, గ్రీన్ కో గ్రూప్, బీపీసీఎల్, టీసీఎస్ కంపెనీలకు ఆకర్షించాం. ఇన్వెస్టర్లు ఇప్పటి వరకు రూ. 6.5 లక్షల కోట్ల పెట్టబడులు పెట్టారు. ఆయా పెట్టుబడుల ద్వారా 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూ. 16 లక్షల కోట్లకు విస్తరించింది. తలసరి ఆదాయం కూడా రూ. 2.68 లక్షలకు పెరిగింది. రాష్ట్రంలో ఐటీ విప్లవానికి సీఎం శ్రీకారం చుట్టాం. అమెరికాలోని ప్రవాస తెలుగువాళ్ల తలసరి ఆదాయం ఎక్కువ. ప్రస్తుతం ఏపీ మరో విప్లవానికి నాయకత్వం వహిస్తోంది. పరిపాలన, పరిశ్రమలు, ఆర్థిక వృద్ధిలో ఏఐను వినియోగిస్తున్నాం. పీపుల్ ఫస్ట్ విధానంతో స్వర్ణాంధ్ర సాధనకు సమగ్ర రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేశాం. దేశంలోనే తొలిసారిగా మెగా పేరెంట్ – టీచర్ మీటింగ్ నిర్వహించాం. తల్లులకు చేయూత నిస్తూ 'తల్లికి వందనం' అమలు చేయబోతున్నామని గవర్నర్ వెల్లడించారు. సమావేశాలు ప్రారంభమైన 11 నిమిషాలకే ఇక చాల్లే పోదం పదండి అన్నట్లు వైకాపా సభ్యులతో కలిసి జగన్ బయటకు వచ్చేశారు. గవర్నర్ ప్రసంగం సాగుతుండగా సభలో గందరగోళం సృష్టించేందుకు వైసీపీ సభ్యులు యత్నించారు. ప్రతిపక్షంగా గుర్తించాలని ఆ పార్టీ సభ్యులు నినాదాలు చేశారు.

# గవర్నర్ ప్రసంగాన్ని బాయ్‌కాట్ చేసిన వైకాపా

**ప్రతిపక్ష హోదా ఇచ్చేందుకు విముఖం**

**అందుకే సభకు హాజరయ్యేది లేదు**

**పార్టీ నేతలతో వైకాపా అధినే జగన్ స్పష్టీకరణ**

అమరావతి : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన రోజే సమావేశాలను బాయ్ కాట్ చేసింది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. గవర్నర్ ప్రసంగం సమయంలో.. వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ నినాదాలు చేసి.. ఆ తర్వాత పోడియం వద్ద నిరసన వ్యక్తం చేసిన వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. అనంతరం గవర్నర్ ప్రసంగం కొనసాగుతుండగానే బాయ్‌కాట్ చేసి వెళ్లిపోయారు.. ఇక, తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమైన వైఎస్ జగన్.. అసెంబ్లీ సమావేశాలకు హాజరుపై కీలక వ్యాఖ్యలు చేశారు.. వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం లేనందున అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకూడదని వైసీపీ నిర్ణయం తీసుకుంది.. అసెంబ్లీకి వెళ్లినా.. వెళ్లకున్నా.. ప్రజా సమస్యల పై పోరాటం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు..నేనింకా ముప్పై ఏళ్ల పాటు రాజకీయాల్లో వుంటాను అని మరోసారి వ్యాఖ్యానించారు వైఎస్ జగన్.. నాతో పాటు వుండేవాళ్ళు నా వాళ్లు.. 2028 ఫిబ్రవరిలో జమిలి ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఆ ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలి.. పేదలకు వైసీపీ ఇచ్చిన ఇళ్ల స్థలాలు వెనక్కి తీసుకోవడం కుదరదు.. ఎక్కడైనా అలాంటి సంఘటనలు జరిగితే వారికి అండగా ఉండాలని సూచించారు.. గతంలో అసెంబ్లీకి చంద్రబాబు రాని సమయంలో కూడా ఆయన సభలో ఉంటే బాగుండేదని చెప్పా.. వాళ్లేమో సభలో వైసీపీ లేకుండా నడపాలని చూస్తున్నారు.. ఏది ఏమైనా ప్రజా సమస్యలపై ప్రజా క్షేత్రంలో పోరాడాలి అంటూ వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి..పిలుపునిచ్చారు.క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం మీద వ్యతిరేకత తీవ్రంగా ఉంది. మనం యుద్ధ రంగంలో ఉన్నాం, విజయం దిశగా అడుగులు వేయాలి. ప్రజా సమస్యల విషయంలో రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు జగన్.. నిజాయితీగా, చిత్తశుద్ధితో ప్రజల తరఫున పోరాటం చేయాలి. ప్రజలకు తోడుగా, ప్రజల్లో ఉంటే గెలుపు సాధించినట్టే. అందుకనే ప్రజాసమస్యలపై పోరాటంలో వెనుకడుగు వేయొద్దు అన్నారు.. ఈ ప్రభుత్వాన్ని చూసి భయపడాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరికీ నేను భరోసా ఇస్తున్నాను, అండగా ఉంటాను. ప్రతిపక్షంలో మన సమర్థతను నిరూపించుకోవడానికి ఇదొక అవకాశం.. పార్టీకోసం, ప్రజలకోసం గట్టిగా పనిచేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. కళ్లుమూసుకుని, తెరిచేలోగా ఏడాది గడిచిపోతోంది. జమిలి ఎన్నికలు అంటున్నారు. అదే జరిగితే ఎన్నికలు మరింత ముందుగా వస్తాయి. అందుకే ప్రజా సమస్యల విషయంలో ఎక్కడా రాజీ వద్దు.. ప్రజల తరఫున గొంతు విప్పే విషయంలో ఎక్కడా తగ్గాల్సిన అవసరం లేదు. రాజకీయాల్లో మనం విలువలు, విశ్వసనీయత పాటిస్తున్నాం. ఎన్నో క్లిష్టపరిస్థితులను అధిగమించాం. ఇంత దూరం ప్రయాణం చేశాం. అసెంబ్లీలో మనం తప్ప వేరే ప్రతిపక్షం లేదన్నారు. అయితే, ప్రతిపక్ష హోదా విషయంలో అధికార పార్టీ వైఖరిని ప్రజలకు తేటతెల్లం చేసేందుకే ఇవాళ అసెంబ్లీకి వెళ్లాం. ప్రతిపక్షహోదా ఇస్తే.. హక్కుగా మనకు సమయం ఇవ్వాల్సి వస్తుంది. సభా నాయకుడికి దాదాపు సమాన స్థాయిలో సమయం ఇవ్వాల్సి ఉంటుంది. అందుకనే ప్రతిపక్ష హోదాను ఇచ్చేందుకు ముందుకు రావడంలేదని విమర్శించారు వైఎస్ జగన్.. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. నేను ఏ అంశంపై మాట్లాడినా నిందలకు, దూషణలకు దూరం. ప్రతి అంశాన్నీ ఆధారాలు, రుజువులతో మాట్లాడతాను. అసెంబ్లీలో ఎలాగూ అవకాశం లేదు కాబట్టి, ప్రెస్‌మీట్లలో ప్రజలకు వివరిస్తున్నాను. కాని కౌన్సిల్‌లో మనకు మంచి మెజార్టీ ఉంది. దీన్ని వినియోగించుకోవాలన్నారు.. మన హయాంలో 31 లక్షలమందికి ఇళ్లపట్టాలు ఇచ్చాం. పార్టీలు చూడకుండా, పక్షపాతం లేకుండా ఇళ్లపట్టాలు ఇచ్చాం. ఎవరైనా ఇళ్లుకట్టుకోకపోతే ప్రభుత్వం వారికి ఇళ్లు మంజూరుచేసి ఇవ్వాలి. పేదలపై కక్ష కట్టి పట్టాలు రద్దుచేయడం ఏంటి. పట్టాలు రద్దు చేస్తే తప్పకుండా కోర్టును ఆశ్రయిస్తాం అని వైఎస్ జగన్ హెచ్చరించారు.

# మార్చి19 వరకు ఎపి అసెంబ్లీ సమావేశాలు

అమరావతి : మార్చి 19వ తేదీ వరకు అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని బీఏసీ నిర్ణయించింది.. మొత్తంగా 15 వర్కింగ్ డేస్ లో సమావేశాలు జరగనున్నాయి.. అవసరం అయితే మరో రెండు రోజులు పొడిగించాలని బీఏసీలో నేతలు అభిప్రాయపడ్డారు.. వారానికి ఐదు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి.. ఏపీ అసెంబ్లీ సమావేశాలు గవర్నర్ ప్రసంగంతో సోమవారం ప్రారంభం అయ్యాయి.. అనంతరం సభ మంగళవారానికి వాయిదా పడింది. సభానంతరం బిఎసి సమావేశమై సమావేవ తేదీలపై చర్చించింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన బిఎసి జరిగింది. సిఎం చంద్రబాబు తదితరులు హాజరయ్యారు. సభను వచ్చే నెల 19 వరకు జరపాలని బీఏసీ లో నిర్ణయించారు.. అవసరం అయితే మరో రెండు రోజులు పాటు రిజర్వ్ లో ఉంచారు.

# ప్రారంభమైన ఎపి అసెంబ్లీ సమావేశాలు

**తొలిరోజు ఉభయసభల్లో గవర్నర్ ప్రసంగం**

**మొక్కుబడిగా హాజరై నిష్కమ్రించిన జగన్**

అమరావతి : ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. అయితే జగన్ సహా వైకాపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభకు హాజరయ్యారు. వీరంతా గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగులుతూ.. నినాదాలు చేశారు. ఐదు నిముషాలు నినాదాలు చేసిన అనంతరం వైఎస్ జగన్ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఆయన వెంట వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లిపోయారు. గవర్నర్ ప్రసంగం కొనసాగుతుండగానే వారు నిష్క్రమించారు. గవర్నర్ ప్రసంగానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు అడ్డుతగులుతూ.. నినాదాలు చేశారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. ప్రతిపక్షాన్ని గుర్తించండి' అంటూ నినాదాలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై గవర్నర్ మాట్లాడారు. ప్రజల గొంతు వినాలంటే ప్రతిపక్షం హోదా ఇవాలంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ సభ్యుల నినాదాల మధ్య గవర్నర్ ప్రసంగం కొనసాగించారు. స్పీకర్ పోడియం వద్దకు వచ్చి నినాదాలు చేశారు. జగన్ తన సీట్‌లోనే కూర్చొని చూస్తున్నారు. సేవ్ డెమోక్రసీ అంటూ నినాదాలు చేసారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, జగన్ పక్క పక్కనే కూర్చొని చూస్తున్నారు. కొద్దిసేపు నినాదాలు చేసి సభ నుంచి వైఎస్సార్‌సీపీ ఎంఎల్‌ఏలు వెళ్లిపోయారు. అసెంబ్లీ బయట వైఎస్సార్‌సీపీ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం అంటే ప్రభుత్వానికి చిన్న చూపని, ప్రతిపక్ష హోదా కల్పించాలని మొదటి నుంచి కోరుతున్నామని అన్నారు. ప్రతిపక్షం అంటే ప్రజా పక్షం అని గుర్తుంచుకోవాలన్నారు. రైతుల సమస్యలపై గొంతూ విప్పాలంటే మాకు అసెంబ్లీలో మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు. రైతు సమస్యలపై పోరాడుతుంటే కేసులు పెడుతున్నారని బొత్స సత్యనారాయణ అన్నారు. రాష్ట్రంలో ఉన్నవి రెండే పక్షాలు ఉన్నపుడు.. వైసీపీని ప్రతిపక్షంగా గుర్తించాలని బొత్స సత్యనారనాయణ అన్నారు. ప్రజల సమస్యలపై గొంతెత్తాలంటే ప్రతిపక్ష హోదా ఉండాలన్నారు. గవర్నర్ ప్రభుత్వానికే కాదు.. ప్రతిపక్షానికి కూడా అండగా నిలబడాలని వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. అధికార పక్షానికి 11మందిని ఎదుర్కొనే సత్తా లేదా అని ప్రశ్నించారు.

# ఓటమి భయంతోనే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిపై దుష్ప్రచారం

**అధికారపక్షంపై ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి విమర్శలు**

తెనాలి : ఓటమి భయంతోనే పాలక పక్షం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిపై అసత్య ప్రచారం, ఆరోపణలు చేస్తున్నారని, దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి సవాల్ విసిరారు. ఈనెల 27న జరగనున్న కృష్ణ గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉపాధ్యాయ, ఉద్యోగ, నిరుద్యోగ, కార్మిక, ఎన్జీవో సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం తెనాలిలో ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఎమ్మెల్సీగా లక్ష్మణరావు విజయం నిరుద్యోగులు, ఉద్యోగులు, పట్టభద్రులు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బంది విజయంగా చెప్పారు. ఆయా వర్గాల సమస్యలపై శాసనమండలిలో లక్ష్మణరావు అలుపెరుగని పోరాటం చేశారన్నారు. శాసనమండలి రికార్డులను పరిశీలిస్తే లక్ష్మణరావు పోరాట పటిమ అర్థమవుతుందన్నారు. అలాంటి వ్యక్తిపై మరొకరి కాళ్లు పట్టుకున్నారంటూ అసత్య ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. పూర్తిస్థాయి ఆధారాలుంటే ఇప్పటికైనా నిరూపించాలని కోరారు. సొంత ప్రయోజనాల కోసం పాకులాడే వారికే మరొకరి కాళ్లు పట్టుకోవాల్సిన ఆవశ్యకత ఉంటుందన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలను ఆపకుంటే చట్టాన్ని ఆశ్రయిస్తామన్నారు. నామినేషన్ సమయంలో గెలుస్తామని దీమా వ్యక్తం చేసిన పాలకపక్షం అభ్యర్థి ఆ ధైర్యం కోల్పోవడంతోనే అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని పరోక్షంగా విమర్శించారు. కేవలం అసెంబ్లీ ఎన్నికలలో తెనాలి సీటు దక్కలేదన్న కారణంగా ఎమ్మెల్సీ స్థానంలో పోటీ చేసేందుకు ఆ పార్టీ అవకాశం కల్పించిందని, అలాంటి వ్యక్తులను గెలిపిస్తే సమస్యలపై పోరాడే సత్తా ఉండదని ఓటర్లు గమనించాలన్నారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలలో మంచి ప్రభుత్వం కోసం ప్రజలు ఓటు వేశారని, అయితే వారి ఆశలను ఆవిరి చేసే ప్రభుత్వముగా ప్రస్తుత ప్రభుత్వం ఉందన్నారు. అందుకు తాజా ఉదాహరణ గ్రూప్ 2 పరీక్షకు హాజరయ్యే 92 వేలమంది అభ్యర్థులు సాంకేతిక సమస్యలపై రో÷–డడెక్కినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. విజ్ఞులైన పట్టభద్రులు వివేకంతో ఆలోచించి మొదటి ప్రాధాన్యత ఓటును లక్ష్మణరావుకు వేసి గెలిపించాలని ఆమె కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములక శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ లక్ష్మణరావుకు ఏపీ రైతు సంఘం పూర్తి మద్దతు ప్రకటించిందన్నారు. దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ లో జరిగిన అగ్నిప్రమాదంలో రూ 100 కోట్ల విలువైన పసుపు నష్టంలో రైతాంగానికి లక్ష్మణరావు అండగా నిలిచారని, రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో చొరవ చూపారన్నారు. గుంటూరు ఛానల్ పొడిగించి 60 గ్రామాలకు తాగు, సాగునీరు అందించే విషయంలో ఆయన చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యలే కాకుండా కార్మిక, రైతాంగ సమస్యలపై కూడా పోరాడే లక్ష్మణరావు గెలుపు కు ప్రతి ఒక్కరు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు షేక్ హుస్సేన్ వలి, న్యాయవాది స్టాలిన్ పాల్గొన్నారు.

# వంటనూనెల వినియోగం తగ్గించండి

న్యూఢిల్లీ : దేశంలో ఊబకాయ సమస్య పెరిగిపోతుందని.. దీనిపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ అన్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే.. వంట నూనెల వినియోగాన్ని తగ్గించాలని ఆయన సూచించారు. ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి పది మంది ప్రముఖులను నామినేట్ చేశారు. వారిలో ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్, గాయకురాలు శ్రేయోఘోషల్ కూడా ఉన్నారు. ఆదివారం జరిగిన మన్‌కీబాత్ 119వ ఎపిసోడ్ కార్యక్రమంలో మోదీ ఊబకాయ సమస్య గురించి ప్రస్తావించారు. 'గత కొన్నేళ్లుగా దేశంలో ఊబకాయ సమస్య పెరిగిపోతుంది. ముఖ్యంగా చిన్నారుల్లో ఈ సమస్య పెరిగిపోతోంది. ఈ సమస్యను అధిగమించాలంటే తినే ఆహారంలో చిన్న చిన్న మార్పులు చేసుకోవాలని ఆయన సూచించారు. గత కొన్నేళ్లుగా ఊబకాయం కేసులు రెట్టింపయ్యాయి. ఈ గణాంకాలు ఆందోళన కలిగిస్తోంది. ప్రతి ఎనిమిది మందిలో ఒక్కరైనా ఊబకాయ సమస్యతో బాధపడుతున్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే ప్రతినెలా పదిశాతం వంట నూనె వినియోగాన్ని తగ్గించాలి. ఈ చిన్న మార్పు ప్రజారోగ్యంపై పెద్ద ప్రభావం చూపుతుంది. మీ ఆహారపు అలవాట్లు మిమ్మల్ని ఫిట్‌గా ఉంచుతాయి. ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు.. ఆరోగ్యవంతమైన దేశాన్ని నిర్మించేందుకు క్యాంపెయిన్ నిర్వహించాలి' అని ఆయన అన్నారు. ఃగా, ఈ క్యాంపెయిన్‌కు ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా, జమ్ము కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా, యువ షూటర్ మను బాకర్, వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, ప్రముఖ నటులు దినేశ్‌లాల్ యాదవ్, ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్, మాధవన్, గాయకురాలు శ్రేయా ఘోషల్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, రాజ్యసభ ఎంపి సుధామూర్తి అను ప్రధాని మోదీ నామినేట్ చేశారు. ఈ మేరకు వీరి పేర్లను మోదీ ఎక్స్ పోస్టులో వెల్లడించారు.

# దంపతులపై దాడి... బంగారం చోరీ

కరీంనగర్ : కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో భారీ చోరీ జరిగింది. ఓ ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు దంపతులపై దాడి చేసి.. దాదాపు 70 తులాల బంగారం, రూ.8 లక్షల నగదు దోచుకెళ్లారు. ఈ ఘటన ప్రతాపవాడలో చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతాప రాఘవరెడ్డి ఇంట్లోకి ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించారు. ఇంట్లోని దంపతులపై కత్తితో దాడి చేసి సొమ్ముతో పరారయ్యారు. ఈ దాడిలో మహిళ గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

# శ్రీలంక అదుపులో 700పైగా బోట్లు

**రామేశ్వరంలో మత్స్యకారుల ఆందోళన**

చెన్నై : తమిళనాడులోని రామేశ్వరంలో మత్స్యకారులు సోమవారం నుండి నిరవధిక సమ్మెకు దిగారు. శ్రీలంక నేవీ నిర్బంధంలో ఉన్న మత్స్యకారులను, పడవలను వంటనే విడుదల చేయాలని మత్స్యకారుల సంఘం డిమాండ్ చేస్తోంది. 700కిపైగా బోట్‌లను హార్బర్‌లో నిలిపివేయడంతో రామేశ్వరంలోని ఫిషింగ్ హార్బర్ నిర్మానుష్యంగా మారింది. శ్రీలంక నేవీ నిర్బంధించిన బందీలను వెంటనే విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానం చేసినట్లు రామేశ్వరం మత్స్యకారుల సంఘం కార్యదర్శి సగాయం పేర్కొన్నారు. మత్స్యకారుల బోట్లను వేలం వేయకుండా చూడాలని కోరారు. త శనివారం రామేశ్వరం నుండి 440 బోట్లలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లారు. పాల్క్‌బే సముద్ర ప్రాంతంలో చేపల వేట సాగిస్తుండగా, శ్రీలంక నేవీ అధికారులు పెట్రోలింగ్ బోట్‌లో అక్కడికి చేరుకున్నారు. అంతర్జాతీయ సముద్ర సరిహద్దును దాటారంటూ 5 పడవలను, 32 మంది మత్స్యకారులను అదుపులోకి తీసుకున్నారు. భారతీయ మత్స్యకారులను శ్రీలంకనేవీ అదుపులోకి తీసుకుంటున్న ఘటనలు పెరగడంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం సంయుక్త కార్యవర్గాన్ని (జెడబ్ల్యుజి) సమావేశపరచాలని విదేశాంగమంత్రి జై శంకరకు రాసిన లేఖలో పేర్కొన్నారు. గత జనవరి నుండి 131 మంది తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నేవీ అదుపులోకి తీసుకుంది. 18 బోట్లను స్వాధీనం చేసుకుంది.

# ప్రతిపక్షహోదా అడిగితే వచ్చేది కాదు

**ప్రజలు ఇస్తేనే అది వస్తుంది**

**జగన్ తీరుపై మండిపడ్డ పవన్ కళ్యాణ్**

అమరావతి : ఆరోగ్యం బాగాపోయినా గవర్నర్ సభకు వచ్చి ప్రసంగిస్తే వైసీపీ అడ్డుకోవాలనుకోవటం హేయమని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. ప్రతిపక్ష హోదా అడిగితే వచ్చేది కాదు ప్రజలు ఇస్తేనే వస్తుందన్నారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో వైసీపీ నేతలు నినాదాలు చేస్తూ.. కాసేపటికి సభ నుంచి వాకౌట్ చేశారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందిస్తూ.. సభలో వైసీపీ వ్యవహారశైలిపై మండిపడ్డారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద పవన్ మాట్లాడుతూ.. శాసనసభలో గవర్నర్ ప్రసంగం సమయంలో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరు సరైంది కాదన్నారు. గవర్నర్‌కు ఆరోగ్యం సరిగా లేకపోయినా ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్యక్రమాల గురించి చెప్పారని తెలిపారు. ఇప్పుడు అసెంబ్లీలో రెండో అతిపెద్ద పార్టీ జనసేన అని చెప్పుకొచ్చారు. జనసేన కంటే ఒక్క సీటు ఎక్కువ వచ్చినా ప్రతిపక్ష హోదా వైసీపీకి వచ్చేదన్నారు. సభలో రెండో అతిపెద్ద పార్టీ జనసేన అని వైసీపీ గుర్తించాలన్నారు. 11 సీట్లు మాత్రమే ఉన్న వైసీపీకి ప్రతిపక్ష హోదా వస్తుందని ఎలా ఊహిస్తున్నారని ప్రశ్నించారు. ఈ ఐదేళ్లలో వైసీపీకి ప్రతిపక్ష హోదా రాదు అని.. అది నిశ్చయం అయిపోయిందని స్పష్టం చేశారు. ఈ 5ఏళ్ళు ప్రతిపక్ష హోదా తమకు రాదని వైసీపీ మానసికంగా ఫిక్స్ అయితే మంచిదని హితవుపలికారు. హోదా అనేది సీఎం , స్పీకర్ ఇచ్చేది కాదన్నారు. వైసీపీ హుందాగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. వైసీపీ నేతలు సభకు వస్తే, ఆ పార్టీకి ఉన్న బలం బట్టి ఎంత సమయం కేటాయించాలో కేటాయిస్తారని తెలిపారు. డిప్యూటీ సీఎంగా నేనేమీ బ్రేక్ చేయడం లేదు. ఉదయం గవర్నర్‌ను ఆహ్వానించే సమయంలో నన్ను పిలిచినా ప్రోటోకాల్ కాదని నేను సున్నితంగా తిరస్కరించా. ఓట్లు శాతం గురించి మాట్లాడే వైసీపీ నాయకులు జర్మనీకి వెళ్లిపోవచ్చు. మన దేశ నిబంధనల మేరకు వారికి ప్రతిపక్ష హోదా సాధ్యం కాదని స్పష్టం చేశారు. సనాతన ధర్మం కోసం తమిళనాడు ప్రభుత్వం కూడా పోరాడుతోందన్నారు. వక్ఫ్ బోర్డు ఉన్నప్పుడు సనాతన ధర్మం బోర్డు ఉంటే తప్పా అని ప్రశ్నించారు. సనాతన ధర్మంపై మార్చి 14 న మాట్లాడతానని తెలిపారు. రాష్ట్రంలో మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఎంతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. తన యూపీ పర్యటనపై వస్తున్న ఆరోపణలపై అంతగా స్పందించాల్సిన అవసరం లేదన్నారు. 'వెనక ఉండి మాట్లాడటం కాదు నేరుగా ముందుకు వచ్చి మాట్లాడాలి. నేనేంటో చూపిస్తా . రాజకీయాల్లోకి వచ్చినప్పుడే అన్నిటికీ సిద్ధపడి రావాలని పవన్ పేర్కొన్నారు.



# రాజాసాబ్‌లో నా పాత్ర ఎంతో స్పెషల్

## ప్రభాష్‌కు నేను పెద్ద ఫ్యాన్ : మాళవిక మోహనన్

కొత్త పరిశ్రమ, కొత్త భాష అనగానే కాస్త కంగారు పడ్డా. అయితే.. నిదానంగా అలవాటు పడ్డా. కొత్త నగరంలో కొత్త సంస్కృతిని ఆకళింపు చేసుకున్నా. ముఖ్యంగా తెలుగు భాషపై ఇష్టం, ఆసక్తి రెండూ పెరిగాయి. ఆ పదాలు పలికే విధానం, శబ్దం నాకు నచ్చాయి.' అంటున్నది కేరళ కుట్టి మాళవిక మోహనన్. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్ 'ది రాజాసాబ్' గురించి ఆమె మాట్లాడింది. అందులో తన పాత్ర గురించీ, అనుభవాల గురించి ఆసక్తికరంగా వెల్లడించింది. "ది రాజాసాబ్' హారర్ కామెడీ మూవీ. ఇప్పటివరకూ నేను చేయని జోనర్. చాలా సినిమాల్లో హీరో పాత్ర ఎదిగే కొద్దీ స్త్రీ పాత్ర తగ్గిపోతూవుంటుంది. కానీ 'ది రాజాసాబ్'లో అలాకాదు. ఇందులో ఆద్యంతం నా పాత్ర బలమైనదే. అద్భుతమైన సన్నివేశాల్లో నటించాను. 'బాహుబలి' నుంచి ప్రభాస్‌కి నేను పెద్ద ఫ్యాన్. ఆయనతో కలిసి పనిచేయాలని కలలు కన్నా. సెట్‌లో ఆయన్ను చూసి ఆశ్చర్యపోయా. అంతపెద్ద స్టార్ చాలా నార్మల్‌గా ఉంటారు. సపోర్టివ్ కూడా. ఆయన ఉన్న ప్రదేశాన్నంతా కంఫర్టబుల్‌గా మార్చేస్తారు. మనతో సరదాగా గడుపుతారు. సెట్‌లో ఉన్న టీమ్ మొత్తానికీ మంచి ఫుడ్‌ని పంపిస్తారు. దగ్గరుండి బిర్యాని తినిపిస్తారు.. కామెడీ టైమింగ్‌తో నవ్విస్తారు. నిజంగా ప్రభాస్ చాలా స్వీట్.' అంటూ తెగ పొగిడేసింది మాళవిక మోహనన్.



# ఒకేసారి రెండు భాషాల్లో తొలి భారతీయ సినిమా

## యశ్‌కు మరో రికార్డు

కేజీఎఫ్ ఫ్రాంఛైజీ తర్వాత కన్నడ స్టార్ హీరో యశ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ టాక్సిక్. పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్‌పై వెంకట్ కే నారాయణ తెరకెక్కిస్తున్నారు. యశ్ 19వ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త అభిమానులు, మూవీ లవర్స్‌ను ఫుల్ ఖుషీ చేస్తోంది. ఈ మూవీని ఒకేసారి రెండు భాషల్లో షూట్ చేయనున్నారు. టాక్సిక్‌ను కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో చిత్రీకరించనున్నారు. భారీ స్థాయిలో ఒకేసారి రెండు భాషల్లో తెరకెక్కుతున్న ఇండియన్ మూవీగా నిలువనుంది టాక్సిక్. యశ్ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ చిత్రాన్ని హిందీ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో డబ్బింగ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. లేడీ సూపర్ స్టార్ నయనతార, బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషి, తారా సుటారియా కీలక పాత్రలు పోషిస్తున్నారు. బ్రదర్-సిస్టర్ కథతో 1970స్ గోవా, కర్ణాటక బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమా సాగనుందని ఇన్‌సైడ్ టాక్. కేజీఎఫ్ ఫ్రాంఛైజీ లాంటి గ్లోబల్ బ్లాక్ బస్టర్ ప్రాజెక్టు తర్వాత యశ్ కాంపౌండ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. ఇప్పటికే మేకర్స్ వింటేజ్ టాక్సీ, రౌండప్ క్యాప్ పెట్టుకున్న యశ్ ప్రీ లుక్ విడుదల చేయగా సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది.



# అవకాశాలు ఒక్కసారే వస్తాయి : తమన్నా

మిల్కీ బ్యూటీ తమన్నా ఒకానొక సమయంలో టాలీవుడ్‌ను ఏలింది. వరుసగా సినిమాలు చేసి మంచి క్రేజ్ తెచ్చుకుంది ఈ అమ్మడు. తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. శ్రీ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ చిన్నది.. హ్యాపీడేస్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా తర్వాత తెలుగులో బిజీగా మారిపోయింది. తమన్నా ప్రస్తుతం తెలుగులో సినిమాలు తగ్గించింది. హిందీ మీద ఎక్కువ ఫోకస్ పెట్టింది ఈ చిన్నది. తెలుగులో చివరిగా చిరంజీవి హీరోగా నటించిన భోళాశంకర్ సినిమాలో చేసింది. ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. ఇదిలా ఉంటే తమన్నా త్వరలోనే పెళ్లి పీటలెక్కనుందని వార్తలు వినిపిస్తున్నాయి. బాలీవుడ్ నటుడు విజయ్ వర్మతో రిలేషన్ లో ఉంది ఈ బ్యూటీ. ఇటీవల స్పెషల్ సాంగ్స్ లోనూ నటిస్తూ ఆకట్టుకుంటుందో. రీసెంట్ గా విడుదలైన 'స్త్రీ 2' చిత్రంలో తమన్నా స్పెషల్ సాంగ్ సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఓ వైపు సినిమాలు ,ఆరో వైపు స్పెషల్ సాంగ్స్ చేస్తూ ఆకట్టుకుంటుంది ఈ అమ్మడు. ప్రస్తుతం తెలుగులో ఓదెల అనే సినిమా చేస్తుంది. తాజాగా తమన్నా చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. జీవితంలో ఒక్కసారే ఇలాంటి సినిమాల్లో నటించే అవకాశం వస్తుంది. కాశీలో ఈ చిత్రం ప్రారంభించిన నాటి నుంచి ఇందులో మ్యాజిక్ ఉందనే భావన కలిగింది. మేము ఏదైతే మ్యాజిక్ ఫీలయ్యామో ఆడియన్స్ కూడా అదే ఫీలవుతారని ఆశిస్తున్నా అని తమన్నా తెలిపింది.

# వారే నా బెస్ట్ హీరోయిన్స్ : సమంత

ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో బెస్ట్ హీరోయిన్ ఎవరో సమంత తెలిపారు. పార్వతీ తిరువోతు (ఉల్లొళుక్కు), సాయి పల్లవి (అమరన్), నజ్రియా (సూక్ష్మదర్శిని), అలియా భట్ (జిగ్రా), అనన్య పాండే (సీటీఆర్ఎల్), దివ్య ప్రభ (ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్). వీరంతా రాక్‌స్టార్స్. ఇంకెవరినైనా మర్చిపోయి ఉంటే మరో వీడియో చేసి చెబుతా అని సరదాగా సంభాషించారు. "నెగెటివ్ ఆలోచనలను అధిగమించడానికి ప్రత్యేకంగా చేసేదేమీ లేదని, రెగ్యులర్‌గా చేసే మెడిటేషన్ తదితర వాటి వల్ల నెగెటివిటీ దూరం అవుతుందనుకుంటున్నా" అని తెలిపారు. ఇటీవల కొన్ని రోజులు ఫోన్‌కు దూరంగా ఉన్నా. మొబైల్ లేకపోవడంతో మరో ప్రపంచంలో ఉన్నట్టు అనిపించింది. దానికి ఎంతగా అడిక్ట్ అయ్యామో అర్థమైంది" అని సమంత అన్నారు. ప్రస్తుతం సమంత 'రక్త్ బ్రహ్మండ్: ది బ్లడీ కింగ్‌డమ్'లో నటిస్తున్నారు. 'తుంబాడ్' ఫేమ్ రాహి అనిల్ బార్వే దర్శకత్వం వహిస్తున్నారు. తన నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌లో 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని గత సంవత్సరం ప్రకటించారు. ఇప్పటిదాకా దానిపై మరో అప్‌డేట్ రాలేదు.





# ఢిల్లీలో రామ్‌చరణ్ షూటింగ్

## బర్త్‌డే సందర్భంగా టీజర్‌కు ప్లాన్

రామ్‌చరణ్ దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో ఓ స్పోర్ట్స్ డ్రామా సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా తాజాగా హైదరాబాద్‌లో ఓ కీలక షెడ్యూల్ పూర్తి చేసుకున్నట్లు తెలిసింది. దీనిలో భాగంగా చరణ దివ్యేందులపై క్రికెట్ నేపథ్య సన్నివేశాలు తెరకెక్కించారు. కాగా, తదుపరి షెడ్యూల్ మార్చి తొలి వారం నుంచి ఢిల్లీలో మొదలు కానుందని సమాచారం. ఆ షెడ్యూల్‌లో రామ్‌చరణ్‌తో పాటు ప్రధాన తారాగణంపై కుస్తీ నేపథ్య సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. కథ పరంగా ఈ సినిమాలో క్రికెట్, కుస్తీతోపాటు మరికొన్ని ఆటలకు ప్రాధాన్యముంది. చరణ్ దీంట్లో అందర్నీ ఆశ్చర్యపరిచేలా ఓ కొత్త క్యారెక్టరైజేషన్‌లో కనిపించనున్నారు. ఈ సినిమాకు 'పెద్ది' అనే పేరుతో పాటు మరో రెండు టైటిల్స్ పరిశీలనలో ఉన్నాయని తెలుస్తోంది. మార్చి 27న రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా టైటిల్ టీజర్ విడుదలయ్యే అవకాశముంది. ఈ చిత్రానికి రెహమాన్ సంగీత దర్శకుడిగా, రత్నవేలు సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు.



# బాలీవుడ్‌లో స్త్రీ పాత్రలకు తక్కువ ప్రాధాన్యత : కంగనా

డైరెక్టర్ అనురాజ్ బసు దర్శకత్వం వహించిన గ్యాంగ్ స్టర్ చిత్రంతో కంగనా బాలీవుడ్ తెరంగేట్రం చేసింది. ఇందులో ఆమె నటనకు ప్రసంసలు అందుకుంది. ఆ తర్వాత ఫ్యాషన్ సినిమాతో సూపర్ హిట్ ఖాతాలో వేసుకుంది. ఈ చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా జాతీయ అవార్డు అందుకుంది. హిందీలో క్వీన్, మణికర్ణక, తను వెడ్స్ మను వంటి చిత్రాలతో స్టార్ డమ్ అందుకుంది. తెలుగులో ప్రభాస్ నటించిన ఏక్ నిరంజన్ చిత్రంలో నటించింది కంగనా. ఈ మూవీతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది. ఆమె నటించిన తను వెడ్స్ మను సినిమా రూ.100 కోట్లు దాటిన తొలి హీరోయిన్ సెంట్రిక్ సినిమాగా నిలిచింది. ఇప్పుడు రాజకీయాల్లోకి అడుగుపెట్టింది. ముక్కుసూటిగా మాట్లాడడంతో బాలీవుడ్ పెద్దలు ఆమెను దూరం పెట్టారు. ఆమెకు అవకాశాలు రాకుండా అడ్డుకున్నారు. దీంతో తనే నిర్మాతగా మారి సినిమాలను నిర్మిస్తుంది. ఇప్పుడు బీజీపీ పార్టీలో చేరింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్ లోని మండి నుంచి ఆమె ఎంపిగా పోటీ చేసి ఘన విజయం సాధించింది. తాజాగా బాలీవుడ్ పై షాకింగ్ కామెంట్స్ చేసింది కంగనా. బాలీవుడ్ సినిమాల్లో వివాహబంధాన్ని తప్పుగా చూపిస్తున్నారని ఆమె అన్నారు. అంతే కాదు బాలీవుడ్ సినిమాల్లో స్త్రీల విలువను తగ్గించే సందర్భాలెన్నో చూశాను అని కంగనా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com